DATE: 25-02-2022 RNI NO : TELTEL/2021/81092 prajamantalu, Jagitial

# ప్రజా మంటలు

తెలుగు జాతీయ దినపత్రిక

ఎడిటర్: సిహెచ్.వి. ప్రభాకర్ రావు

సంపుటి(Volume) : 2
సంచిక(Issue) : 242
పేజీలు - 10
వెల: రూ 5/-

prajamantalu.com

శుక్రవారం 25 ఫిబ్రవరి, 2022



రైతులకు మేం అన్నం పెడితే...
బీజేపీ సున్నం పెడుతోంది
5లో



బయ్యారం ఉక్కుపై విభజనచట్టంలో ఉంది
జిల్లా ఏర్పాటుతోనూ మానుకోట అభివృద్ధి: వినోద్
5లో

tPublished From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnagar, Mancherial, Medak, Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla, Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yadadri Bhuvanagiri,



# ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం

తెల్లవారుజామునే బాంబర్లతో మొదలైన దాడి

ఎదురుదాడికి దిగిన ఉక్రెయిన్

- రష్యన్ ఫైటర్ జెట్లను కూల్చేసినట్లు ప్రకటన
- 70 లక్ష్యాలను ధ్వంసం చేసినట్లు రష్యా ప్రకటన
- కీవ్ సమీపంలో కూలిన ఉక్రెయిన్ యుద్ధవిమానం
- యుద్ధం నేపథ్యంలో ఉక్రెయిన్‌లో మార్షల్ లా విధింపు
- ప్రాణాలు కాపాడుకునేందుకు సురక్షిత ప్రాంతాలకు ప్రజలు
- నేడు మరోమారు భద్రతామండలి అత్యవసర భేటీ
- రష్యా దాడిపై ప్రపంచ దేశాల ఆగ్రహం
- ఉక్రెయిన్‌కు అండగా నిలిచిన అమెరికా తదితర దేశాలు

మాస్కో,ఫిబ్రవరి24: ప్రపంచ దేశాలు భయపడినట్లుగగానే.. ఉక్రెయిన్‌పై రష్యా సమరభేరి మోగించింది. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఉక్రెయిన్‌పై మిలటరీ ఆపరేషన్‌కు ఆదేశించారు. ఉక్రెయిన్ ప్రభుత్వాన్ని గద్దె దించడమే లక్ష్యమని పుతిన్ ప్రకటించారు. ఆయన ప్రకటనతో రష్యా బలగాలు దూకుడు పెంచాయి. ఉక్రెయిన్‌పై దూసుకెళ్లేందుకు దాడులకు దిగాయి. గురువారం తెల్లవారుజాము నుంచే ఉక్రెయిన్‌పై దాడులు కొనసాగిస్తోంది. దీంతో ఆ దేశ సరిహద్దుల్లో బాంబుల మోత మోగుతోంది. ముందు నుంచి అలుముకున్న యుద్ధమేఘాలు అమల్లోకి వచ్చాయి. ముందు నుంచి దూకుడు ప్రదర్శించిన రష్యా.. ఉక్రెయిన్‌పై దాడికి దిగింది. రష్యా దాడుల నేపథ్యంలో ఉక్రెయిన్ కూడా ఎదురుదాడికి దిగింది. దీంతో ఇక ప్రత్యక్ష యుద్ధం అనివార్యం అయ్యింది. ప్రపంచ దేశాలన్నీ ప్రతిఘటిస్తున్నా.. యుద్ధానికి కాలుదువ్వింది. అమెరికా హెచ్చరికల నేపథ్యంలో ఒక కాలు వెనక్కి వేసినట్లు కనిపించినా..ఉక్రెయిన్ ఒక అడుగు ముందుకు వేయడంతో రష్యా రెండడుగులు ముందుకు వేసింది. అర్ధరాత్రి సమయంలో ఉన్నపళంగా దాడికి దిగిన రష్యా.. ఉక్రెయిన్ ఊపిరి పీల్చుకోకుండా ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది. ఎయిర్ బేస్‌లపై దాడి, ఎయిర్‌పోర్ట్ లపై అటాక్, విద్యుత్ వ్యవస్థపై దాడి.. ఇవన్నీ చూస్తుంటే.. పక్కా ప్రణాళికతో దాడికి దిగినట్లు అర్థం అవుతుంది. కీ జోన్స్‌పై దాడి చేసి.. ఎదురుదాడి చేయకుండా

- మిగతా 2లో




## కేవలం రష్యాను రక్షించుకోవడానికే ఉక్రెయిన్‌పై యుద్ధం

మా భాగస్వామ్య దేశాలు అర్థం చేసుకోవాలి

యుద్ధం ప్రారంభానంతరం పుతిన్ ప్రకటన

దాడిని సమర్థించుకున్న రష్యా

గత పరిణామాలపై ఎందుకు నోరు మెదపలేదన్న పుతిన్



మాస్కో,ఫిబ్రవరి24: ఉక్రెయిన్‌పై యుద్ధం ప్రారంభమైన తర్వాత రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ తొలిసారి ప్రెస్‌మీట్ ఏర్పాటు చేశారు. భారత కాలమానం ప్రకారం గురువారం రాత్రి రష్యా రాజధాని మాస్కోలో ఈ సమావేశం నిర్వహించారు. ఇందులో ఉక్రెయిన్ తోయుద్ధం కొనసాగింపుపై కీలక ప్రకటన చేశారు. 'గ్లోబల్ ఎకానమీలో మేం కూడా భాగమే. అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలను పాడు చేయడానికి మేం ఎలాంటి ప్రణాళికలు చేపట్టడం లేదు. అది మా

- మిగతా 2లో

## యుద్ధాన్ని ఆపండి

తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు

ఉక్రెయిన్ ప్రజలకు అండగా ఉంటాం

అమెరికా బలగాలు యుద్ధంలోకి దిగవు

- రష్యా దాడులపై అమెరికా అధ్యక్షుడి కీలక ప్రకటన
- రష్యా ఆర్థిక మూలాలపై ఆంక్షలు
- ఫండ్ రైజింగ్‌ను నిలిపివేత
- 4 బ్యాంకుల లావాదేవీలపై పూర్తిగా నిషేధం
- 250 బిలిలయన్ డాలర్ల రష్యన్ బ్యాంకుల ఫ్రీజ్
- 3 ట్రిలియన్ డాలర్ల ఆస్తుల సీజ్
- తక్షణం హింసకు స్వస్తి పలకండి
- చర్చల ద్వారా సమస్యను పరిష్కారించుకోండి
- పుతిన్‌కు ప్రధాని మోడీ ఫోన్



మాస్కో,ఫిబ్రవరి24: రష్యా– ఉక్రెయిన్ దేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతోన్న నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ కీలక ప్రకటన చేశారు. రష్యాపై మరిన్ని ఆర్థిక ఆంక్షలను విధిస్తున్నట్లు తెలిపారు. యూఎస్ పెట్టుబడిదారుల నుంచి రష్యాకు ఫండ్ రైజింగ్‌ను నిలిపివేస్తామన్నారు. 4 బ్యాంకుల లావాదేవీలపై పూర్తిగా నిషేధం విధిస్తున్నట్లు.. అదేవిధంగా250 బిలిలయన్ డాలర్ల వీటీబీ బ్యాంక్ (రష్యన్ ప్రభుత్వ బ్యాంకు) ఆస్తులను ఫ్రీజ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. దీంతో పాటు 3 ట్రిలియన్ డాలర్ల ఆస్తులను కూడా సీజ్ చేస్తామన్నారు. ఉక్రెయిన్ విషయంలో రష్యా అనుసరిస్తోన్న వైఖరికి వ్యతిరేకంగా రేపు (ఫిబ్రవరి 26) 30 దేశాల ప్రతినిధులతో సమావేశం

- మిగతా 5లో

## యుద్ధ పరిస్థితులపై భారత్ అప్రమత్తం

శాంతియుత పరిష్కారం కోరుకుంటున్నట్లు ప్రకటన

ఉక్రెయిన్‌లో భారత పౌరులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక

వెనక్కి రప్పించాలంటూ కేంద్రానికి రాష్ట్రాల లేఖలు

యుద్ధం నేపథ్యంలో వెనక్కి మళ్లిన ఎయిర్ ఇండియా విమానం

కేంద్ర కేబినేట్ అత్యవసర భేటీ

న్యూఢిల్లీ,ఫిబ్రవరి24: ఉక్రెయిన్– రష్యా పరిణామాలను నిశితంగా పరిశీలిస్తున్నట్లు భారత్ పేర్కొంది. ఉక్రెయిన్‌పై రష్యా దండెత్తిన నేపథ్యంలో ఈ మేరకు స్పందించింది. భారత్ ఈ అంశంపై తటస్థ వైఖరి అవలంభిస్తుందని విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. సమస్యకు శాంతియుత పరిష్కారం కోరుకుంటు న్నట్లు వెల్లడించింది. మరోవైపు, ఉక్రెయిన్‌లోని భారతీయుల భద్రతపై దృష్టి పెట్టామని విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. ఉక్రెయిన్‌లోని తమ రాయబార కార్యాలయం తెరిచే ఉంటుందని స్పష్టం చేసింది. అత్యవసర సమాచారం కోసం.. 24 గంటలు అందుబాటులో ఉండే కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని వివరించింది. ఉక్రెయిన్‌లో తాజా ఉద్రిక్త పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని అక్కడ చిక్కుకుపోయిన భారతీయుల కోసం కేంద్ర ప్రభుత్వం తాజాగా కీలక సూచన చేసింది.

- మిగతా 2లో

## ఉక్రెయిన్‌పై యుద్ధంతో మార్కెట్ల పతనం

- 8లక్షల కోట్ల ఇన్వెస్టర్ల సంపద ఆవిరి
- సెన్సెక్స్ 2702 పాయింట్ల నష్టం
- నిఫ్టీ సైతం 815పాయింట్ల పతనం
- ప్రపంచ మార్కెట్లపైనా తీవ్ర ప్రభావం



## ప్రజానాడి




## ఝార్ఖండ్‌లో ఘోర ప్రమాదం

- దామోదర్ నదిలో అర్ధరాత్రి పడవ బోల్తా
- 14 మంది గల్లంతు, ప్రాణాలు దక్కించుకున్న నలుగురు
- కొనసాగుతున్న సహాయక చర్యలు



## ప్రపంచ ఫార్మా హబ్‌గా హైదరాబాద్

లైఫ్ సైన్సెస్ రంగంలో కీలకపాత్ర

వెన్నెముకగా నిలుస్తున్న జీనోమ్ వ్యాలీ

బిల్ గేట్స్‌తో చర్చకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నా

బయో ఏషియా సదస్సులో మంత్రి కేటీఆర్

కొవిడ్ సవాళ్లపై సదస్సులో చర్చ

హైదరాబాద్,ఫిబ్రవరి24: దేశంలోనే కాదు ప్రపంచ వ్యాప్తంగా లైఫ్ సైన్సెస్ రంగంలో హైదరాబాద్ కీలకపాత్ర పోషిస్తుందని చెప్పడానికి గర్విస్తున్నాను అని రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. లైఫ్ సైన్సెస్ రంగం అభివృద్ధిలో బయో ఆసియా సదస్సు క్రియాశీలక పాత్ర పోషిస్తుందని కేటీఆర్ పేర్కొన్నారు. రెండు రోజుల పాటు వర్చువల్‌గా జరగనున్న 19వ ఎడిషన్ బయో ఆసియా సదస్సును మంత్రి కేటీఆర్ గురువారం ఉదయం ప్రారంభించారు. లైఫ్ సైన్సెస్ ఆరోగ్య రంగంలో కొవిడ్ సవాళ్లపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ ప్రసంగించారు. రాష్ట్రంలో లైఫ్ సైన్సెస్ రంగం అభివృద్ధికి జీనోమ్ వ్యాలీ వెన్నెముకగా నిలుస్తుందని కేటీఆర్ స్పష్టం చేశారు. బిల్ గేట్స్‌తో జరిగే చర్చ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు తెలిపారు. లైఫ్ సైన్సెస్ రంగంలో సుమారు 215 సంస్థల నుంచి

- మిగతా 5లో



# ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం



**మొదటిపేజీ తరువాయి..**

పక్కాగా ప్రణాళిక రచించినట్లు రష్యా తాజా దాడులు స్పష్టం చేస్తున్నాయి. డోన్‌బోస్ నుంచి ఉక్రెయిన్ బలగాలు వెనక్కి వెళ్లాలని పుతిన్ హెచ్చరించారు. ఎక్కడికక్కడ శిబిరాలు, ఆయుధాలను వదిలేసి వెళ్లిపోవాలని హెచ్చరిక చేశారు. మరోవైపు ఉక్రెయిన్ సయితం మరింత అప్రమత్తమైంది. రష్యా దూకుడుకు ధీటుగా వ్యవహరిస్తోంది. భారీగా రిజర్వు, అదనపు బలగాలను మోహరించింది. ఉక్రెయిన్‌లో నెలరోజుల పాటు ఎమర్జెన్సీ ప్రకటించింది. ముందు జాగ్రత్తగా ఎయిర్ స్పేస్‌ను కూడ మూసివేసింది. ప్రస్తుతం రష్యా, ఉక్రెయిన్‌లో అత్యవసర పరిస్థితి కొనసాగుతోంది. అలాగే వైద్య శిబిరాలను సయితం ఏర్పాటు చేశారు. ఉన్నపళంగా దాడికి తెగబడ్డ రష్యా.. ఉక్రెయిన్‌ను చుట్టుముట్టింది. మూడు వైపుల నుంచి దాడి చేసి.. ఉక్కిరిబిక్కిరి అయ్యేలా చేసింది. ఏ వ్యవస్థ పనిచేయాలన్నా.. విద్యుత్ అంత్యంత ముఖ్యం. ఆ వ్యవస్థను దెబ్బతీసేలా రష్యా దాడులకు తెగపడింది. ఆ తర్వాత దాడులపై ఎదురుదాడి చేయాలంటే ఎయిర్‌పోర్ట్‌లు, ఎయిర్‌బేస్‌లు చాలా కీలకం. ఏకంగా 11 నగరాల్లో.. ఆయా కేంద్రాలను సెర్చ్ చేసి అటాక్ చేసింది. అయితే రష్యా దాడులతో అప్రమత్తమైన ఉక్రెయిన్ ఎదురుదాడి ప్రారంభించింది. రష్యాకు ధీటుగా భారీగా బలగాలను మోహరించి కీలక ప్రాంతాల్లో తిరుగుబాటు మొదలు పెట్టింది. రష్యా ఫైటర్ జెట్‌ను ఉక్రెయిన్ బలగాలు కూల్చివేశాయి. 5 రష్యా విమానాలు, హెలికాప్టర్‌ను కూల్చివేసినట్లు ఉక్రెయిన్ ప్రకటించింది. ఈ మేరకు ఐదు రష్యా ఎయిర్‌క్రాఫ్ట్, జెట్లు, హెలికాప్టర్లను కూల్చేశామని ఉక్రెయిన్ సైన్యం వెల్లడించింది. రష్యా యుద్ధం ప్రకటించడంతో ఉక్రెయిన్ ప్రభుత్వం మార్షల్ లా విధించింది. పౌరులు సురక్షిత ప్రాంతాల్లో ఆశ్రయం పొందాలని ఉక్రెయిన్ ఆదేశించింది. తమ దేశ భద్రత కోసం సైనికులు పూర్తి స్థాయిలో పోరాడతారని ఉక్రెయిన్ ప్రభుత్వం తెలిపింది. మరోవైపు రష్యా బలగాలు ఎయిర్ స్ట్రైక్స్‌తో పాటు మిస్సైల్స్‌తో ఉక్రెయిన్‌పై అటాక్ చేస్తున్నాయి. ఎయిర్ డిఫెన్స్ కెపాసిటీని కూల్చేశామని రష్యా తెలిపింది. ఆ దేశ సరిహద్దుల్లో సుమారు 1.50 లక్షల మంది సైనికులు మోహరించారు. మరోవైపు బెలారస్ సైనికులు కూడా రష్యా దళాలతో చేరారు. ఉక్రెయిన్‌లో మిలిటరీ ఆపరేషన్ పెద్ద ఎత్తున జరుగుతోందని రష్యా గురువారం ప్రకటించింది. ఉక్రెయిన్‌పై ప్రత్యేక మిలిటరీ ఆపరేషన్‌కు తానే నిర్ణయం తీసుకున్నానని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ అన్నారు. కాగా, పుతిన్ ప్రకటన అనంతరం యుద్ధం ప్రారంభించిన రష్యా సైన్యం ఇప్పటి వరకు ఉక్రెయిన్‌లోని 70 లక్ష్యాలను ధ్వంసం చేసినట్లు రష్యా పేర్కొంది. ఉక్రెయిన్ సరిహద్దు వెంట రష్యా 1,50,000 నుంచి 2,00,000 సైన్యాన్ని మోహరించినట్లు రష్యా తెలిపింది. కాగా, ఉక్రెయిన్‌ను పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకునేంత వరకు ఈ యుద్ధం కొనసాగించాలని రష్యా నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. మరోవైపు ఉక్రెయిన్ రాజధాని నగరం కీవ్ సమీపంలో ఆ దేశ యుద్ధ విమానం గురువారం కూలిపోయింది. ఈ విమానంలో సుమారు 14 మంది ఉన్నట్లు తెలుస్తోంది. ఉక్రెయిన్ ఎమ్జ్గ÷న్సీ సర్వీసెస్‌ను ఉటంకిస్తూ ఓ వార్తా సంస్థ ఈ వివరాలనుతెలిపింది. ఈ విమానం కూలిపోవడానికి కారణాలు తెలియడం లేదు. ఉక్రెయిన్‌పై రష్యా గురువారం ప్రారంభించిన యుద్ధంలో దాదాపు 40 మంది ప్రాణాలు కోల్పోయారు.
ఈ నేపథ్యంలో ఐక్యరాజ్య సమితి భద్రతామండలి మరోసారి అత్యవసరంగా సమావేశమైంది. సైనిక మోహరింపు, తదితర పరిణామాలపై ఈ సమావేశంలో చర్చ సాగింది. యుద్ధ పరిణామాలు ఉక్రెయిన్‌కు వినాశకరమని, ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు చాలా దూరం అవుతాయని ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రెస్ అన్నారు. మానవతా దృక్పథంతో యుద్ధాన్ని ఆపాలని రష్యాను ఆయన విజ్ఞప్తి చేశారు. కాగా ఉక్రెయిన్‌లోని ప్రధాన నగరాలపై రష్యా దాడి నేపథ్యంలో ప్రాణాలు కాపాడుకునేందుకు ప్రజలు దేశాన్ని విడిచి వెళ్తున్నారు. పెద్ద సంఖ్యలో కార్లలో బయలుదేరిన ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్తున్నారు. దీంతో రోడ్లపై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ప్రధానంగా రాజధాని కీవ్‌ను విడిచి ప్రజలు పారిపోతున్నారు. ఉక్రెయిన్‌లో ప్రముఖులు, రాజకీయ నాయకులు బంకర్లలో తలదాచుకొని ప్రాణాలు రక్షించుకుంటున్నారు. రష్యా దాడులపై ఉక్రెయిన్ తీవ్రంగా స్పందించింది. రష్యా పూర్తిస్థాయి యుద్ధాన్ని ప్రకటించిందని, ఇది దురాక్రమణ చర్యగా అధ్యక్షుడు జెలెన్‌స్కీ వర్ణించారు. శాంతియుత నగరాలపై దాడులకు పాల్పడుతున్నారని, ప్రపంచ దేశాలు పుతిన్‌ను నిలువరించాలన్నారు. యుద్ధం ఆపడం ఐరాస బాధ్యతనని పేర్కొన్నారు. రష్యా దాడుల నుంచి తమ దేశాన్ని కాపాడుకుంటామని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తెలిపారు. ముందుగా దౌత్యపరమైన ప్రయత్నాలే చేస్తామన్న జెలెన్ స్కీ.. రెండో ప్రణాళికగా బలగాలను దింపుతామని తెలిపారు. రష్యా మిలిటరీ ఆపరేషన్ నేపథ్యంలో ఉక్రెయిన్ ప్రజలకు అధ్యక్షుడు జెలెన్ స్కీ సందేశం అందించారు. రష్యా కేవలం సైనిక స్థావరాలపైనే దాడి చేస్తోందని, సైన్యం తన పని తాను చేసుకుబోతుందన్నారు. ఉక్రెయిన్ ప్రజలు భయాందోళనకు గురికావొద్దని తెలిపారు.
మరోవైపు ఉక్రెయిన్ అధ్యక్షుడితో అమెరికా ప్రెసిడెంట్ ఫోన్‌లో చర్చలు జరిపారు. రష్యాపై మరిన్ని కఠిన ఆంక్షలు విధిస్తామని జో బైడెన్ తెలిపారు. ఇప్పటికే ఉక్రెయిన్‌కు బ్రిటన్,ఫ్రాన్స్ మద్దతు తెలిపాయి. రష్యా- ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో శుక్రవారం జీ-7 దేశాలతో జో బైడెన్ అత్యవసర సమావేశం నిర్వహించ నున్నారు. నాటో కూటమికి సహకరిస్తామని తెలిపారు. ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం ప్రకటించడాన్ని పలు ప్రపంచ దేశాలు తప్పుబట్టాయి. అమెరికా, యూరోపియన్ యూనియన్, ఇటలీ, యూకేతో పాటు పలు దేశాలు ఉక్రెయిన్‌కు మద్దతుగా నిలిచాయి. రక్తపాతం సృష్టిస్తున్న రష్యాపై ఆయా దేశాల అధ్యక్షులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. క్రెయిన్‌పై రష్యా యుద్ధాన్ని ప్రకటించడాన్ని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ తీవ్రంగా ఖండించారు. ఉక్రెయిన్ ప్రజలకు తమ మద్దతు ఉంటుందని ప్రకటించారు. రష్యా దాడి అన్యాయమైనది అని ఆగ్రహం వెలిబుచ్చారు. ఉక్రెయిన్‌లో జరిగే విధ్వంసానికి రష్యా మాత్రమే బాధ్యత వహించాలని బైడెన్ హెచ్చరించారు. ఉక్రెయిన్‌కు మద్దతుగా ఆయా దేశాల మద్దతు కూడగడు తామని చెప్పారు. రష్యా, ఉక్రెయిన్ పరిణామాలను గమనిస్తున్నామని చెప్పారు. శుక్రవారం జీ-7 దేశాలతో సమావేశం ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. నాటో కూటమికి సహకరిస్తామని తెలిపారు. ఉక్రెయిన్‌కు మద్దతుగా ఉంటామని బ్రిటన్ ప్రధాని బోరిస్ జాన్సన్ స్పష్టం చేశారు. రష్యా అధ్యక్షుడు ఉక్రెయిన్‌లో రక్తపాతం సృష్టించడం సరికాదన్నారు. రష్యాకు వ్యతిరేకంగా యూకేతో పాటు దాని మిత్రదేశాలు ఉంటాయన్నారు. ఉక్రెయిన్‌లో రష్యా బాంబు దాడులు తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేశాయని బోరిస్ జాన్సన్ పేర్కొన్నారు. ఇప్పటికే ఉక్రెయిన్‌లో దాడులపై ఆ దేశ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో ...ను అని తెలిపారు. ఉక్రెయిన్‌లో జరుగుతున్న విధ్వంసానికి రష్యానే బాధ్యత వహించాలని యూరోపియన్ యూనియన్ చీఫ్ ఉర్సులా వాన్ డెర్ లియోన్ ప్రకటించారు. ఉక్రెయిన్‌పై రష్యా దాడిని తీవ్రంగా ఖండించారు. రష్యాకు తగిన బుద్ధి చెప్తామన్నారు. అమాయక ప్రజల ప్రాణాలను బలి తీసుకోవడం సరికాదన్నారు. ఉక్రెయిన్‌కు ఎల్లప్పుడూ అండగా ఉంటామని స్పష్టం చేశారు. ఉక్రెయిన్‌పై రష్యా మిలటరీ దాడి చేయం అన్యాయమని ఇటలీ ప్రధాని మారియో ప్రకటించారు. రష్యా బాంబుల దాడిని ఎవరూ సమర్థించరు అని స్పష్టం చేశారు. ఈ యుద్ధాన్ని ఇటలీ ప్రభుత్వం తీవ్రంగా ఖండిస్తుందని చెప్పారు. నాటో కూటమికి సహకరిస్తామని తెలిపారు. ఉక్రెయిన్ ప్రజలకు తమ మద్దతు ఉంటుందన్నారు. రష్యాకు వ్యతిరేకంగా యూరోపియన్ యూనియన్ దేశాలతో కలిసి పని చేస్తామన్నారు. ఉక్రెయిన్‌పై రష్యా దాడిని నాటో సెక్రటరీ జనరల్ జెన్స్ స్టో÷-టలెన్ బర్గ్ తీవ్రంగా ఖండించారు. రష్యా దూకుడు చర్యలపై చర్చించేందుకు నాటో కూటమి సమావేశమవుతుందని తెలిపారు. ఉక్రెయిన్‌లో చిక్కుకున్న భారతీయులను, విద్యార్థులను సురక్షిత ప్రాంతాలకు చేర్చేందుకు భారత ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది.

## కేవలం రష్యాను రక్షించుకోవడానికే ఉక్రెయిన్‌పై యుద్ధం

**మొదటిపేజీ తరువాయి..**

లక్ష్యం కానే కాదు. కేవలం రష్యాను రక్షించుకోవడానికే ఉక్రెయిన్‌పై యుద్ధం చేస్తున్నాం. మా భాగస్వామ్య దేశాలు కూడా మమ్మల్ని అర్థం చేసుకోవాలి. యుద్ధం కొనసాగింపు విషయంలో వెనక్కు తగ్గేది లేదు. ' అని పుతిన్ చెప్పుకొచ్చారు. ప్రస్తుత పరిణామాలు ఉక్రెయిన్‌పై కానీ, ఉక్రెయిన్ ప్రజలపై కానీ దాడి చేయాలనే కోరికకు సంబంధించినవి కాదని రష్యా అధ్యక్షుడు వ్లదిమిర్ పుతిన్ చెప్పారు. ఉక్రెయిన్‌ను నిర్బంధించినవారు దానిని తమ దేశానికి వ్యతిరేకంగా ఉపయోగించుకోవడానికి చేస్తున్న ప్రయత్నాల నుంచి రష్యాను కాపాడుకోవడానికి సంబంధించనవే ఈ పరిణామాలని తెలిపారు. యూనియన్ ఆఫ్ సోవియెట్ సోషలిస్ట్ రిపబ్లిక్స్ (యూఎస్ఎస్ఆర్) ఏర్పడినపుడు కానీ, రెండో ప్రపంచ యుద్ధం తర్వాత కానీ, నేడు ఉక్రెయిన్‌లో భాగంగా ఉన్న ప్రాంతాల్లో జీవిస్తున్న ప్రజలు ఏవిధంగా తమ జీవితాలను నిర్మించుకోవా లనుకుంటున్నారో వారిని అడగలేదన్నారు. నేడు ఉక్రెయిన్‌లో జీవిస్తున్న ప్రజలు, ఈ పని చేయాలని కోరుకునే ఎవరైనా, స్వేచ్ఛాయుతంగా ఎంపిక చేసుకునే హక్కును తప్పనిసరిగా వినియోగించుకోగలగాలని చెప్పారు.

## వాట్సాప్ అడ్మిన్‌కు ఊరట

**అభ్యంతరకర మెసేజీలకు బాధ్యత లేదన్న హైకోర్టు**

కొచ్చి,ఫిబ్రవరి24: వాట్సాప్ గ్రూపులోని సభ్యులు పెట్టే అభ్యంతరకరమైన పోస్టులకు ఆ గ్రూప్ అడ్మిన్ బాధ్యతవహించనక్కర్లేదని కేరళ హైకోర్టు తీర్పు చెప్పింది. ఓ వాట్సాప్ గ్రూప్ అడ్మిన్‌పై కేరళ పోలీసులు నమోదు చేసిన ఆరోపణలను రద్దు చేసింది. జస్టిస్ కౌసర్ ఎడప్పగథ్ ధర్మాసనం ఫిబ్రవరి 23న ఈ తీర్పు చెప్పింది. లైంగిక నేరాల నుంచి బాలల పరిరక్షణ చట్టం (పోక్సో), ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టం క్రింద ఈ కేసును నమోదు చేశారు. కేరళలోని అలప్పుజ జిల్లాకు చెందిన మాన్యువల్ (22) ఓ వాట్సాప్ గ్రూపును ప్రారంభించారు. ఆయన దీనికి అడ్మిన్‌గా వ్యవహరిస్తున్నారు. 2020 మార్చి 29న ఈ గ్రూపులోని ఓ మెంబర్ పోర్న్ వీడియోను పోస్ట్ చేశారు. బాలలు లైంగిక చర్యలకు పాల్పడుతున్నట్లు ఈ వీడియోలో ఉంది. 2020 జూన్ 15న ఎర్నాకుళం సిటీ పోలీసులు ఆ మెంబర్‌పై కేసు నమోదు చేశారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టం, 2000; పోక్సో చట్టంలోని సెక్షన్లు 13, 14, 15 ప్రకారం కేసు నమోదు చేశారు. ఆ తర్వాత మాన్యువల్‌ను రెండో నిందితునిగా చేర్చారు. ఆయన ఈ గ్రూపును క్రియేట్ చేసినందుకు ఈ చర్య తీసుకున్నారు. పోలీసులు తుది నివేదికను సమర్పించారు. దీనిపై ఎర్నాకుళంలోని అదనపు సెషన్స్ కోర్టు విచారణ జరుపుతోంది. అయితే మాన్యువల్ హైకోర్టును ఆశ్రయించారు. తాను కేవలం గ్రూపు అడ్మిన్‌ను మాత్రమేనని, తనను ఈ కేసులో నిందితునిగా చేర్చడం సరికాదని వాదించారు. హైకోర్టు ఆయనకు ఈ కేసు నుంచి విముక్తి కల్పించింది.

## యుద్ధ పరిస్థితులపై భారత్ అప్రమత్తం

**మొదటిపేజీ తరువాయి..**

ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో ఎక్కడున్నవారు అక్కడే ఉండాలని, ఎట్టిపరిస్థితుల్లో వేరే ప్రదేశాలకు వెళ్లొద్దని కోరింది. 'ఉక్రెయిన్‌లో తీవ్ర అనిశ్చితి నెలకొంది. భారతీయులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. హాస్టళ్లు, ఇళ్లు, వసతి గృహాలు ఇలా ఎక్కడున్నవారు అక్కడే సురక్షితంగా ఉండండి. పశ్చిమ ఉక్రెయిన్ ప్రాంతాల నుంచి రాజధాని కీవ్‌కు బయల్దేరిన వారు తిరిగి మీ ప్రాంతాలకు తాత్కాలికంగా వెళ్లిపోండి' అని ఉక్రెయిన్‌లోని భారత ఎంబసీ ట్వీట్ చేసింది. అలాగే తదుపరి ఏదైనా సమాచారం ఉంటే ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తామని రాయబార కార్యాలయం పేర్కొంది. అప్పటి వరకు ఎక్కడున్నవారు అక్కడే భద్రంగా ఉండాలని తెలియజేసింది. ఈ నేపథ్యంలో ఉక్రెయిన్‌లోని భారతీయులను కేంద్రం అప్రమత్తం చేసింది. ఆ దేశంలో తీవ్ర అనిశ్చితితో కూడిన పరిస్థితులు ఉన్నాయని.. ఉక్రెయిన్‌లో ప్రజలు తాము ఉన్న స్థలాల్లోనే ఉండాలని సూచించింది. ఇళ్లు, వసతిగృహాలు, శిబిరాల్లో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని పేర్కొంది. ఈ మేరకు భారత రాయబార కార్యాలయం సూచనలు చేసింది. ఉక్రెయిన్ రాజధాని కీవ్‌కు వస్తున్న ప్రజలు వెనక్కి మళ్లాలని కాగా, ఉక్రెయిన్ విమానాశ్రయంలో పలువురు భారతీయుల స్వదేశానికి వచ్చేందుకు పడిగాపులు కాస్తున్నారు. విమానాశ్రయంలో సహాయం కోసం ఎదురు చూస్తున్నారు. 'కొన్ని గంటలుగా విమానం కోసం ఎదురుచూస్తున్నాం. భారత రాయబార కార్యాలయాన్ని సంప్రదించేందుకు ప్రయత్నిస్తున్నాం. ఇక్కడ ఎవరూ స్పందించట్లేదు' అని వాపోయారు. అయితే, ఉక్రెయిన్‌కు వెళ్లాల్సిన ఎయిర్‌ఇండియా విమానం ఉద్రిక్తతల నేపథ్యంలో.. మార్గమధ్యలో ఉండగానే దిల్లీకి తిరుగుపయనమైంది. అయితే,



భారతీయులను వెనక్కి తీసుకొచ్చేందుకు ఇతర దారులను అన్వేషిస్తున్నట్లు కేంద్రం స్పష్టం చేసింది. అక్కడి భారత పౌరులు, విద్యార్థుల సంక్షేమమే తమ తొలి ప్రాధాన్యమని తేల్చిచెప్పింది. రష్యా దాడికి ముందు.. బుధవారం అర్ధరాత్రి ఐరాస భద్రతామండలి నిర్వహించిన అత్యవసర సమావేశంలో ఉక్రెయిన్ సంక్షోభంపై భారత్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ పరిణామాలపై జాగ్రత్తగా ముందుకు వెళ్లకపోతే, ఈ ప్రాంతం అస్థిరంగా మారుతుందని హెచ్చరించింది. ఇరు దేశాల మధ్య పరిస్థితులు.. పెను సంక్షోభానికి దారితీసే ప్రమాదం ఉంది. ఈ పరిణామాలతో తీవ్ర ఆందోళన చెందుతున్నాము. ప్రస్తుత పరిస్థితులపై జాగ్రత్తగా ముందుకు వెళ్లకపోతే.. ఈ ప్రాంతంలో శాంతి, భద్రతకు పెను ముప్పు వాటిల్లే అవకాశం ఉంది. ఈ ఉద్రిక్త వాతావరణం మరింత దిగజారేందుకు దోహదం చేసే అన్ని చర్యలకు దూరంగా ఉండాలి. ఈ సంక్షోభం పరిష్కారానికి స్థిరమైన దౌత్య మార్గాలే తగినవని భారత్ విశ్వసిస్తోంది. ఈలోగా శాంతి భద్రతల పరిరక్షణకు సంయమనం పాటించాల్సిన అవసరం ఉంది' అని భారత్ పిలుపునిచ్చింది. ఈ మేరకు ఐరాసలో భారత శాశ్వత ప్రతినిధి టీఎస్ తిరుమూర్తి ప్రకటన చేశారు.

అంతర్జాతీయ చట్టాలను అనుసరించి ఆయా దేశాలు కుదుర్చుకున్న ఒప్పందాలకు అనుగుణంగా వివాదాలను శాంతియుతంగా పరిష్కరించుకోవాలని మనదేశం సూచించింది.ఉక్రెయిన్ - రష్యా యుద్ధం నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కేంద్ర కేబినెట్ మంత్రులతో అత్యవసర సమావేశం కానుంది. కేంద్ర హోం మంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ ఈ సమావేశంలో పాల్గొంటారు. ఉక్రెయిన్ - రష్యా యుద్ధం నేపథ్యంలో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చిస్తారు. రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో ప్రధాని మోదీ మాట్లాడాలని ఉక్రెయిన్ విజ్ఞప్తి చేసిన నేపథ్యంలో ఈ సమావేశానికి ప్రాధాన్యత ఏర్పడింది. ఇదిలావుంటే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో మాట్లాడాలని ఉక్రెయిన్ విజ్ఞప్తి చేసింది. మోదీ ప్రపంచంలోనే శక్తిమంతమైన నేత అని ఆయన మాట్లాడితే పుతిన్ వింటారని విశ్వాసం వ్యక్తం చేసింది. ఉక్రెయిన్‌లో పరిస్థితి చేయిదాటిపోతోందని, మోదీ సాయం చేయాలని భారత్‌లో ఉక్రెయిన్ రాయబారి పొలిఖా కోరారు. ప్రపంచంలో శాంతి తీసుకొచ్చే సత్తా భారత్‌కే ఉందని ఆయన అన్నారు. ఉక్రెయిన్‌లో చిక్కుకున్న భారతీయులను వెనుకకు రప్పించేందుకు తక్షణమే చర్యలు ప్రారంబించాలని కేంద్ర ప్రభుత్వాన్ని వివిధ రాష్ట్రాలు కోరాయి. రష్యా దాడి నేపథ్యంలో తన గగనతలంలో సివిలియన్ విమానాల రాకపోకలను ఉక్రెయిన్ నిషేధించింది. దీంతో దాదాపు 20 వేల మంది భారతీయులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ విదేశీ వ్యవహారాల మంత్రి సుబ్రహ్మణ్యం జైశంకర్‌కు రాసిన లేఖలో, తమ రాష్ట్రానికి చెందిన విద్యార్థులు ఉక్రెయిన్‌లో చిక్కుకున్నారని, వారి భద్రత కోసం చర్యలు తీసుకోవాలని కోరారు. తమ రాష్ట్రానికి చెందినవారు 2,320 మంది ఉక్రెయిన్‌లో చదువుతున్నారని, వీరు తమ చదువుకు ఆటంకం కలగకూడదనే ఉద్దేశంతో ఆ దేశంలోనే ఉన్నారని చెప్పారు. వారికి రక్షణ కల్పించేవిధంగా ఆ దేశ అదికారులతో మాట్లాడాలని కోరారు. ఈ విషయాన్ని ఆయన ట్విటర్ వేదికగా వెల్లడించారు. వారిని సాధ్యమైనంత త్వరగా స్వదేశానికి రప్పించేందుకు చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఉద్ధవ్ థాకరే ఉక్రెయిన్‌లో చిక్కుకున్న మహారాష్ట్రవాసుల భద్రత పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. వీరి విషయంలో కేంద్ర ప్రభుత్వంతో సన్నిహితంగా కలిసి పని చేయాలని రాష్ట్ర ప్రభుత్వ అధికారులను ఆదేశించారు. మహారాష్ట్రకు చెందినవారు, ముఖ్యంగా విద్యార్థులు సురక్షితంగా తిరిగి రావడం కోసం విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖతో కలిసి పని చేయాలని థాకరే ఆదేశించినట్లు ముఖ్యమంత్రి కార్యాలయం వెల్లడించింది.
క్రెయిన్‌లో చిక్కుకున్నవారి భద్రత కోసం కేంద్ర ప్రభుత్వంతో సమన్వయంతో పని చేస్తామని హర్యానా ముఖ్యమంత్రి ఎంఎల్ ఖత్తార్ చెప్పారు. 24/7 కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.
క్రెయిన్‌లో చిక్కుకున్న భారతీయులను తిరిగి రప్పించేందుకు కేంద్ర ప్రభుత్వంతో అన్ని విధాలుగా సహకరిస్తామని ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి తెలిపారు. విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్‌కు రాసిన లేఖలో, విద్యార్థులతో తాము నిరంతరం మాట్లాడుతున్నామని, వారికి అవసరమైన సహాయ, సహకారాలను అందిస్తున్నామని తెలిపారు. ర్ణాటక ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మయ్ మాట్లాడుతూ, తమ రాష్ట్రానికి చెందిన 10 మంది విద్యార్థులు ఉక్రెయిన్‌లో ఉన్నారని, స్వదేశానికి రావడం కోసం ఎదురు చూస్తున్నారని చెప్పారు. ÷లంగాణా బీజేపీ శాఖ అధ్యక్షుడు బండి సంజయ్ కుమార్ విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు రాసిన లేఖలో, తమ రాష్ట్రానికి చెందిన దాదాపు 200 మంది విద్యార్థులు ఉక్రెయిన్లో చిక్కుకున్నారని చెప్పారు. దిలావుండగా, విదేశీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి వీ మురళీధరన్ విలేకర్లతో మాట్లాడుతూ, ఉక్రెయిన్‌లో చిక్కుకున్నవారి కుటుంబ సభ్యులు ఎటువంటి ఆందోళనకు గురికావలసిన అవసరం లేదని చెప్పారు. వారిని తిరిగి భారత దేశానికి రప్పించడానికి కృషి చేస్తున్నామని, ప్రత్యేకంగా ఓ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశామని చెప్పారు. విద్యార్థులతో సహా దాదాపు 18,000 మంది భారతీయులను తిరిగి స్వదేశానికి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఉక్రెయిన్ గగనతలాన్ని మూసివేసినందువల్ల భారతీయులను సురక్షితంగా తరలించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

## ఉక్రెయిన్ నుంచి విద్యార్థులను రప్పించండి

**కేంద్రానికి ఎంపి రంజిత్‌రెడ్డి లేఖ, మంత్రి కేటీఆర్ ట్వీట్**

హైదరాబాద్,ఫిబ్రవరి24: ఉక్రెయిన్ దేశంలో నెలకొన్న పరిస్థితులపై మంత్రి కేటీఆర్ ట్వీట్ చేశారు. ఈ విపత్కర సమయాల్లో ఉక్రెయిన్‌లోని భారతీయ విద్యార్థుల భద్రత కోసం కేంద్ర మంత్రి జయ శంకర్‌కు కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. ఆందోళన చెందుతున్న విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అనేక సందేశాలు అందుతున్నాయని మంత్రి తెలిపారు. భారత ప్రభుత్వం దౌత్య మార్గాల ద్వారా పని చేయగలదని, భారతీయులందరినీ వీలైనంత త్వరగా దేశానికి తిరిగి తీసుకురావాలని కేటీఆర్ కోరారు. ఇదిలావుంటే కేంద్ర విదేశాంగ మంత్రి జయశంకర్‌కు టీఆర్ఎస్ ఎంపీ రంజిత్‌రెడ్డి లేఖ రాశారు. ఉక్రెయిన్‌లో చిక్కుకున్న తెలంగాణ విద్యార్థులను రప్పించాలని లేఖలో పేర్కొన్నారు. విద్యార్థులను క్షేమంగా వెనక్కి తీసుకొచ్చేం దుకు చర్యలు చేపట్టాలని కోరారు. ఉక్రెయిన్ రాజధాని కీవ్ ఎయిర్‌పోర్టులో తెలంగాణ, ఏపీ విద్యార్థులు చిక్కుకుపోయారని ఆ లేఖలో ఆయన పేర్కొన్నారు.

## ఉక్రెయిన్‌పై యుద్ధంతో మార్కెట్ల పతనం

- 8లక్షల కోట్ల ఇన్వెస్టర్ల సంపద ఆవిరి
- సెన్సెక్స్ 2702 పాయింట్ల నష్టం
- నిఫ్టీ సైతం 815పాయింట్ల పతనం
- ప్రపంచ మార్కెట్లపైనా తీవ్ర ప్రభావం




న్యూఢిల్లీ,ఫిబ్రవరి24: ఉక్రెయిన్‌పై రష్యా దాడుల నేపథ్యంలో భారతీయ స్టాక్ మార్కెట్లు కుప్పకూలాయి. గురువారం మార్కెట్ ప్రారంభమైన నిమిషాల వ్యవధిలో రూ.8లక్షల కోట్ల ఇన్వెస్టర్ల సంపద ఆవిరైంది. మార్కెట్ క్యాప్‌లో గణనీయమైన క్షీణత గత ట్రేడింగ్ సెషన్‌లో బీఎస్ఈలో లిస్టయిన కంపెనీల మార్కెట్ క్యాప్ రూ.255.68 లక్షల కోట్లు కాగా, గురువారం భారీ పతనంతో రూ.248.09 లక్షల కోట్ల దిగువకు పడిపోయింది. ఉదయం దలాల్ స్ట్రీట్‌లో ట్రేడింగ్ ప్రారంభం కాకముందే రష్యా సైనిక చర్య ప్రకటన వార్త వెలువడింది. ఈ క్రమంలో మార్కెట్లకు ఎలాగూ నష్టాలు తప్పవన్న అంచనాలు ఏర్పడ్డాయి. ట్రేడింగ్ మొదలవ్వడమే తడువుగా మదుపరులు అమ్మకాలకు దిగారు. ఫలితంగా 55,418.45 పాయింట్ల వద్ద 2 వేల పాయింట్ల నష్టంతో సెన్సెక్స్ ప్రారంభమైంది. అక్కడి నుంచి ఏ దశలోనూ సూచీలు కోలుకోలేదు. 54,383.20 పాయింట్ల వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని తాకిన సెన్సెక్స్.. చివరికి 2702 పాయింట్ల నష్టంతో 54,529.91 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 815.30 పాయింట్లు పతనమై 16,247.95 వద్ద ముగిసింది. సెన్సెక్స్ స్టాక్స్‌లో టాటా స్టీల్, భారతీ ఎయిర్‌టెల్, ఇండస్ ఇండ్ బ్యాంక్, టెక్ మహీంద్రా ఇప్పటి వరకు అత్యధికంగా నష్టపోయాయి. ఈ నెల 16న నుంచి భారతీయ స్టాక్ మార్కెట్లలో గందరగోళం కారణంగా పెట్టుబడిదారులు భారీగా నష్టాలను ఎదుర్కొంటున్నారు. దీనికి ప్రధాన కారణం రష్యా, ఉక్రెయిన్ మధ్య నెలకొన్న యుద్ధం వాతావరణం. ఇది ప్రపంచవ్యాప్తంగా మార్కెట్లపై ప్రతికూల ప్రభావాన్ని చూపింది. ఉక్రెయిన్- రష్యా యుద్ధ ప్రభావం స్టాక్ మార్కెట్లపై గట్టిగా పడింది. దేశీయ సూచీలు భారీగా పతనమయ్యాయి. ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలకు తోడు క్రూడాయిల్ ధరలు భగ్గుమనడం మదుపరులను కలవరపెట్టింది. అంతర్జాతీయంగా ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులు ఎటు దారితీస్తాయోనన్న భయాల నడుమ మదుపరులు భారీగా అమ్మకాలు దిగడంతో దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీగా పతనమయ్యాయి. బొంబాయి స్టాక్ ఎక్స్ఛేంజి సూచీ సెన్సెక్స్ 2702 పాయింట్లు కోల్పోయి 54 వేల 530 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్ ఆరంభంలోనే 1800 పాయింట్లకుపైగా నష్టంతో ప్రారంభమైంది. 55 వేల 997 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. ఆఖర్లో 2,850 పాయింట్లు పతనమై 54 వేల 383 వద్ద కనిష్ఠాన్ని నమోదు చేసింది. జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజి సూచీ నిఫ్టీ 815 పాయింట్ల పతనంతో.. 16 వేల 248 వద్ద సెషన్?ను ముగించింది. దాదాపు అన్ని రంగాల సూచీలు 2-6 శాతం మేర పడిపోయాయి. మదుపరుల సంపద 10 లక్షల కోట్లకు పైగా ఆవిరయ్యింది. రష్యా సహా అంతర్జాతీయ మార్కెట్లు సైతం నష్టాల్లో ముగిశాయి.



## సిసి రోడ్డు నిర్మాణానికి భూమి పూజ

**ఇబ్రహీంపట్నం ఫిబ్రవరి 24 (ప్రజామంటలు):** ఇబ్రహీంపట్నం మండల కేంద్రములో జాతీయ ఉపాధి హామీ పథకం క్రింద మంజూరు ఆయన నిధులతో సీసీరోడ్డు నిర్మాణానికి ఎంపీపీ జాజాల భీమేశ్వరి భూమి పూజ చేశారు. ఇట్టి కార్యక్రమములో వైస్ ఎంపీపీ నోముల లక్ష్మారెడ్డి, సర్పంచ్ నేమురి లత సత్యనారాయణ, ఎంపీటీసీ తిమ్మని రాములు, కో ఆప్. సభ్యులు యేలేటి చిన్నారెడ్డి, ఉపసర్పంచ్ కె. రాంరెడ్డి, తెరాస మండల అధ్యక్షులు ఏలల దశరథ్ రెడ్డి, నాయకులు జాజాల జగన్ రావు, కంఠం రమేష్, జెడి సుమన్, బద్దం గోపి ఛైర్మెన్ ప్యాక్స్, పవన్, తదితర నాయకులు పాల్గొన్నారు.



కరీంనగర్ పట్టణంలోని శ్రీ రాజరాజేశ్వర కళ్యాణ మండపంలో రేకుర్తి సమ్మక్క సారలమ్మ జాతర హుండీ లెక్కింపు ప్రక్రియను పరిశీలించిన నగర మేయర్ యాదగిరి సునీల్ రావు మరియు దేవాదాయ శాఖ సిబ్బంది.

## మానవత్వం చూపిన రసమయి

**కరీంనగర్ రూరల్ ఫిబ్రవరి 24 (ప్రజామంటలు):** తిమ్మాపూర్ మండలంలోని రేణికుంట గ్రామంలో ఇటీవల గుండెపోటుతో అకాల మరణం చెందిన గంగారపు



కుమారస్వామి కుటుంబాన్ని మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా కుమార్ స్వామి ఇద్దరు కూతుళ్ల చదువులకు ఎలాంటి ఆటంకం రాకుండా అన్నివిధాలుగా ఆదుకుంటామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఎలుక అనిత- ఆంజనేయులు, వైస్ ఎంపీపీ ల్యాగల వీరారెడ్డి ఉపసర్పంచ్, కుంభం శ్రీనివాస్, ల్యాగల దేవేందర్ రెడ్డి బుర్ర అంజయ్య, కనపర్తి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## పోలియో రహిత సమాజం ప్రభుత్వ లక్ష్యం

**చిగురుమామిడి ఫిబ్రవరి 24 (ప్రజామంటలు):** 5 సంవత్సరాల లోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేసి పోలియో రహిత సమాజం సాధనకు కృషి చేయాలని ఎంపీపీ కొత్త వినీత శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. గురువారం టాస్కోర్స్ మండల కమిటీ చైర్మన్, ఎంపిపి కొత్త వినీత శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ....ఈనెల ఆదివారం 27వ తేదిన వైద్యసిబ్బంది మండల వ్యాప్తంగా 24 సెంటర్లలో పోలియో చుక్కలను వేస్తారని తెలిపారు. అలాగే రెండు మొబైల్ టీమ్ లతో చుక్కలు పంపిణీ చేస్తారని తెలిపారు. ఎవరైనా ఆదివారం టీకా వేసుకోని వారు సోమ, మంగళవారాల్లో ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి వెళ్ళి టీకాలు వేస్తారని



తెలిపారు. ఈకార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు,అధికారులు,ప్రజలు అందరూ సహకరించాలని ఎంపిపి వినీత శ్రీనివాస్ రెడ్డి కోరారు. ఈ సమావేశంలో ఎంపిడిఓ విజయ లక్ష్మి, తహశీల్దార్ సయ్యద్ ముబీన్ అహ్మద్, వైద్యధికారి నాగశేఖర్, ఎంఈఓ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



చిగురుమామిడి మండల ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం, మండల కన్వీనర్‌గా సుందరగిరి గ్రామానికి చెందిన వంతడుపుల దిలిప్ కుమార్ నియమించిన కరీంనగర్ జిల్లా కన్వీనర్ సాంబారి కొమురయ్య

## ముస్తాబైన ముత్తారం త్రికుటేశ్వర ఆలయం

### మహాశివరాత్రి వేడుకలకు సర్వం సిద్ధం

### శ్రీశ్రీశ్రీ రాజయోగి సిద్దేశ్వర మహరాజ్ ప్రవచనం విభూతి, బొట్టు

**భీమదేవరపల్లి ఫిబ్రవరి 24 (ప్రజామంటలు):** ముత్తారం గ్రామంలో వెలసిన త్రికుటేశ్వర ఆలయం మహాశివరాత్రి ఉత్సవాల వేడుకల కోసం ముస్తాబు ఐనట్లు ఆలయ కమిటీ అధ్యక్షులు కాశిరెడ్డి ఆదిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన ప్రాంతంలో కాకతీయుల కాలంలో నిర్మించిన బ్రాహ్మసూత్రము గల శివలింగం ఉన్న దేవాలయం అని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మహాశివరాత్రి ఉత్సవాలు విజయవంతం చేయాలని కోరారు. అలాగే శ్రీశ్రీశ్రీ రాజయోగి సిద్దేశ్వర మహరాజ్ గారిచే ప్రవచనం, విభూతి, బొట్టు కార్యక్రమంలో



పాల్గొనాలని కోరారు. అంగరంగ వైభవంగా జరిగే శివరాత్రి ఉత్సవాల్లో పాల్గొని స్వామివారి అనుగ్రహానికి పాత్రులు కాగలరని కోరారు. ఈ సందర్భంగా దేవాలయంలో జరిగే సేవలు, అర్చనలు, అభిషేకాలు, రుద్రాభిషేకం శివరాత్రి రోజు సాయంత్రం శివ పార్వతుల కళ్యాణం సేవలో పాల్గొని తరించగలరని కోరారు.

## ఎగిరే మొక్క - సోంచస్ ఒలెరేసియస్

### చరిత్ర పరిశోధకుడు, వృక్ష ప్రేమికుడు: రెడ్డి రత్నాకర్ రెడ్డి

**జనగామ ఫిబ్రవరి 24 (ప్రజామంటలు):** గాలిలో ఎగిరే మొక్కలు చూసారా ? నిజమే పక్షుల్లాగే మొక్కలు కూడా గాలిలో ఎగిరిపోతాయి. దూర దూర ప్రయాణాలు కూడా చేస్తాయి. సోంచస్ ఒలెరేసియస్ అనే ఈ మొక్క గురించి చెబితే మొక్కలు కూడా గాలిలో ఎగిరిపోతాయని తెలుసుకుంటారు.

చరిత్ర పరిశోధకుడుగా డిస్కవర్ మ్యాన్ గా పేరు



తెచ్చుకున్న రెడ్డి రత్నాకర్ రెడ్డి మొదటి నుండి వృక్ష ప్రేమికుడు. ఇంటర్మీడయట్ లో వృక్ష శాస్త్రాన్ని అధ్యయనం చేశాడు. తన స్వగృహం ముందు సోంచస్ ఒలెరేసియస్ మొక్క మొలిచింది. ఈ మొక్క గురించి తన అనుభవాలు ప్రజామంటలు రిపోర్టర్ జి.కృష్ణతో గురువారం పంచుకున్నారు. ఈ మొక్క పాలకూర మొక్కల మధ్య మొదటగా కనిపించింది. ఈ మొక్క ఆకులు ఇతర మొక్కల కంట భిన్నంగా ఉండి, పసుపు రంగు పూలు పూయడం, విత్తనాలు గాలిలో ఎగిరిపోవడం వరకు మొక్క లోని అన్ని దశలు పరిశీలించాను.

**మొక్క పేరు కొత్తగా ఉంది కదా!**

అర ఫీట్ ఎత్తు మాత్రమే పెరిగే ఈ మొక్క పేరుకు మాత్రం పెద్దదే.సోంచస్ అనే గ్రీకు పదం ఒలెరేసియస్ అనే పేరు లాటిన్ పదం కలిసి సోంచస్ ఒలెరేసియస్ గా పేరుకెక్కింది. ఆస్టెరేసి కుటుంబానికి చెందిన మూలిక జాతి మొక్క ఇది. ఎక్కడో యూరప్ దేశాల్లో ఉండే ఈ మొక్క ఇటలీ భూభాగమంతా విస్తరించి ఉంది. ఫ్రాన్స్ , స్విట్జర్లాండ్ , ఆస్ట్రియా ఇలా అనేక దేశాల్లో కనిపిస్తుంది. అక్కడి నుంచి ఈ మొక్క గాల్లో ఎగురుకుంటూ ఒక్కొక్క దేశం దాటుతూ మన దేశానికి ఎగిరి వచ్చింది. ఇతర ఆహార ధాన్యాల ఎగుమతులు, దిగుమతుల ద్వారా కూడా వచ్చి ఉంటుంది.

**ఎలా ఎగురుకుంటూ వచ్చింది?**

సోంచస్ ఒలెరేసియస్ అనే ఈ మొక్క తెల్లవారు జామునే పూలు పూస్తుంది. మధ్యాహ్నం కల్లా ఆ పూలు ముడుచుకొని పోతాయి. ఆ పూల భాగం నుండి తెల్లని ఉన్ని దారాలు కలిగిన బంతి (బాల్) వలే ఉన్న విత్తనపు బంతి ఏర్పడుతుంది. ఒక్కొక్క విత్తనం వెంట్రుక కంటే సన్నగ, అత్యంత తేలికగా ఉంతుంది. ఏ మాత్రం గాలి వీచినా చాలా దూరం ప్రయాణిస్తే . విత్తనం ఏమాత్రం బరువు లేకపోవడంతో చాలా దూరం ప్రయాణిస్తుంది. ఎక్కడ నేలను తాకుతుందో అక్కడ మొక్క లేస్తుంది. అందుకే ఈ మొక్క పెరల్లలో, పచ్చిక బయల్లలో కూరగా యల సాగుభూముల్లో నడిచే దారి పక్కన అంతటా పెరుగుతుంది. బలహీనమైన కాండం ఉన్నప్పటికీ వీటిఆకులు పొడవైన త్రిబుజాకృతి కలిగి గరిటవలే ఉంటాయి .వీటి పసుపు పచ్చ పూలు బతుకమ్మ పండుగ రోజుల్లో పూసే చిట్టి చామంతి వలే ఉండి కీటకాలను ఆకర్షిస్తాయి.

**ఉపయోగాలు:**

సోంచస్ ఒలెరేసియస్ అనేది పురాతన కాలం నుండి తెలిసిన ఒక మొక్క వివిధ ప్రాంతాలలో వివిధ స్థానిక పేర్లను కలిగి ఉంది. నిజానికి ఇది ఒక అద్భుతమైన తినదగిన మొక్క సలాడ్‌లో పచ్చిగా, ఇతర అడవి మూలికలతో కలిపి లేదా ఉడికించి, సైడ్ డిష్‌గా ఉపయోగించ బడుతుంది. మూలికా వైద్యంలో ఉపయోగిస్తారు. శరీర ఉష్ణోగ్రత తగ్గిస్తుంది. కాలేయం ప్రక్షాళనను ప్రోత్సహిస్తుంది. శరీరాన్ని బల పరుస్తుంది. ఇంకా ఈ మొక్క పై పరిశోధనలు జరగవలసి ఉంది. దురదృష్టవశాత్తు నేడు, ఇతర మొక్కల మాదిరిగానే, ఈ మొక్క కూడ పూర్తిగా నిర్లక్ష్యం చేయబడిందని రత్నాకర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.

## స్థానిక సంస్థల అభివృద్ధికి సమృద్ధిగా నిధులు

**జనగామ ఫిబ్రవరి 24 (ప్రజామంటలు):** స్థానిక సంస్థలను బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సమృద్ధిగా నిధులు ప్రత్యేకంగా కేటాయించిందని జిల్లా పరిషత్ చైర్మన్ పాకాల సంపత్ రెడ్డి తెలిపారు. గురువారం జిల్లా పరిషత్ కార్యాల



యంలో జిల్లా పరిషత్ సీఈవో అధ్యక్షతన జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ శివలింగయ్య శాసనమండలి సభ్యులు పోచంపల్లి శ్రీనివాస రెడ్డి పాల్గొన్నారు. వ్యవసాయం, పంచాయతీ, వైద్యం, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ పనులు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులు తదితర ప్రధాన అంశాలపై సుదీర్ఘంగా చర్చ కొనసాగింది. గ్రామాల పురోభివృద్ధికి ఈ నిధులు ఎంతగానోఉపయోగపడనున్నాయి. ముందుగా వ్యవసాయంపై జిల్లా వ్యవసాయ అధికారి రాధిక 2021- 22 సంవత్సరంలో పంట సాగు వివరాలను వివరిస్తూ సబ్సిడీ విత్తనాలు రాయితీపై అందిస్తున్నామని, యాసంగి పంట కాలానికి వరికి బదులుగా ప్రత్యామ్నాయ ఆరు తడి పంటలపై అన్ని గ్రామాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు. జాతీయ ఆహార భద్రతా పథకం కింద పప్పు దినుసుల సాగును ప్రోత్సహిస్తున్నామని ఎరువుల కొరత లేదన్నారు. జిల్లా పంచాయతీ అధికారి రంగాచారి మాట్లాడుతూ.... రఘునాథపల్లి మండలం మేకలగట్టు గ్రామానికి చెందిన ఎస్సీలు, బీసీలకు కేటాయించిన భూముల విషయంలో ఎవరికీ ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని ఆక్రమణలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా వైద్య శాఖ అధికారి మహేందర్ మాట్లాడుతూ.... జిల్లాలోని 30 పడకల ఆసుపత్రులను ప్రభుత్వం అభివృద్ధి పరచాలని సంకల్పంతో వైద్య విధాన పరిషత్ పరిధిలోకి తీసుకున్నట్లు తెలియజేస్తూ ఇకపై ఆసుపత్రి అభివృద్ధికి అధిక నిధులు మంజూరు అవుతాయని తద్వారా ప్రభుత్వ ఆసుపత్రులలో అభివృద్ధి వేగవంతంగా ఉండనున్నదని తెలియజేశారు. ప్రతిరోజు ఆస్పత్రులకు వచ్చే నిరుపేదలకు రోజుకు 450 మంది నుండి రక్తనమూనాలను సేకరిస్తూ డయాగ్నస్టిక్ ల్యాబ్ ద్వారా యాభై ఏడు రకాల పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ఆసుపత్రుల అభివృద్ధి నిధుల ద్వారా మౌలిక వసతులు కల్పిస్తూ తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పంచాయతీరాజ్ అధికారి చంద్రశేఖర్ మాట్లాడుతూ.... జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కార్యక్రమంతో పనులు చేపడుతున్నట్లు తెలియజేశారు శాఖ ద్వారా 756 సిసి రోడ్స్, 268 డ్రైనేజీలు, 55 మెటల్ రోడ్స్ చేపట్టామన్నారు. పనులు వివిధ అభివృద్ధి దశల్లో పురోగతిలో 90 శాతంతో ఉన్నాయని మిగిలిన పనులు కూడా మార్చి 31వ తేదీలోగా పూర్తి కానున్నాయని తెలియజేశారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్మన్ మాట్లాడుతూ....స్థానిక సంస్థలను బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సమృద్ధిగా నిధులు ప్రత్యేకంగా కేటాయించిందన్నారు. అధికారులు ప్రజా ప్రతినిధులు సమన్వయంతో అభివృద్ధి పనులను చేపట్టాలన్నారు. మేకలగట్టు భూముల విషయంలో మార్చి 5వ తేదీ లోగా సమస్యను పరిష్కరిస్తామన్నారు. బచ్చన్నపేట లో చెట్టు తొలగించడం సరికాదని తప్పనిసరిగా చర్యలు తీసుకుంటామన్నారు. శాసనమండలి సభ్యులు పోచంపల్లి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ.... స్థానిక సంస్థలను అభివృద్ధి పరిచేందుకు 500 కోట్లు కేటాయించిన ఘనత దేశంలో ఒక్క తెలంగాణ రాష్ట్రానికి దక్కిందన్నారు తొలుత 250 కోట్లు మంజూరు చేయడం జరిగిందన్నారు వైద్య కళాశాల మంజూరుకు కృషి చేస్తామన్నారు ప్రభుత్వ పాఠశాలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా మౌలిక సదుపాయాలు కల్పిస్తూ నాణ్యమైన విద్యను అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు మంజూరైన నిధులతో ప్రాధాన్యతగల పనులను చేపట్టి మార్చి 31 నాటికి పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు సిటీ స్కాన్ అంబులెన్స్ ల ఏర్పాటుకు వైద్య శాఖ మంత్రి హరీష్ రావు దృష్టికి తీసుకెళ్తామన్నారు. అలాగే జిల్లా పరిషత్ నూతన భవనానికి చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా కలెక్టర్ శివలింగయ్య మాట్లాడుతూ.... ప్రజా ప్రతినిధులు నేరుగా నన్ను కలిసి సమస్యలు తెలియజేయవచ్చు అన్నారు జిల్లాలోని ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాల స్థలాలకు సర్వే చేయించి హద్దులు ఏర్పాటు చేస్తామని నక్ష తో పాటుగా మ్యాప్ ను అందజేస్తామన్నారు. మేకలగట్టు భూములను సర్వే చూపిస్తామని త్వరలోనే నివేదిక ఇస్తామన్నారు. అనంతరం చిట్ట కోడూరు కు చెందిన మణికంఠ అవుట్సోర్సింగ్ సర్వీస్ అనంతోజు రమకు కుట్టు మిషన్ ను పంపిణీ చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, జడ్పీ సీఈఓ విజయలక్ష్మి, జిల్లా అధికారులు జడ్పీటీసీలు ఎంపీపీలు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## సౌమ్యకు ఆర్థిక సహాయం అందజేసిన లెక్చరర్ విద్యాసాగర్ రెడ్డి

**జనగామ ఫిబ్రవరి 24 (ప్రజామంటలు):** జనగామ పట్టణం లోని ధర్మకంచ ప్రభుత్వ జూనియర్ కళాశాల (కో -ఎడ్యూకేషన్)లో 2016-18 విద్యా సంవత్సరంలో బైపీసీ చదివిన నిరుపేద విద్యార్థిని కాముని సౌమ్యకు జిల్లా ఇంటర్మీడియట్ అధికారి (డిఐఈఓ) బైరి శ్రీనివాస్ చేతుల మీదుగా కళాశాల వాణిజ్య శాస్త్ర అధ్యాపకుడు చెలిమెల విద్యాసాగర్ రెడ్డి రూ.



18,000 ఆర్థిక సహాయాన్ని గురువారం అందజేశారు. కళాశాలలో నిర్వహించిన ఈ సమావేశంలో డిఐఈఓ శ్రీనివాసులు మాట్లాడుతూ.... లెక్చరర్లు విద్యార్థులకు అందిస్తున్న సహాయ సహకారాలతో ఉన్నతంగా చదివి బంగారు భవిష్యత్తును నిర్మించుకోవాలని అన్నారు. కామిని సౌమ్యకు ఇంతకుముందు విద్యాసాగర్ రెడ్డి 54 వేలు సహాయాన్ని అందజేశారని, ఇప్పటివరకు 72 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారని తెలిపారు. ప్రస్తుతం సౌమ్య బి ఫార్మసీ ఫైనల్ ఇయర్ (నాలుగవ సంవత్సరం) చదువు చున్నారన్నారు. దాత విద్యాసాగర్ రెడ్డి మాట్లాడుతూ.... సౌమ్య బీఫార్మసీ లో 90 శాతం మార్కులు సాధించి ప్రతిభ కనబరుస్తూ ఉందన్నారు. సౌమ్య బీఫార్మసీ చదువుకయ్యే రూపాయలు 72 వేలు తానే చెల్లిస్తానని మాట ఇచ్చి నిలుపుకున్న అని చెప్పారు. ఇలాంటి అవకాశం రావడం సంతోషంగా ఉందని అన్నారు. భవిష్యత్తులో కూడా ఎవరైనా పేద విద్యార్థుల పై చదువులకు ఆర్థిక సహాయాన్ని ఇలానే అందిస్తానని మాటిచ్చారు. ఈ సందర్భంగా విద్యాసాగర్ రెడ్డి ని జనగామ డిఐఈఓ బైరి శ్రీనివాస్, కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ నందిని పటేల్, అధ్యాపకులు అభినందించారు.

ఈ సందర్భంగా కాముని సౌమ్య మాట్లా డుతూ గత నాలుగు సంవత్సరాల నుండి బీఫార్మసీ పూర్తి కావడానికి ఆర్థిక సహాయాన్ని అందించిన విద్యాసాగర్ రెడ్డి కి ఎప్పటికీ కృతజ్ఞురాలినిగా ఉంటానన్నారు. ఆర్థిక సహాయం చేయడం వల్లనే బీఫార్మసీ కంప్లీట్ అయిందని, గవర్నమెంట్ జూనియర్ కాలేజీలో చదివినందుకే ఈ అవకాశం వచ్చిందని అనుకుంటున్నానని అన్నారు. ప్రభుత్వం కల్పించే అవకాశాన్ని పేద విద్యార్థులు ఉపయోగించుకోవాలని సౌమ్య కోరారు.

కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ ఎల్ఎండి కాలనీలో వచ్చేనెలలో జరిగే శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్‌కు ఆహ్వాన పత్రికను అందజేసిన ఆలయ చైర్మన్ మారం జగదీశ్వర్





## రాష్ట్రంలో సీపీఎస్‌ను రద్దు చేయాలి

### పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు హరి అశోక్ కుమార్

**జగిత్యాల ఫిబ్రవరి 24 (ప్రజామంటలు):** తెలంగాణ ప్రభుత్వం కూడా రాజస్థాన్ రాష్ట్రం తరహాలోన్ ప్రభుత్వ ఉద్యోగులకు సీపీఎస్ (కొత్త పెన్షన్ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం) విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలుచేయాలని తెలంగాణ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు హరి అశోక్ కుమార్ కోరారు. గురువారం జిల్లా కేంద్రంలో సంఘం కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బుధవారం రాజస్థాన్ రాష్ట్ర శాసనసభలో సీపీఎస్ ను రద్దు చేస్తున్నట్లు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రకటించారని, పదవీ విరమణ పొందిన ఉద్యోగుల ఉపాధ్యాయుల జీవితాలు సాఫీగా సాగేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూడా రాజస్థాన్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం తీసుకోవాలని తమ సంఘం తరపున కోరారు. జిల్లా కార్యదర్శి బొల్లం విజయ్, కోశాధికారి గౌరిశెట్టి విశ్వనాథం, రఘుపతి, హన్మంత్ రెడ్డి, విద్యాసాగర్, అలిశెట్టి ఈశ్వరయ్య, నారాయణ, యాకూబ్, కరుణ తదితరులు పాల్గొన్నారు.

## స్మశాన వాటిక రద్దుకై సంతకాల సేకరణ

### ఎమ్మెల్యేకు వినతి

**జగిత్యాల ఫిబ్రవరి 24 (ప్రజామంటలు):** ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గాంధీనగర్ 11వ వార్డు మాదిగ యువజన సేవ సంఘం సభ్యులు చింతకుంట చెరువు ప్రక్కన స్మశానవాటికను రద్దు చేయడం గురించి 100 కుటుంబాల ప్రజా



అభిప్రాయం మరియు సంతకాలను సేకరించి ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ కు మరియు మున్సిపల్ ఛైర్పర్సన్ డా. భోగ శ్రావణి లకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ టిఆర్ఎస్ నాయకులు బాలే శంకర్, సంఘ అధ్యక్షులు ప్రసాద్, ప్రధాన కార్యదర్శి రౌట్ల రాజేష్, ఉపాధ్యక్షులు మల్లేష్, కోశాధికారి హనుమంతు, వార్డ్ టిఆర్ఎస్ అధ్యక్షులు కృష్ణ, సంఘ సభ్యులు అనిల్, రాజేష్, సతీష్, మహేష్, రమేష్, రాజబాబు, చందు, విజయ్, గంగాధర్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ భవన్‌లో నిరుద్యోగులకు సంఘీభావంగా దీక్షలో పాల్గొన్న కరీంనగర్ తెలుగుదేశం నాయకులు

**కరీంనగర్ ఫిబ్రవరి 24 (ప్రజామంటలు):** తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ భవన్ లో నిరుద్యోగులకు సంఘీభావంగా దీక్షలో పాల్గొన్న కరీంనగర్ తెలుగుదేశం పార్టీ నాయకులు. కళ్యాడపు ఆగయ్య, ఎడ్ల వెంకటయ్య, తీగల శేఖర్ గౌడ్, దామెర సత్యం, రొడ్డశ్రీధర్, సాయిల్ల రాజమల్లయ్య, నాగుల బాలాగౌడ్, వంచ



శ్రీనివాస్ రెడ్డి, సంద బోయిన రాజేశం, రొడ్డ శ్రీనివాద్, ఎర్రవెల్లి రవీందర్, ఎర్రవెల్లి వినీత్, చేవూరి నరసింహ చారి, మరి కొంత మంది కరీంనగర్ పార్లమెంట్ లోని పార్టీ నాయకులు.

ఈసందర్భంగా దీక్షలో పాల్గొన్న రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్య నిర్వాహక కార్యదర్శి కళ్యాడపు ఆగయ్య మాట్లాడుతూ టిఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో నిరుద్యోగుల ఆత్మహత్యలు రోజురోజుకు పెరిగిపోతున్న రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు ఏమాత్రం పట్టించుకోకపోవడం సిగుచేటైన విషయం ఇప్పటికే వందల మంది నిరుద్యోగులు ఆత్మబలిదానాలు చేసుకొన్న ప్రభుత్వంలో ఖాళీగావున్న లక్ష తొంభైవేల ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయుటకు కనీసం ప్రయత్నించకపోవడం సిగ్గుచేటైన విషయం వెంటనే ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

## విద్యుత్ శాఖ చర్యల పట్ల బిజెవైఎం నిరసన

**ధర్మపురి ఫిబ్రవరి 24 (ప్రజామంటలు):** తెలంగాణ విద్యుత్ శాఖ మరియు రాష్ట్ర ప్రభుత్వం కలిసి కరెంటు బిల్లులపై ప్రజల నుండి డెవలప్మెంట్ పేరిట అధిక బిల్లులు వసూలు చేస్తోందని, ఇందుకు నిరసనగా బిజెపి ఆధ్వర్యంలో స్థానిక సబ్ స్టేషన్ ఎదుట ధర్నా చేసి ఏఈ కి వినతిపత్రం ఇచ్చారు. బిజెపి పట్టణ అధ్యక్షుడు బెజ్జారపు లవన్ మాట్లాడుతూ.... పేద మధ్య తరగతి కుటుంబానికి 300 నుండి 500 రూపాయలు వస్తే డెవలప్మెంట్ పేరిట మూడు వేల నుండి



ఐదు వేలు దాకా వసూలు చేస్తున్నారు. కరోనా కష్ట కాలం లో కరెంటు బిల్లు కట్టడం కష్టం అవుతుంది అంటే డెవలప్మెంట్ పేరిట ప్రజల వద్ద వేలల్లో వసూలు చేసి ప్రజల నడ్డి విరుస్తున్నారని, మీరు చేస్తున్న అభివృద్ధి ఏంటిదో తెలియజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు బండారి లక్ష్మణ్, జిల్లా కార్యవర్గ సభ్యులు రాందేని బాపు, మండల పట్టణ ప్రధాన కార్యదర్శి కోరుట్ల మల్లికార్జున్, కాంద్రపు రమేష్, బాకీ రాజేష్. బిజెవైఎం అధ్యక్షుడు గాజు భాస్కర్, నలమాసు వైకుంఠం, డివిటి శ్రీధర్, పల్లెర్ల సురేందర్, సంగి రాజేష్, మైధం మల్లేషం, స్వర్గం వీరేషం, అప్పం శ్రీనివాస్, సంగి రాజేష్, కశెట్టి హరీశ్.ముత్తినేని శ్రీను.నాగులు తదితరులు పాల్గొన్నారు.

## భారత రాజ్యాంగ పుస్తకం ఆవిష్కరణ

**హుజూరాబాద్ ఫిబ్రవరి 24 (ప్రజామంటలు):** గురువారం హైదరాబాదులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ తో పాటు రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్ కలిసి



భారత రాజ్యాంగం పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జాతీయ మాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు జి. చెన్నయ్య, సింగరేణి కాలరీస్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి అంతోటి నాగేశ్వరరావు, నాయకులు జె. కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఉక్రెయిన్‌పై యుద్ధమేఘాలు !

ఉక్రెయిన్‌పై యుద్ధమేఘాలు కమ్ముకున్నాయి. ఎక్కడ చీమ చిటుక్కుమన్నా దాని ప్రభావంతో భారత్ చిగురుటాకులా వణికే పరిస్థితులు ఉన్నాయి. ప్రధానంగా రష్యా దాడికి దిగితే మన ఆర్థిక వ్యవస్థపైనా తీవ్ర ప్రభావం చూపుతుందని ఆర్థినిపుణులు అంటున్నారు. దీంతో ఎక్కడా యుద్ధం రావద్దని మనం కోరుకుం టున్నారు. మొన్నటికి మొన్న అఫ్ఘన్ పరిణామాలు కూడా మనలను తీవ్రంగా కలచివేసాయి. తాజాగా రష్యా సైన్యం ఉక్రెయిన్ సరిహద్దులకు చేరడంతో ప్రపంచవ్యాప్తంగా ఆందోళన నెలకొంది. ఇప్పటికే కరోనాతో అతలాకుతలం అయిన ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మళ్లీ గాడిన పడేలోపు అగాథంలో పడుతుందా అన్న భయాలు కలుగుతున్నాయి. రష్యా, ఉక్రెయిన్‌ల మధ్య ఉద్రిక్తత పెరుగుతున్న క్రమంలో ప్రధానంగగా పెట్రో ధరలపై తీవ్ర ప్రభావం పడనుంది. రెండు దేశాల మధ్య ఉద్రిక్తత పెరుగుతున్న నేపథ్యంలో స్వదేశానికి వచ్చేయాలని ఉక్రెయిన్‌లో ఉన్న విద్యార్థులకు భారత ప్రభుత్వం సూచించింది. ఈ మేరకు మంగళవారం నుండే ప్రత్యేక విమానాలను నడుపుతున్నట్లు ప్రకటించింది. న్యూ ఢిల్లీ నుండి ఉక్రేయిన్ రాజధిని కీవ్‌కు ఎయిర్ ఇండియా విమానాలు బయలుదేరి వెళ్లాయి. మరోవైపు ఐక్య రాజ్యసమితి భద్రతా మండలి సమావేశం రెండు దేశాలను సమన్వయం పాటించాలని విజ్ఞప్తి చేసింది. ఈ పరిణామాల నేపథ్యంలో చర్చల కు సిద్ధంగా ఉన్నామని రష్యా ప్రకటించింది. తమ విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్, అమెరికా విదేశాం మంత్రి ఆంటోని బ్లింకెన్‌తో చర్చలకు సిద్ధంగా ఉన్నారని ఆ దేశం తెలిపింది. అమెరికా జోక్యంతో ప్రారంభమైన పరిణామాలు తీవ్ర స్థాయికి చేరుకుంటున్నాయి. ఉక్రెయిన్‌లోని డాంటెస్క్, లుగాన్స్కలను స్వతంత్ర దేశాలుగా గుర్తిస్తున్నట్లు రష్యా ఇప్పటికే ప్రకటించింది. ఆ ప్రాంతాల్లో శాంతిని పరిరక్షణ కోసం అవసరమైన బలగాలను పంపాలని రక్షణశాఖను రష్యా అధ్యక్షుడు పుతిన్ ఆదేశించారు. ఈ పరిణామం పట్ల ఉక్రెయిన్ మండిపడింది. రష్యాతో అన్ని రకాల సంబంధాలను తెంచుకోవడానికి సిద్ధంగా ఉన్నామని ప్రకటించింది. ఉక్రెయిన్ సంక్షోభం పతాకస్థాయికి చేరిన నేపథ్యంలో ప్రపంచ దేశాలు కూడా ఆందోళన చెందుతున్నాయి. అవసరమైతే పుతిన్‌తో నేరుగా భేటీ అయ్యేందుకు కూడా తాను సిద్ధమని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ప్రకటించినా పుతిన్ అందుకు సిద్ధంగా లేదని ఆయన చర్యలను బట్టి తెలుస్తోంది. అఫ్ఘాన్÷–లో రష్యా ఉన్నంత కాలం కొంత సజావుగా ఉన్నా.. అమెరికా రాకతో మళ్లీ తాలిబన్ల పట్టు పెరిగింది. ఇది కూడా రష్యాకు అమెరికాపై కోపంగా ఉంది. అందుకు అమెరికా హెచ్చరికలను లేదా బెదిరింపులను రష్యా అధ్యక్షుడు పుతిన్ ఖాతరు చేసే స్థితిలో లేరు. తాజా ఘటనలతో యుద్ధం మొదలు కావచ్చునని ప్రపంచం భయపడుతోంది. అక్కడి రష్యా అనుకూల తిరుగు బాటుదారులు క్రెమ్లిన్ సేనల చొరబాటుకు సానుకూల వాతావరణాన్ని ఇతోధికంగా సృష్టిస్తున్నారు. ఉక్రెయిన్ సైన్యం తన భూభాగంలోకి చొరబడిందనీ, ఫిరంగులు పేల్చిందనీ, ఏవో ధ్వసం చేసిందనీ, ప్రతిగా తాము ఐదుగురిని చంపివేశామని రష్యా సైన్యం చెబుతుంటే, కట్టుకథలు కట్టిపెట్టమని ఉక్రెయిన్ అంటోంది. రష్యా తమను బూచిగా చూపి యుద్ధానికి కాలుదువ్వబోతున్నదని అనుమానం. ఈ ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్ రంగంలోకి దిగి అమెరికా, రష్యాల మధ్య సయోధ్యకు కొంత ప్రయత్నం చేయడంతో పుతిన్‌తో నేరుగా మాట్లాడేందుకు బైడెన్ సిద్ధంగా ఉన్నారని వైట్ హౌస్ ప్రకటించింది. కానీ, ఎక్కువ సమయం తీసుకో కుండానే రష్యా అధ్యక్షుడు ఈ ప్రతిపాదనలని కొట్టిపారేశారు. ఉక్రెయిన్‌కు అత్యాధునిక ఆయుధాలు తరలిస్తున్నందుకు నాటోమీద విరుచుకుపడ్డారు. రష్యా డిమాండ్లు నెరవేర్చకుండా ఈ రకమైన విన్యాసాలు ఎన్ని చేసినా నిష్ప్రయోజనమన్నది పుతిన్ వాదిస్తున్నారు. మొత్తంగా ఏ క్షణాన్నయినా



యుద్ధంలోకి జారిపోయే ఉద్రిక్త పరిస్థితులు ఇప్పుడు ఉన్నాయి. రష్యా డిమాండ్లను కాదుపొమ్మనడం వల్ల యుద్ధనివారణ అసాధ్యం. నాటోనుంచి రష్యా కొన్ని రక్షణ హామీలు కోరుతోంది. ఉక్రెయిన్‌కు నాటోలో చోటివ్వకపోవడం, 1997 మే తరువాత నాటోలో చేరిన తూర్పు యూరప్ దేశాలనుంచి ఆయుధాలను, బలగాలను ఉపసంహ రించుకోవడం,రష్యా సరిహద్దుల్లో మిసైల్ వ్యవస్థలను ఏర్పాటు చేయబోమని నాటో దేశాలు హామీ ఇవ్వడం వీటిలో ప్రధానమైనవి. 2019లో రాజ్యాంగాన్ని సవరించుకొని మరీ నాటోలో చేరికకు సిద్ధపడిన ఉక్రెయిన్ తాను ఏమాత్రం తగ్గినా రష్యా తనను తిరిగి మింగేస్తుందని భయపడుతోంది. ఉక్రెయిన్‌కు తూర్పున రష్యా, పశ్చిమాన పోలెండ్, దానిని అనుకొని జర్మనీ, ఫ్రాన్స్ ఉన్నాయి. తూర్పు ఉక్రెయిన్ సహజంగానే రష్యా పక్షం. ఇప్పుడు రష్యా అధికారికంగా గుర్తిస్తానంటున్న రెండు తిరుగుబాటు ప్రాంతాలూ ఇప్పటికే కరెన్సీ నుంచి జాతీయగీతం వరకూ అన్ని విషయాల్లోనూ రష్యాతోనే నడుస్తున్నాయి. రష్యా సరిహద్దుల్లో ఉన్న దేశాలను నాటో సభ్యులుగా చేర్చుకోవడం, ఈయూ బంధంతో పెనవేయడం ద్వారా రష్యాను అంతం చేయాలని అమెరికా ఆశపడుతోందని పుతిన్ ఆగ్రహంగా ఉన్నారు. ఒక్క అంగుళం కూడా మావైపు విస్తరించ బోమని 1990లో హామీ ఇచ్చిన నాటో అనంతరకాలంలో దుర్మార్గంగా చొచ్చుకొచ్చిందని రష్యా ఆగ్రహం. రష్యా ఇప్పుడు ఆర్థికంగా కొంత తేరుకొన్న నేపథ్యంలో పశ్చిమదేశాలను సవాలు చేయగలు గుతున్నది. ఉభయపక్షాలూ నిజంగానే యుద్ధాన్ని నివారించదల్చుకుంటే, ఉక్రెయిన్ విషయం లోనైనా నిర్దిష్టమైన హామీలు నాటోనుంచి రష్యాకు తక్షణం దక్కాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి అత్యవసరంగా సమావేశమైంది. రష్యా చర్యలను, తదనంతర పరిణామాలను చర్చిస్తోంది. అన్ని దేశాలు సంయమనం పాటించాలని మండలి కోరింది. తమ భూభాగంలో ఒక్క అంగుళాన్ని కూడా వదులుకునేది లేదని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ పేర్కొన్నారు. రష్యా తీసుకున్న చర్యను తీవ్రంగా నిరసిస్తున్న బ్రిటన్, ఆ దేశంపై కఠిన ఆంక్షలు విధిస్తామని ప్రకటించింది. ఉక్రెయిన్‌లోని రెండు ప్రాంతాలను స్వతంత్ర దేశాలు గా గుర్తిస్తున్నట్లు రష్యా ప్రకటించిన నేపథ్యంలో అమెరికా భారీగా రష్యాపై ఆర్థిక ఆంక్షలు విధించింది. పూర్వపు సోవియట్ సామ్రాజ్యాన్ని పునరుద్ధరించాలని రష్యా భావిస్తోందంటూ వచ్చిన ఆరోపణలను పుతిన్ తిరస్కరించారు. తాజా పరిణామాల నేపథ్యంలో రష్యా నుంచి రావాల్సిన సహజవాయువు దిగుమతులు రాకపోయినా తమ దేశ ఇంధన అవసరాలు తీర్చుకోగలమని జర్మనీ తెలిపింది. ఉక్రెయిన్‌పై నెలకొన్న భయాందోళనల నేపథ్యంలో ఆసియా స్టాక్ మార్కెట్లలో ఆ ప్రభావం కనిపిస్తున్నది. మొత్తంగా ప్రపంచంలో యుద్ధమేఘాలు రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత అన్ని దేశాలపైనా ఉమ్మడిగా ఉంది.




## సాహితీ ప్రేమికులైన పాఠకులకు ప్రత్యేకం

" ప్రజా మంటలు" తెలంగాణ జాతీయ దినపత్రికలో ప్రతి రోజు, " నేటి కథ" శీర్షికన ఒక కథను ప్రచురించనున్నామని తెలుపుటకు సంతోషిస్తున్నాం. రచయితలు తమ కథలను mantalukathalu@gmail.comకు పంపవచ్చు...

–ఎడిటర్.

# రంగురంగుల కుండలు

లక్నవరం అనే గ్రామంలో వెంకయ్య అనే వ్యక్తి ఉండేవాడు. అతను తన భార్యా పిల్లలతో సంతోషంగా ఉండేవాడు. అతని భార్య పేరు లక్ష్మి. అతనికి ఇద్దరు కూతుర్లు. చిన్న కూతురు బుజ్జి. పెద్ద కూతురు పేరు చిన్ని. వారుహాయిగా ప్రభుత్వపాఠశాలలో చదువుకుంటున్నారు. వెంకయ్య కుండలు తయారు చేసి మార్కెటుకు తీసుకెళ్లి అమ్మేవాడు. వచ్చిన డబ్బులతో కుటుంబాన్ని పోషిస్తూ ఉండేవాడు. కొన్నిరోజుల
తర్వాత కుండలు మార్కెట్ లో ఎవ్వరు కూడా కొనడంలేదు. ఎందుకంటే స్టీలు బిందెలు కొంటున్నారు. అప్పుడు అతని దగ్గర డబ్బులు లేకుండెను. తినడానికి కూడా కష్టమయ్యేది.



అప్పుడు వెంకయ్య ఒక ఉపాయం వచ్చిందని భార్య లక్ష్మితో ఈవిధంగా చెబుతాడు.

అది ఏంటంటే ఈసారి మనం కుండలు తయారు చేసి ఆ కుండలకు రంగులు వేసి అమ్ముదామని అనిపించింది. మీ ఆలోచనబాగానే ఉంది. కానీ మన దగ్గర రంగులు కొనడానికి డబ్బులు లేవు కదా!ఎవరివద్ద నైన అప్పుచేసి తీసుకరండి తర్వాత తేర్పుదాం అని భార్యలక్ష్మి సలహాఇస్తుంది.
సరే అంటాడు వెంకయ్య.

వెంటనే ఊరిలో అప్పులిచ్చే వ్యాపారి రమేశ్ దగ్గరికివెళ్ళి అప్పు చేసి డబ్బు తీసుకు వస్తాడు. చెరువు నుండి మట్టి తీసుకువచ్చి కుండలు తయారు చేసి కాల్చిన తర్వాత కుండలకు భార్యాపిల్లలు అందరు తలొక పనిచేసి అందమైన రంగులు కుండలకు వేసి చిత్రవిచిత్రమైన బొమ్మలు దించారు. మార్కెట్ కు తీసుకెళ్లి అమ్మితే అందరూ ఎంతో ఇష్టంతో డబ్బులు పెట్టి కొన్నారు. ఇప్పుడు వెంకయ్యకు డబ్బు ఎక్కువగా వచ్చింది.

కొంత అప్పు గట్టి కొంత ఇల్లు సర్ది పెట్టుకోవడానికి వాడుకున్నాడు.

కానీ మళ్ళీ కుండలు తయారు చేసి, రంగులు వేయాలంటే డబ్బులు కూడా లేవు. మట్టికూడాలేదు. ఎలా చెయ్యాలి,ఏంచెయ్యాలి ఆలోచిస్తుంటాడు. భార్య లక్ష్మి ఒక ఉపాయం చెపుతుంది. నేను పిల్లలు కలిసి నీతో పాటుగా అడవికి వస్తాము. అందరంకలిసి మట్టితెస్తాము అని అనగానే సరే పదండి అంటూ చెరువుకు వెళ్లి మట్టిని తీసుకుని ఇంటికి వస్తారు. ఆ మట్టితో కుండలు తయారుచేస్తాడు.

రంగులువేయడానికి డబ్బుల కోసం రమేశ్ వద్దకు వెళ్లి అప్పుతెస్తాడు. ఇప్పుడు మళ్ళీ భార్య పిల్లలు రకరకాల చిత్రాలువేసి వాటికి రంగులు పెడతారు. మార్కెట్ కెళ్లి అమ్మగానే అన్ని అమ్ముడు పోయాయి. వచ్చిన డబ్బులతో ఇంటి ఖర్చులకు,బాకితీర్చడానికి సరిపోయాయి.
ఈవిధంగా ఎలా కుటుంబాన్ని సాదాలి అని అనుకుంటుండగా అప్పుడు అనుకోకుండా పట్నం నుంచి వీళ్ళ నైపుణ్యాన్ని చూసినటువంటి ఒక కుండల వ్యాపారి వెంకయ్య దగ్గరికి వస్తాడు.

మాకు కొన్ని రంగురంగుల కుండలు కావాలి. నీకు డబ్బులు ఇస్తాము. ఇప్పుడు ఖర్చుల క్రిందికి కొంతడబ్బు ఇస్తాము. కుండలు తయారుచేసిన తర్వాత పూర్తి డబ్బుచెల్లించి కుండలు తీసికెలతాం అని అనగానే ఎక్కడలేని సంతోషం వచ్చింది. కుటుంబం అందరూ కూడా చాలా సంతోషపడ్డారు. మాకు వారం రోజుల గడువు ఇవ్వండి చాలా రకాల కుండలు తయారు చేసినం మీరువచ్చి తీసుకెళ్లండి అని వెంకయ్య అంటాడు అనుకున్న ప్రకారంగా కుటుంబమంతా రాత్రి పగలు అనకుండా కష్టపడి కుండలకు రంగులు వేసి తయారుచేస్తారు. ఇచ్చిన గడువు ప్రకారం కుండల వ్యాపారి అక్కడికి వస్తాడు. వీరికి అనుకున్న ప్రకారం డబ్బు ఇస్తాడు.

ఆ డబ్బు తోటి అప్పులన్నీ తీరిపోయాయి. మిగిలిన డబ్బు తోటి మంచి ఇల్లు కట్టుకొని తన బిడ్డలకు మంచి చదువులు చదివించి ఆ కుటుంబం హాయిగా జీవిస్తుంది.
నీతి: కష్టపడి పని చేస్తే దేవుడు ఏదోవిధంగా దారి చూపుతాడు.

– జక్కిరెడ్డి శ్రావ్య, ఆరవ తరగతి
జడ్. పి. హెచ్. ఎస్ గుర్రాలగొంది, సిద్దిపేట
9704865816

# విలువల కోసం జీవితాంతం పాటుపడిన కాటం

ఫిబ్రవరి 25...కాటం లక్ష్మీనారాయణ వర్ధంతి

యన నిజాం వ్యతిరేక పోరాటయోధులలో ప్రముఖుడు.
స్వార్థం అనే పదాన్ని దగ్గరకు రానీయకుండా, రాజకీయ పదవులకు ఏనాడూ పాకులాడ కుండా, కేవలం ప్రజలకు, విలువల కొరకు ఎంతటి వారినైనా, ఎదిరించి ధైర్యంగా నిర్మొహమాటంగా నిల బడటం ఆయనకే చెల్లింది. సంస్థా నాలలో స్వాతంత్ర్య యోధులను కేంద్ర ప్రభుత్వం గుర్తించక పోవడా న్ని అవమానంగా భావించి, పోరాడి సంస్థానాల లోని స్వాతంత్ర్య యోధులకు కూడా పెన్షన్ సౌకర్యం లభింప చేసిన ఘనత ఆయనదే. హైదరాబాదు స్వాతంత్ర్య సమర చరిత్రను ప్రామాణిక పద్ధతుల్లో గ్రంథస్థం చేయించిన కృషీవలుడు ఆయన. వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్లు చెల్లవని కోర్టు తీర్పు ఇవ్వగా దాంతో బలహీన వర్గాల నాయకులందరిని ఒక తాటిపైకి తెచ్చి, ఒక కార్యవర్గాన్ని ఏర్పరిచి దానికి కన్వీనరు అయి సుప్రీం కోర్టుకు వెళ్లి హైకోర్టు తీర్పును రద్దు చేయించిన గొప్పతనం ఆయనదే. ఆంధ్ర ప్రదేశ్ లో తెలుగు అకాడమి లాగ హింది అకాడమి ఉండాలని ఉద్యమించి ప్రభుత్వాన్ని ఒప్పించి స్థాపించి దానికి తానే ఉపాధ్యక్షులయ్యారు. ఆయనే పోరాట పటిమ కు, కార్యదీక్షతకు నిలువుటద్దం గా నిలిచిన యోధుడు కాటం లక్ష్మి నారాయణ. కాటం లక్ష్మీనారాయణ (సెప్టెంబరు 19, 1924 – ఫిబ్రవరి 25, 2010) రంగారెడ్డి జిల్లా శంషాబాదులో, లక్ష్మయ్య, సత్తెమ్మ దంపతులకు 1924 వ సంవత్సరంలో సెప్టెంబరు 19 న జన్మించారు. అయన తాత కాటం నారాయణ స్థానిక జమీందా రుల అకృత్యాలను ఎదిరించిన ధైర్యవంతులు. తాత పేరుతో పాటు ధైర్య సాహసాలు కూడా పుణికితెచ్చు కున్నారు. 1942 అక్టోబరు 12 న బూర్గుల రామకృష్ణారావు చాదర్ ఘాట్ విక్టరీ ప్లే గ్రౌండులో సత్యాగ్రహం చేయడానికి సన్నాహాలు చేసిన సందర్భంలో నైజాము పోలీసులు బూర్గుల రామకృష్ణారావును, లక్ష్మీనారా యణను అరెస్ట్ చేశారు. అప్పటికి నారాయణ వయస్సు పంతొమ్మిది. అప్పటి నుండి లక్ష్మినారాయణ బూర్గుల రామకృష్ణారావుని గురువు గా బావించారు. పోలీసు లు లక్ష్మినారాయణను ఏడు నెలల పాటు చెంచల్ గూడ జైల్లో వుంచా రు. తర్వాత లక్ష్మినారాయణ న్యాయవిద్య పూర్తి చేసి బూర్గుల వారి వద్దనే జూనియర్ లాయర్ గా చేరారు. బూర్గుల తో పాటు అన్ని కార్య కలాపలాలలో క్రియా శీలక పాత్ర పోషించారు. ఆనాటి సామాజి క సమస్యలలో కూడా పాలు పంచుకున్నారు. నిజాం ప్రభుత్య ఆజ్ఞలను దిక్కరించి హింది పాఠశాలను స్థాపించాడు. ఖాది వ్యాప్తి, దళిత జనోద్ధరణ వంటి కార్యక్రమాలలో చురుకుగా పాల్గొన్నాతు. ఆచార్య రంగా ప్రేరణతో 1945లో లక్ష్మి నారాయణ హైదరాబాదు యువ జన కాంగ్రేసు స్థాపించి తాను ప్రదాన కార్యదర్శిగా పనిచేశారు. లక్ష్మి నారాయణ ఏదో ఒక ఉద్యమంలో పాల్గొనడం, అరెస్ట్ కావడం, తిరిగి రావడం, మళ్లి జైలుకెళ్లడం నిత్య కృత్యం అయింది.

నిజాం పాలన అంతమై, నూతన రాష్ట్రం ఏర్పాటు

అయ్యాక, ఆర్థిక, సాంకేతిక, వైజ్ఞానిక రంగాలలో రాష్ట్ర పునర్ నిర్మాణానికి 1949 డిసెంబరులో "జనత" పేరుతో ఒక పత్రికను ప్రారంబించారు. గతంలో రజాకార్ల చేతిలో హతుడైన షోయ బుల్లా ఖాన్తో కలిసి పత్రికా రంగంలో పనిచేసిన అనుభవం
ఇప్పు



డితనికి
బాగా ఉపకరిం
చింది. అంతే గాక రైతుల సమస్యల పరిష్కారానికి 1952లో రాష్ట్ర కర్షక సంఘాన్ని స్థాపించారు."తెలుగు భూమి" అనే మరొ పత్రికను 1969లో ప్రారంబించారు.

. ఆంధ్ర ప్రదేశ్ లో తెలుగు అకాడమి లాగ హింది అకాడమి ఉండాలని ఉద్యమించి ప్రభుత్వాన్ని ఒప్పించి స్థాపించి దానికి తానే ఉపాధ్యక్షులయ్యారు.

1968లో హైకోర్టు వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్లు చెల్లవని తీర్పు ఇవ్వగా దాంతో బలహీన వర్గాల నాయకులందరిని ఒక తాటిపైకి తెచ్చి ఒక కార్యవర్గాన్ని ఏర్పరిచి దానికి కన్వీనరు అయి సుప్రీం కోర్టుకు వెళ్లి హైకోర్టు తీర్పును రద్దు చేయించారు. ఆ సందర్భంలో ఒక మహా సభ ఏర్పాటు చేయించారు. దానికి లక్షలాది మంది రాగా నాటి ప్రధాన మంత్రి ఇందిరాగాంది కూడా రావడం విశేషం. లక్ష్మి నారాయణ సాధించిన ఘన విజయాలలో ఇది ఒకటి.

స్వాతంత్ర్య ఉద్యమాలలో పాల్గొన్న యోధులకు పెన్షన్ ఒక వరం లాంటిది అని నమ్మేవారు లక్ష్మి నారాయణ. స్వతంత్ర భారత్ లో ఈ అవకాశాన్ని అందరు వినియోగించు కుంటున్నా.... నిజాం పాలిత ప్రాంతాల యోధులకు ఆ అవకాశం రాలేదు. దీనిపై లక్ష్మినారాయణ కేంద్ర ప్రభుత్వంతో చర్చలు జరిపారు. కేంద్రం అంగీకరిం చక పోవడంతో లక్ష్మినారాయణ " తెలంగాణ సమర యోధుని సత్యా గ్రహం" అని రాసిన ఒక అట్టను మెడలో వేసుకుని ప్రధాని ఇంటి ముందు నిరాహార దీక్ష చేసారు. ఢిల్లీ పత్రికలు ప్రముఖంగా ఈ అంశాన్ని ప్రచురించాయి. దాంతొ ఇందిరా గాంధి లక్ష్మిణా యణను పిలిపించి కారణం అడగగా..... " సంస్థానాలలో స్వాతంత్ర్య యోధులను మీరు గుర్తించక పోవడాన్ని మేము అవమానంగా భావిస్తున్నాము. బ్రిటిష్ ఆంధ్ర స్వాతంత్ర్య యోధులు ఒక బ్రిటిష్ వారితోనె పోరాడారు. కాని సంస్థాన లోని యోధులు అటు సంస్థానాధీశులతోను, ఇటు బ్రిటిష్ వారితోను పోరాడారు. 15 ఆగస్టు మాకు స్వాతంత్ర్య దినం కాదా? హైదరాబాదు విముక్తి జరిగిన సెప్టెంబరు 17 ను స్వాతంత్ర్య దినంగా జరుపుకో మంటారా? ఒక్క హైదరాబాదు సంస్థాన ప్రజలే కాదు పలు సంస్థానాల ప్రజలు భారతీ యులు కారా? అవునా? కాదా? ముందు ఇది తేల్చండి? " అని సూటిగా, ధైర్యంగా ఇందిరా గాంధిని ప్రశ్నించి యోధుడు లక్ష్మి నారాయ ణ. దాంతో సంస్థానాల లోని స్వాతంత్ర్య యోధులకు కూడా పెన్షన్ సౌకర్యం లభించింది. ఈ యోధుడు సాధించిన అతి పెద్ద ఘన కార్యం. నేటికీ ప్రామాణిక గ్రంథంగా ఉన్న 844 పేజీల హైదరాబాదు స్వాతంత్ర్య సమర చరిత్రను ప్రామాణిక పద్ధతుల్లో గ్రంథస్థం చేయించారు... దాన్ని అప్పటి భారత రాష్ట్ర పతి జైల్ సింగ్ చేత ఆవిష్కరింప జేసారు. పి.వి.నరసింహ రావు, టి. అంజ య్య, కాసు బ్రంహానంద రెడ్డి, భవనం వెంకట్రామ రెడ్డి, నలుగురు ముఖ్య మంత్రులతో ఒక పెద్ద సభను నిర్వహించారు. అయన నిర్వహించిన సభలకు ప్రధాన మంత్రులు, రాష్ట్రపతులు, పీఠాధి పతులు, స్వాతంత్ర సమర యోధు లు, దలైలామ వంటి వారు కూడా పాల్గొనే వారు. ఆ మహా యోధు డు 2010 వ సంవత్సరం ఫిబ్రవరి 25 నాడు ఈ లోకాన్ని వదిలి వెళ్లారు.



రామ కిష్టయ్య సంగన భట్ల...
9440595494

# వన్యప్రాణుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు

## అభయారణ్యాల్లో అండర్‌పాస్‌ల నిర్మాణం

## రాత్రి వేళల్లో వాహనాల రాకపోకలపై నిషేధం

## రాష్ట్ర వన్యప్రాణి మండలి సమావేశంలో నిర్ణయం

హైదరాబాద్,ఫిబ్రవరి24: అభయారణ్యాల్లో రహదారుల నిర్మాణాలు, వన్యప్రాణుల ఆవాసాలకు అడ్డు రాకుండా అవి స్వేచ్ఛగా సంచరించేందుకు అండర్ పాస్‌ల ఏర్పాటుకు రాష్ట్ర వన్యప్రాణి మండలి ఆమోదం తెలిపింది. అభయారణ్యాల్లో వన్యప్రాణులు స్వేచ్ఛగా సంచరించేలా



రహదారుల వద్ద అండర్ పాస్‌ల నిర్మాణం, వేగ నియంత్రణ, రాత్రి వేళల్లో వాహనాల రాకపోకలపై నిషేధం, అఖిల భారత పులుల గణన, తదితర అంశాలపై సమావేశంలో చర్చించారు.అటవీ, పర్యావరణ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి అధ్యక్షతన గురువారం రాష్ట్ర వన్య ప్రాణి మండలి సమావేశం జరిగింది. నిర్మల్ జిల్లా కేంద్రంలోని అటవీ శాఖ కార్యాలయం నుంచి వర్చువల్ సమావేశంలో మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి పాల్గొనగా, అరణ్య భవన్ నుంచి అటవీ శాఖ అధికారులు పాల్గొన్నారు. అంతకుముందు రాష్ట్ర వన్యప్రాణి బోర్డు గతంలో తీసుకున్న నిర్ణయాలు, వాటి ప్రగతిని గురించి పీసీసీఎఫ్ ఆర్. శోభ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మండలి సభ్యులకు వివరించారు. ఈ సందర్భంగా మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి మాట్లాడుతూ వన్యప్రాణి సంరక్షణకు తగిన చర్యలు తీసుకున్నాకే రహదారుల నిర్మాణం, అండర్ పాస్ ల ఏర్పాటుకు ఆమోద ముద్ర వేసినట్టు తెలిపారు.రాష్ట్ర వన్యప్రాణి మండలి ఆమోదం తెలిపిన ప్రతిపాదనలకు కేంద్ర వన్యప్రాణి మండలి నుంచి త్వరితగతిన అనుమతులు వచ్చేలా చూడాలని తెలిపారు. రహదారుల నిర్మాణం, మరమ్మత్తులు సాధ్యమైనంత త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. అభయారణ్యాల్లో వన్యప్రాణుల ప్రమాదాల భారిన పడకుండా వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేసి, వేగ నియంత్రణ సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. వన్యప్రాణుల సంరక్షణపై స్థానిక ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు.రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని వన్య ప్రాణుల దాహాన్ని తీర్చేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ సమావేశంలో అటవీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, శాంతికుమారి, పీసీసీఎఫ్ ఆర్. శోభ, పీసీసీఎఫ్ (సోషల్ ఫారెస్ట్రీ) ఆర్.ఎం, డొబ్రియల్, బోర్డు సభ్యులుగా ఉన్న ఎమ్మెల్యే కోనప్ప, రాఘవ, ఇతర బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

# ఉక్రెయిన్‌లో చిక్కుకున్న విద్యార్థులు

## ఆందోళనలో వారి తల్లిదండ్రులు– ఎంపి బండి సంజయ్‌కు వేడుకోలు

హైదరాబాద్,ఫిబ్రవరి24:ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం ప్రకటించడంతో ఉక్రెయిన్‌లో ఉన్న భారతీయులపై ఇండియాలో ఉన్న వారి కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళన చెందుతున్నారు.
తమ వారిని క్షేమంగా స్వదేశానికి తిరిగి తీసుకురావాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ క్రమంలోనే కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్‌కు జిల్లాకు చెందిన విద్యార్థులు ఉక్రెయిన్‌లో చిక్కుకున్నట్టు వారి కుటుంబ సభ్యులు తెలిపారు. కరీంనగర్‌కు చెందిన కడారి సుమాంజలి అనే విద్యార్థిని ఉక్రెయిన్ రాజధాని కైవ్ సమీపంలోని బోరిస్పిల్ అంతర్జాతీయ విమానాశ్రయంలో చిక్కుకున్నట్టు ఆమె కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆమెతో పాటు జిల్లాకు చెందిన మరో 20 మంది విద్యార్థులు సైతం విమానాశ్రయంలోనే ఉండిపోయారని పేర్కొన్నారు. వారిని సురక్షితంగా స్వదేశానికి తరలించారని పేరెంట్స్ ఎంపీని కోరారు. ఈ నేపథ్యంలో బండి సంజయ్.. భారత విదేశాంగ మంత్రి జయశంకర్‌కు సమాచారం అందించారు.
కరీంనగర్ విద్యార్థిని సుమాంజలి, ఆమె స్నేహితులు( శ్రీనిధి, రమ్యశ్రీ, లిఖిత)తో పాటు తెలంగాణాలోని వివిధ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు ఉక్రెయిన్ చిక్కుకున్నారని తెలిపారు. కాగా, ఈ నలుగురు విద్యార్థులు భారత్‌కు తిరిగి వచ్చేందుకు ఎయిరిండియా కోసం టిక్కెట్లు బుక్ చేసుకున్నారని చెప్పారు. కానీ, వీరు విమానాశ్రయానికి చేరుకునే సమయానికి, అధికారులు ఎయిర్‌పోర్టును మూసివేశారు, ఫలితంగా వారందరూ విమానాశ్రయంలో చిక్కుకున్నారు. దీంతో వారు బయటకు వెళ్లలేని పరిస్థితిలో ఉన్నారని పేర్కొన్నారు. కాగా, తెలంగాణకు చెందిన విద్యార్థులను సురక్షితంగా రాష్ట్రానికి తరలించేందుకు భారత రాయబార కార్యాలయం చొరవ తీసుకోవాలని ఆయన అభ్యర్థించారు. సంజయ్ లేఖకు స్పందిస్తూ.. విదేశాంగ మంత్రిత్వ శాఖలోని అధికారులు ఉక్రెయిన్ ప్రభుత్వంతో సంప్రదింపులు ప్రారంభించినట్టు వెల్లడించారు. విద్యార్థులందరూ స్వదేశానికి తిరిగి వచ్చేలా చర్యలు తీసుకోనున్నట్టు తెలిపారు.

# ఝార్ఖండ్‌లో ఘోర ప్రమాదం

- దామోదర్ నదిలో అర్ధరాత్రి పడవ బోల్తా
- 14 మంది గల్లంతు, ప్రాణాలు దక్కించుకున్న నలుగురు
- కొనసాగుతున్న సహాయక చర్యలు



ధన్‌బాద్,ఫిబ్రవరి24: ఝార్ఖండ్‌లో గురువారం రాత్రి ఘోర ప్రమాదం సంభవించింది. దామోదర్ నదిలో పడవ బోల్తా పడిన ఘటనలో మొత్తం14 మంది గల్లంతయ్యారు. ప్రమాద సమయంలో పడవలో మొత్తం 18 మంది ప్రయాణికులు ఉన్నారు. అయితే జమ్తారా జిల్లా యంత్రాంగంతో పాటు ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది సకాలంలో స్పందించి నలుగురిని ఎలాగోలా ఒడ్డుకు చేర్చారు. మరో 14 మంది గల్లంతయ్యారు. వీరి కోసం విస్తృతంగా గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. కాగా ఝార్ఖండ్ లో ప్రస్తుతం భారీ వర్షాలు కురుస్తున్నాయి. ధన్ బాద్‌లోని నిర్సా నుంచి జమ్తర్‌కు వెళుతుండగా.. బార్బెండియా వంతెన వద్ద ఈ ప్రమాదం చోటుచేసుకుంది.కాగా పడవ ప్రమాదంపై ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ విచారం వ్యక్తం చేశారు. 'గల్లంతైన ప్రయాణికులను కాపాడేందుకు జిల్లా యంత్రాంగం, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు రెస్క్యూ ఆపరేషన్ నిర్వహిస్తున్నాయి. అందరూ సురక్షితంగా తిరిగిరావలని కోరుకుంటున్నాను' అని ట్వీట్ చేశారు. కాగా ఒడ్డుకు చేరిన నలుగురిని వెంటనే ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది పేర్కొన్నారు.

## మిషన్ భగీరథతో ఇంటింటికి మంచినీటి సరఫరా

**శుద్ధిచేసిన నీటిని అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ**
**జాతీయ స్థాయిలో తెలంగాణకు ప్రత్యేక గుర్తింపు**
**ప్రశంసలు కురిపించిన కేంద్రమంత్రి గజేంద్రసింగ్ షెకావత్**

హైదరాబాద్,ఫిబ్రవరి24: మిషన్ భగీరథపై మరోసారి కేంద్రం ప్రశంసల జల్లును కురిపించింది. దేశంలోనే ఇంటింటికి శుద్ధిచేసిన మంచినీటిని అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని పొగడ్తలతో ముంచెత్తింది. జాతీయ గ్రామీణ అభివృద్ధి సంస్థ, యూనిసెఫ్ సంయుక్తంగా నిర్వహించిన నేషనల్ వాటర్ శానిటేషన్ హైజిన్ కాంక్లేవ్.. 2022 సదస్సును నిర్వహించింది. వర్చువల్ గా జరిగిన ఈ సమావేశానికి హాజరైన కేంద్ర జల శక్తి శాఖ మంత్రి గజేంద్ర సింగ్ మాట్లాడుతూ, అతి తక్కువ సమయంలోనే తెలంగాణ రాష్ట్రం



ఇంటింటికి శుద్ధిచేసిన నీటిని అందిస్తూ అన్ని రాష్ట్రాలకు మార్గదర్శకంగా నిలిచిందన్నారు. ప్రస్తుతం అనేక రాష్ట్రాలు భగీరథ కార్యక్రమాన్ని ఆదర్శంగా తీసుకుని ప్రతి ఇంటికి మంచినీటిని అందించే కార్యక్రమాల్లో నిమగ్నమై ఉన్నాయన్నారు. ప్రజలకు మంచి జరిగే ఈ కార్యక్రమాన్ని ఎవరు అమలు చేసినా దానిని మనస్ఫూర్తిగా అందరూ అభినందించాల్సిందేనని కేంద్రమంత్రి పేర్కొన్నారు. కేంద్ర మంత్రి గజేంద్రషెకావత్ అభినందనలను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు స్వాగతించారు. కేంద్రమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాల అమలుపై కేంద్రం ప్రశంసలు చేయడమే కాకుండా రాష్ట్రానికి రావాల్సిన నిధులపై కూడా దృష్టి సారించాలని మంత్రి ఎర్రబెల్లి విజ్ఞప్తి చేశారు. ప్రధానంగా నీతి ఆయోగ్ సిఫారసుల మేరకు రాష్ట్రానికి 19 వేల కోట్ల రూపాయలను మిషన్ భగీరథ అమలు కోసం నిధులు విడుదల చేయాలని ఈ సందర్భంగా కేంద్రాన్ని ఆయన కోరారు. మిషన్ భగీరథ కార్యక్రమం క్రింద రాష్ట్రంలోని 100 శాతం గ్రామీణ ఆవాసాలకు త్రాగునీటి సౌకర్యం కల్పించామన్నారు. అందులో భాగంగా 23 వేల 930 గ్రామీణ ఆవాసాలోని 2 కోట్ల 5 లక్షల 70 వేల గ్రామీణ జనాభాకు 54 లక్షల 6 వేల నల్లా కనెక్షన్ల ద్వారా మంచినీటి సౌకర్యం కల్పించడం ద్వారా దేశంలోనే తెలంగాణ రాష్ట్రం అగ్రగామిగా ఉందని మంత్రి ఎర్రబెల్లి పేర్కొన్నారు.

ఇంటింటికీ నల్లా పథకంలో దేశంలోనే తెలంగాణ అగ్రగామిగా ఉందని, నిర్దేశించిన 2024 కంటే ముందే లక్ష్యాన్ని చేరుకుందని పలుమార్లు కేంద్రం ప్రశంసించిందని అన్నారు. ప్రధానంగా ఆదిలాబాదు, ఖమ్మం లాంటి అదివాసి ప్రాంతాలలో జనం కలుషిత జలాలు తాగి డయేరియా, ఇతర జబ్బుల వల్ల ఇబ్బంది పడేవారని ఈ సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి గుర్తు చేశారు. ఈ పరిస్థితిని పూర్తిగా రూపుమాపాలని సిఎం కెసిఆర్ కంకణం కట్టుకుని భగీరథ కార్యక్రమానికి పూనుకున్నారన్నారు. ఈ పథకం క్రింద రాష్ట్రంలోని అన్ని ఆవాసాలకు శుద్ధిచేసిన సురక్షిత జలాలు ఇంటింటికి నల్లాల ద్వారా అందుతున్నాయని మంత్రి తెలిపారు. వివిధ పథకాల అమలులో తెలంగాణ దేశంలోనే అగ్రగామిగా ఉండడంవల్ల బంగారు తెలంగాణ సాకారమవుతున్నదని మంత్రి దయాకర్ రావు అన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో అమలవుతున్న వివిధ పథకాలను ప్రశంసించడమే కాకుండా పథకాల అమలుకు కూడా రాష్ట్రానికి నిధులు మంజూరు చేయాలని కోరారు.

## మధిర నియోజకవర్గంలో భట్టి పాదయాత్ర

ఖమ్మం,ఫిబ్రవరి24: ప్రజాసమస్యల పరిష్కారం కోరతూ సీఎల్పీ నేత భట్టి విక్రమార్క తాను ప్రాతినిధ్యం వహిస్తున్న ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గంలో పాదయాత్రకు శ్రీకారం చుట్టబోతున్నారు. . సుమారు 500కి.మీపైగా నిరంతరం సాగే ఈ పాదయాత్ర ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు, ఎన్నికల్లో చేసిన వాగ్దానాలు, క్షేత్రస్థాయిలో అమలుతీరున ప్రత్యక్షంగా తెలుసుకోనున్నారు. గ్రామాల్లో డబుల్‌బెడ్‌రూం ఇళ్ల పథకం తీరు, దళితులకు మూడెకరాల భూమి, నిరుద్యోగులకు ఉద్యోగాలు, రైతులకు గిట్టుబాటు ధరలు, అర్హులకు పింఛన్లు ఇలా టీఆర్ఎస్, బీజేపీ ప్రభుత్వాలు ఇచ్చిన హామీలు అమలుతీరును ప్రజలనుంచే అడిగి తెలుసుకుని వారి సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించి రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వాన్ని నిలదీయనున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా మార్చి 30వరకు ఈ పాదయాత్ర కొనసాగనుంది. 27న ఉదయం 9గంటలకు ముదిగొండ మండలం యడవల్లిలోని లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి పాదయాత్ర ప్రారంభిస్తారని మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు తెలిపారు. భట్టి పాదయాత్ర ప్రారంభానికి సంబంధించి షెడ్యూల్‌ను విడుదల చేశారు. ముదిగొండ, చింతకాని, బోనకల్, మధిర, ఎర్రుపాలెం మండలాల్లో భట్టిపాదయాత్ర నిర్వహించనున్నారు.

## రైతులకు మేం అన్నం పెడితే... బీజేపీ సున్నం పెడుతోంది

**దేశ సంపదను అమ్మడంలో బీజేపీ నెంబర్‌వన్**
**కేసీఆర్ ఓపికను.. సహనాన్ని అలుసుగా తీసుకోవద్దు**
**మీడియాతో ఎమ్మెల్సీ కవిత**

కామారెడ్డి,ఫిబ్రవరి24: టీఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ న్యాయం వైపే ఉంటుందని ఎమ్మెల్సీ కవిత స్పష్టం చేశారు. రైతులకు తెలంగాణ ప్రభుత్వం అన్నం పెడితే, బీజేపీ సున్నం పెడుతోందని ఆమె ఆరోపించారు.రాష్ట్ర సమస్యలపై పార్లమెంట్‌లో బీజేపీ ఎంపీలు నోరు విప్పడం లేదని ఆమె విమర్శించారు. దేశ ప్రజల ప్రయోజనం కోసం పోరాడేది కేవలం టీఆర్ఎస్ మాత్రమేనని అన్నారు. దేశ సంపదను అమ్మడంలో బీజేపీ నెంబర్ వన్ అంటూ ఆమె ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఓపికను, సహనాన్ని చేతకాని తనంగా భావించొద్దని కవిత స్పష్టం చేశారు. నీళ్లు, నిధులకేడ్చిన తెలంగాణ కోసం పట్టుదలతో ముందుకొచ్చిన నేత కేసీఆర్ అని ఎమ్మెల్సీ కవిత అన్నారు. గురువారం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. ప్రజల మద్దతుతో కేసీఆర్ తెలంగాణ సాధించారని ఆమె అన్నారు.



సత్యం చెప్పి ఉద్యమం చేశారు.. నిజం చెబుతూనే రాష్ట్ర అభివృద్ధి చేశారని ఆమె తెలిపారు. ఏం చేస్తామో అదే చెప్పడం కేసీఆర్ నైజమని ఆమె పేర్కొన్నారు. బీజేపీ, కాంగ్రెస్ నాయకులు అవాకులు చెవాకులు పేలినప్పుడు.. మనం చేసిన అభివృద్ధి పనులను చెప్పి సమాధానం ఇవ్వాలని ఆమె కార్యకర్తలకు సూచించారు. కార్యకర్తలు ప్రభుత్వం చేస్తున్న పనులను తెలుసుకోవాలని ఆమె సూచించారు. కరోనా సమయంలోనూ టీఆర్ఎస్ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ఆపలేదని ఆమె స్పష్టం చేశారు. మనం రైతులకు అన్నం పెడితే.. మోదీ సున్నం పెడుతున్నారని ఆమె ఆరోపించారు. మోటర్లకు మీటర్లు పెడతామని మోదీ అంటే.. ఇక్కడ ఒక్క బీజేపీ నాయకుడు మాట్లాడుతలేరని ఆమె విమర్శించారు. ఢిల్లీ అయినా, గల్లీ అయినా పేద ప్రజల తరపున గొంతెత్తేది టీఆర్ఎస్ మాత్రమేనని ఆమె వ్యాఖ్యానించారు.

## డ్రగ్స్ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కదలాలి

**మహమ్మారి మత్తులో పడకుండా జాగ్రత్త పడాలి**
**డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన సదస్సులో మంత్రి తలసాని**

హైదరాబాద్,ఫిబ్రవరి24: తెలంగాణలో డ్రగ్స్ నిర్మూలనకు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు పట్టుదలగా ఉన్నారని, ఈ విషయంలో మరిన్నికఠిన నిర్ణయాలు తీసుకోనున్నారని పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. పోలీసులు ఈ విషయంలో మరింత కఠినంగా




వ్యవహరించాల్సిన అవసరం వుందన్నారు. గురువారం నార్త్ జోన్ పోలీసుల ఆధ్వర్యంలో డ్రగ్స్ నిర్మూలన పై అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి మంత్రి తలసాని ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో డ్రగ్స్ నివారణ పై తీసుకోవాల్సిన చర్యలపై ఇప్పటికే రెండుసార్లు ఉన్నతాధికారులతో సమావేశాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ప్రస్తుతం డ్రగ్స్ మహమ్మారి ప్రపంచాన్ని కుదిపేస్తున్నదని మంత్రి పేర్కొన్నారు. చాలా మంది తెలియకుండానే డ్రగ్స్‌కు బానిసలుగా మారుతు న్నారని, ఒక్కసారి డ్రగ్స్కు బానిసలు అయితే చావే శరణ్యమని అన్నారు. డ్రగ్స్ ఉపయోగించడం వలన కుటుంబాలు రోడ్డున పడుతాయని, తప్పు చేసి జైలుకు వెళ్లడం ఎందుకు అసలు తప్పే చేయకుండా ఉంటే బావుంటుందని సూచించారు. చాలా నేరాలలో నేరస్తులను క్షణాల్లో పట్టుకునే సత్తా తెలంగాణ పోలీసులకే ఉందన్నారు. ప్రస్తుతం కార్పోరేట్ ఆఫీలకు ధీటుగా పోలీస్ స్టేషన్ కార్యాలయాలు ఉన్నాయని అన్నారు. సమాజంలో ఉన్న డ్రగ్స్ మాఫియాను నిర్మూలించడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలన్నారు.విశ్వనగరంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ ఇమేజ్ ను దెబ్బతీసే డ్రగ్స్ ను ప్రతి ఒక్కరం నిర్మూలిద్దామని ఈసందర్భంగా మంత్రి పిలుపునిచ్చారు. డ్రగ్స్‌లో పట్టుబడితే పోలీసులు ఎవ్వరిని వదిలి పెట్టరన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ప్రపంచాన్ని డ్రగ్స్ ప్రస్తుతం కుదిపేస్తున్నది. చాలా మంది తెలియ కుండానే డ్రగ్స్‌కు బానిసలుగా మారుతున్నారని ఆయన తెలిపారు. ఒక్కసారి డ్రగ్స్ కు బానిసలు అయితే చావే శరణ్యం అన్నారు. విశ్వనగరంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ ఇమేజ్‌ను దెబ్బతీసే డ్రగ్స్‌ను అందరం కలిసి అడ్డుకుందామన్నారు. డ్రగ్స్ తీసుకుంటూ పట్టుబడితే పోలీసులు ఎంతటి వారినైనా వదిలి పెట్టరని హెచ్చరించారు.

# యుద్ధాన్ని ఆపండి

మొదటిపేజీ తరువాయి..

నిర్వహిస్తున్నట్లు అమెరికా అధినేత తెలిపారు. కాగా ఈ సంక్షోభంలో ఉక్రెయిన్ ప్రజలకు అండగా ఉంటామని బైడెన్ భరోసా ఇచ్చారు. అయితే రష్యాతో యుద్ధానికి తమ బలగాలను పంపించడం లేదని ఆయన స్పష్టం చేశారు. 'ఉక్రెయిన్‌పై దాడికి రష్యా మూల్యం చెల్లించుకోక తప్పదు. యుద్ధం వల్ల తలెత్తే పర్యావసనాలు పుతిన్ పట్టించుకోవడం లేదు. రష్యా యుద్ధాన్ని ఆపకుంటే మరిన్ని ఆంక్షలు విధిస్తాం. ఉక్రెయిన్ ప్రజలకు మా మద్దతు ఎప్పుడూ ఉంటుంది. ఇక అమెరికాపై రష్యా సైబర్ దాడులు జరుపుతాయన్న వార్తలు వినిపిస్తున్నాయి. వాటిని ఎదుర్కొనేందుకు మేం సిద్ధంగా ఉన్నాం' అని బైడెన్ తెలిపారు. కాగా అంతకుముందే ఉక్రెయిన్‌పై దాడికి సంబంధించి జో బైడెన్ ట్విట్టర్ వేదికగా స్పందించారు. 'ఈ ఉదయాన్నే జీ 7 దేశాల మిత్రులను కలిశాను. పుతిన్ అన్యాయంగా ఉక్రెయిన్‌పై దాడి చేస్తున్నారు. దీన్ని అడ్డుకునేందుకు రష్యాపై కఠినమైన ఆర్థిక ఆంక్షలు విధించాలని మేం నిర్ణయించుకున్నాం.' అని ట్విట్టర్లో రాసుకొచ్చారు. ఉక్రెయిన్‌పై యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో ఫోన్ లో మాట్లాడారు. యుద్ధం ఆపాలని ఈ సందర్భంగా రష్యా అధ్యక్షుడిని కోరారు. చర్చల ద్వారా సామరస్యంగా సమస్యను పరిష్కారం చేసుకోవాలని సూచించారు. యుద్ధం కారణంగా ఉక్రెయిన్ లో నెలకొన్న దీన పరిస్థితులను మోడీ పుతిన్ కు వివరించారు. ఉక్రెయిన్‌లో నివసిస్తోన్న భారతీయ విద్యార్థుల క్షేమం గురించి ఆలోచించాలని కోరారు. కాగా మొదటి నుంచి భారత్‌కు రష్యా మిత్రదేశంగా ఉన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో వెంటనే యుద్ధాన్ని నిలిపేయాలని పుతిన్‌ను ప్రధాని కోరడం చర్చనీయంశంగా మారింది. అయితే పుతిన్ యుద్ధం కొనసాగింపునకే మొగ్గు చూపినట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా ఉక్రెయిన్‌పై దాడి చేయడానికి దారి తీసిన పరిస్థితులను పుతిన్ మోడీకి వివరించారు. కాగా రష్యా- ఉక్రెయిన్ యుద్ధంపై భారత్ తటస్థ వైఖరిని అవలంభిస్తుందని భారత విదేశాంగశాఖ గురువారం ఉదయం ప్రకటించిన సంగతి తెలిసిందే. శాంతియుత మార్గాల ద్వారానే ఈ సమస్యకు పరిష్కారం కోరుకుంటున్నట్లు ప్రకటించింది. ప్రస్తుతం ఉక్రెయిన్‌లో ఉన్న భారతీయుల భద్రత పైనే ప్రధాన దృష్టి సారించినట్లు విదేశాంగ శాఖ చెప్పుకొచ్చింది. అయితే ఇంతలోనే మోడీ పుతిన్‌కు ఫోన్ చేసి యుద్ధం ఆపమనడం ప్రాధాన్యం సంతరించుకుంది.



## బయ్యారం ఉక్కుపై విభజనచట్టంలో ఉంది

**జిల్లా ఏర్పాటుతోనూ మానుకోట అభివృద్ధి: వినోద్**

మహబూబాబాద్,ఫిబ్రవరి24: 14 ఏండ్ల క్రితమే బయ్యారం ఉక్కు తెలంగాణ హక్కు అనే నినాదం ఇచ్చిన పార్టీ టీఆర్ఎస్ అని రాష్ట్ర ప్రణాళిక సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్ గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలో ఉక్కు ఫ్యాక్టరీ గురించి క్లుప్తంగా ఉందన్నారు. బయ్యారంలో 100 కోట్ల టన్నుల ఐరన్ నిక్షేపాలు ఉన్నాయని, ఉక్కు పరిశ్రమకి అనుకూలంగా ఉందని ఎన్ఎండీసీ స్పష్టం చేసిందన్నారు. సీఎం కేసీఆర్ మహబూబాబాద్‌ను జిల్లాగా చేయడం వల్లే ఈ రోజు ఇంత అభివృద్ధి జరిగిందని అన్నారు. మహబూబాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రెస్ మీట్‌లో ఆయన మాట్లాడారు. కేసీఆర్ 2001 నుంచే తెలంగాణ గురించి పూర్తిగా అధ్యయనం చేశారన్నారు. మెడికల్ కళాశాల త్వరగా పూర్తి చేసి వచ్చే సంవత్సరం ప్రారంభిస్తామన్నారు. బీజేపీ ప్రభుత్వం పరిశ్రమ పెట్టడానికి చేతకాక బయ్యారం ఉక్కును అనుమానిస్తుందన్నారు. రేవంత్ రెడ్డి ఉపయోగించే భాషా విధానాన్ని ప్రజలు గమనిస్తున్నారని వినోద్ కుమార్ తెలిపారు. అసత్య ప్రచారాలు చేస్తున్న వివిధ పార్టీల పట్ల ఇన్నాళ్లు మౌనంగా ఉన్నాం. ఇక ఇప్పటి నుంచే ఊరుకునేది లేదన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే శంకర్ నాయక్,ఎమ్మెల్సీ రవీందర్ రావు, నాగుర్ల వెంకటేశ్వర్లు, బీరవెల్లి భరత్ కుమార్ రెడ్డి ఉన్నారు.

# ప్రపంచ ఫార్మా హబ్‌గా హైదరాబాద్

మొదటిపేజీ తరువాయి..

రూ. 6,400 కోట్లకు పైగా పెట్టుబడులను ఆకర్షించిందని తెలిపారు. ఇప్పటికే ఉన్నవాటితో పాటు కొత్తగా వచ్చిన సంస్థలతో ఏడాది కాలంలో 34 వేల మందికి ఉపాధి లభించిందన్నారు. గతేడాదితో పోలిస్తే 200 శాతం వృద్ధి సాధించింది. జీవశాస్త్ర రంగాల్లో హైదరాబాద్ ఏ విధంగా ప్రభావం చూపుతోంది.. ఈ వృద్ధినే నిదర్శనమని చెప్పారు. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎలా ప్రోత్సాహం అందిస్తుందనేది స్పష్టమవుతోందని కేటీఆర్ తెలిపారు.

## రష్యా యుద్ధ ప్రకటనతో మార్కెట్లపై తీవ్ర ప్రభావం

### బంగారం ధరలకు రెక్కలు

### 51 వేల మార్కును తాకిన 10 గ్రాముల బంగారం ధర

### వంద డాలర్లు దాటిన క్రూడాయిల్ బ్యారెల్ ధర

న్యూఢిల్లీ,ఫిబ్రవరి24: ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధ ప్రకటనతో బంగారం ధర అమాంతం పెరిగిపోయింది. గురువారం భారత్‌లో 10 గ్రాముల బంగారం ధర 51 వేల మార్కును తాకింది. మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజ్‌లో పసిడి విలువ 2.02 శాతం పెరిగి, రూ.51,396కి చేరింది. వెండి ధరలో కూడా రెండు శాతం పెరుగుదల నమోదైంది. దాంతో కిలోకు దాని విలువ రూ.65,876కు పెరిగింది. రష్యా, ఉక్రెయిన్ మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతలు ప్రపంచమార్కెట్‌ను ఆందోళనకు గురిచేస్తున్నాయి. దాంతో ట్రేడింగ్ బంగారానికి అనుకూలంగా ఉందని ఐసీఐసీఐ డెరెక్ట్ ఒక నివేదికలో పేర్కొంది. అలాగే అంతర్జాతీయ మార్కెట్‌లో స్పాట్‌గోల్డ్ ధర ఔన్స్‌కు 1.9 శాతం పెరిగి 1,943.86 డాలర్లకు చేరుకుంది. 2021 తర్వాత ఇదే అత్యధిక స్థాయి కావడం గమనార్హం. యూఎస్ గోల్డ్ ఫ్యూచర్స్ రెండు శాతానికి ఎగబాకి, 1,949.20 డాలర్లకు పెరిగింది. కాగా, ఫిబ్రవరిలో పసిడి ధరలు ఇప్పటివరకు దాదాపు ఎనిమిది శాతం పెరిగాయి. మరోపక్క, ఈ ఉక్రెయిన్ సంక్షోభం కారణంగా స్టాక్‌మార్కెట్లు కుప్పకూలుతున్నాయి. ముడి చమురు, డాలర్ విలువ పెరుగుతున్నాయి. మన స్టాక్ మార్కెట్లు యుద్ధభీతితో కొట్టుమిట్టాడుతున్నాయి. ఉక్రెయిన్‌పై మిలటరీ ఆపరేషన్ చేపడుతున్నట్లు పుతిన్ ప్రకటన అంతర్జాతీయ మార్కెట్లపై తీవ్ర ప్రభావం చూపాయి. అంతర్జాతీయ మార్కెట్లో క్రూడాయిల్ ధర గురువారం 100 డాలర్లను దాటింది. సుమారు ఏడేళ్ల అనంతరం అత్యధిక ధర నమోదవడం



గమనార్హం. 2014వ సంవత్సరం తర్వాత తొలిసారిగా చమురు ధరలు బ్యారెల్‌కు 100 డాలర్లకు చేరాయి. 2014వ సంవత్సరంలో ముడిచమురు బ్యారెల్ ధర 100 డాలర్లను అధిగమించింది. ఇంధనంతోపాటు గోధుమలు, లోహాల ధరలు పెరగనున్నట్లు సమాచారం. ఇటీవల కరోనా లాక్ డౌన్‌ల అనంతరం ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక సంక్షోభం నెలకొన్న సంగతి తెలిసిందే. రష్యా ప్రపంచంలోనే రెండవ అతిపెద్ద చమురు ఉత్పత్తిదారు. ఇది ప్రధానంగా యూరోపియన్ రిఫైనరీలకు ముడి చమురును విక్రయిస్తుంది. మార్కెట్ ఇన్వెస్టర్లు వేగంగా సురక్షితమైన పెట్టుబడుల వైపు మళ్లుతున్నారని విశ్లేషకులు పేర్కొంటున్నారు. అందుకే బంగారం, డాలర్లు, జపాన్ యెన్ వంటి వాటి ధరలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. ఆసియా స్టాక్ మార్కెట్లు 2 నుండి 3 శాతం నష్టపోయాయి. సెన్సెక్స్ 1432.50 పాయింట్లు నష్టపోగా, నిఫ్టీ 410.70 పాయింట్లు నష్టపోయింది. సెన్సెక్స్ ఉదయం 9 గంటల సమయంలో 1432.50 పాయింట్లు లేదా 2.50 క్షీణించి 55,795 వద్ద ట్రేడవుతోంది. అలాగే నిఫ్టీ 410.70 పాయింట్లు లేదా 2.41 శాతం క్షీణించి 166652.60 వద్ద ట్రేడవుతోంది.

## ఇంటర్ పరీక్షలకు పక్కాగా ఏర్పాట్లు

నిజామాబాద్,ఫిబ్రవరి24: జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. జిల్లావ్యాప్తంగా పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాలకు చెందిన విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం పన్నెండు గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. ఇంటర్మీడియట్ బోర్డుతోపాటు పోలీస్, రెవెన్యూ శాఖల సహకారంతో కరోనా నిబంధనల మేరకు పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. తల్లిదండ్రులు ఈ విషయంలో జాగ్రత్తగా ఉండాలని అధికారులు అన్నారు. కళాశాలల ప్రిన్సిపాళ్లు, లెక్చరర్లు విద్యార్థులకు ఈ విషయంలో అవగాహన కల్పించాలన్నారు. పరీక్షా కేంద్రాన్ని ఒకరోజు ముందుగానే చూసుకుంటే పరీక్ష రోజు కేంద్రాన్ని గురించి వెదుకులాడే అవసరం ఉండదన్నారు. పరీక్ష సమయానికంటే ముందుగానే పరీక్షా కేంద్రానికి వెళ్లేలా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పరీక్ష సమయం కంటే ముందుగానే బయల్దేరాలన్నారు. ఒక్క విద్యార్థి కూడా ఆలస్యంగా వచ్చి, పరీక్ష రాయకుండా తిరిగి వెళ్లే పరిస్థితి రాకుండా చూడాలన్నారు. మరోవైపు పరీక్షలపై అధికారులతో సమీక్షించి తగు సూచనలు చేశారు. పరీక్ష రాసే విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. పరీక్షల సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఏ పరీక్షా కేంద్రంలో విధులు కేటాయించారో అక్కడికి వెళ్లి సదుపాయాలను సరిచూసుకోవాలని సిబ్బందికి సూచించారు.



జనగామ జిల్లా గౌడ మహిళా సంఘం నూతన సంవత్సర క్యాలెండర్ ను ఆవిష్కరించిన మాజీ ముఖ్యమంత్రి, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి. పాల్గొన్న తెలంగాణ గౌడ మహిళ పరస్పర సహాయక సహకార పరపతి సంఘం వ్యవస్థాపకురాలు వంగ రేణుక, జిల్లా గ్రంథాలయం సంస్థ చైర్మన్ ఎడవల్లి కృష్ణారెడ్డి, రాంబాబు, పొన్నం కుమార స్వామి, యాదగిరి, శీను, నాగేశ్వర రావు, రమేష్, లావణ్య, లలిత, భాగ్య.



కరీంనగర్ ఎం.పి. బండి సంజయ్ని మర్యాదపూర్వకంగా కలిసిన కరీంనగర్ బిజెపి జిల్లా ఉపాధ్యక్షులుగా నియమితులైన మాడ వెంకటరెడ్డి. పాల్గొన్న అంతం రాజిరెడ్డి, శంకరపట్నం కిసాన్మోర్చా అధ్యక్షులు జగ్గారెడ్డి, బిజెపి నాయకుడు మాడ చొక్కారెడ్డి

## కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు
## చిప్ప చక్రపాణికి మేడిపల్లి సత్యం పరామర్శ

**కరీంనగర్ ఫిబ్రవరి 24 (ప్రజామంటలు):** గంగాధర మండలం గర్శకుర్తి గ్రామ మాజీ ఎంపిటిసి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చిప్ప చక్రపాణి ఇటీవల గుండె శస్త్రచికిత్స కొరకు చల్మెడ ఆనందరావు హాస్పిటల్లో జాయిన్ కావడం జరిగింది. ఈ సందర్భంగా చొప్పదండి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మేడిపల్లి సత్యం ఆయనను పరామర్శించారు. వారి వెంట కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ చైర్మన్ పులి ఆంజనేయులు గౌడ్, గంగాధర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పురుమల్ల మనోహర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ములుగురి రాజశేఖర్, యువజన కాంగ్రెస్ నాయకులు నిమ్మ వినోద్ రెడ్డి, ఉన్నారు.



## సింగిల్విండో చైర్మన్, రాజు నరసింగరావుకు సన్మానం

**కొడిమ్యాల ఫిబ్రవరి 24 (ప్రజామంటలు):** నాచుపల్లి గ్రామానికి 50 లక్షల రూపాయలు సీసీ రోడ్స్ మంజూరు చేయించినందుకు కొడిమ్యాల సింగిల్ విండో



చైర్మన్ మేనేని రాజ నర్సింగారావు ఎంపీపీ స్వర్ణలత కు నాచుపల్లి గ్రామ పంచాయతీ సిబ్బంది ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లతా తిరుమలేష్, వార్డ్ సభ్యులు సెక్రటరీ శేఖర్, కారోబార్ చారి, గ్రామ పంచాయతీ సిబ్బంది తెరాస మండల ఉపాధ్యక్షులు రొద్ద శరత్, తెరాస నాయకులు గాజుల నరేష్, చిర్ర దేవిడ్, చిర్ర ప్రసాద్ , రొద్ద పరశురామ్, తదితరులు పాల్గొన్నారు.



కథలాపూర్ మండలం పోతారం లోక రామేశ్వర స్వామి జాతరకు ఎమ్మెల్సీ జీవన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానిస్తూ పుష్పగుచ్చం అందజేసిన పోతారం ఎంపిటిసి పులి శిరీష హరిప్రసాద్, మండల అధ్యక్షుడు కాయితీ నాగరాజు, గ్రామ అధ్యక్షుడు నర్సయ్య, సల్లం జలంధర్ తదితరులు

## క్షేమంగానే ఉన్నామని తెలుపటంతో సంతోషం



**మల్యాల ఫిబ్రవరి 24 (ప్రజా మంటలు):** జగిత్యాల జిల్లా మల్యాల మండలం రాంపూర్ కు చెందిన బద్దం కిషన్ రెడ్డి కూతురు బద్దం నీహారిక రెడ్డి ఉక్రెయిన్లో వైద్యవిద్యను అభ్యసించేందుకు వెళ్లగా ప్రస్తుత పరిస్థితులతో తమ కుతురు ఎలా ఉందో అని కుటుంబ సభ్యుల్లో ఆందోళన నెలకొంది. అయితే ఆమె యోగ క్షేమాలు ఫోన్లో కుటుంబ సభ్యులు తెలుసుకుంటు ఉన్నారు. అయితే తమకు ఎలాంటి భయం లేదని ఇక్కడ 1500 మంది విద్యార్థులున్నామని ఆమె పోన్ ద్వారా తెలిపింది. క్షేమంగానే ఉన్నామని తెలుపటంతో కాస్త సంతోషంగా ఉన్న కుటుంబ సభ్యులు.

## భూదాన్ భూములు పేదలకు పంచాలి
### జడ్పీ సర్వసభ్య సమావేశంలో రసాబాస

**జనగామ ఫిబ్రవరి 24 (ప్రజామంటలు):** జనగామ జడ్పీ సర్వసభ్య సమావేశంలో గురువారం రసాబాస సాగింది. జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం మేకలగట్టు సర్వేనెంబర్ 206 భూదాన్ భూములను పేదలకు పంచాలని పోడియం ముందు బైటాయించి ప్లే కార్డులు పట్టుకుని రఘునాథపల్లి, ఎంపీపీ మేకల వరలక్ష్మి నరేందర్ నిరసన తెలిపారు. రఘునాథపల్లి , లింగాల ఘనపురం జడ్పీటీసీలు బొల్లం మణికంఠ అజయ్, గుడి వంశీధర్ రెడ్డి మద్దతు తెలిపారు.



### ఉద్యోగ నోటిఫికేషన్ విడుదల చేయాలని
# నేడే 'చలో టిఎస్పిఎస్సి ముట్టడి'

**కరీంనగర్ ఫిబ్రవరి 24 (ప్రజామంటలు):** రాష్ట్రంలో ఇప్పటికే గుర్తించిన ఒక లక్ష 91 వెయ్యి ఖాళీ ఉద్యోగాల భర్తీ కై ఈ నెల 25న తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని డివైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి తెలిపారు. స్థానిక జిల్లా కార్యాలయంలో



ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. తిరుపతి హాజరై మాట్లాడుతూ రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ను ఏర్పాటు చేశారు. ఉద్యోగాల కొరకు నలభై ఆరు లక్షల మంది నిరుద్యోగ యువత వారి పేర్లను నమోదు చేశారని ఆయన గుర్తు చేశారు. కానీ నేటి వరకుఉద్యోగాలు భర్తీ చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేస్తూ నిరుద్యోగ హక్కులను కాల రాస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగ నోటిఫికేషన్ వస్తాయని పట్టణాలలో లక్షలాది రూపాయలు ఖర్చు పెట్టి కోచింగ్ తీసుకుని తీరా సమయానికి నోటిఫికేషన్ లేక ఉద్యోగాలు రాక నిరుద్యోగ యువత ఆత్మహత్యలు చేసుకుంటున్నారని తెలిసి కూడా కేసీఆర్ ప్రభుత్వము ఉద్యోగాలు భర్తీ చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని ఆయన విమర్శించారు. వివిధ శాఖలలో ఉద్యోగాలు భర్తీ చేయక పాలన సక్రమంగా లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆయన అన్నారు. నోటిఫికేషన్లు విడుదల చేస్తున్నామని పత్రికలలో ప్రచార ఆర్భాటాలు చేస్తున్నారు కానీ నోటిఫికేషన్ ఎందుకు ఇస్తలేరని ఆయన కేసీఆర్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఉద్యోగాలు భర్తీ చేయడంలో తెలంగాణ ప్రభుత్వం విఫలం దానికి నిరసనగా నేడు జరిగే టిఎస్పిఎస్సి కార్యాలయం ముట్టడికి నిరుద్యోగ యువత అధిక సంఖ్యలో హాజరై మన ఉద్యోగ ఉపాధి సాధనకై జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. గిరిజన సంఘం నగర ప్రధాన కార్యదర్శి జి. రవీందర్ నాయక్ మద్దతు ప్రకటించారు. డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు లక్పతి నాయక్, జిల్లా నాయకులు తేజావత్ రాజు, గోపి సునీల్ అజయ్ శివకుమార్ పాల్గొన్నారు.

# 14 ఏళ్ల నరకయాతనకు లభించిన ఊరట

**జగిత్యాల/పెగడపెల్లి ఫిబ్రవరి 24 (ప్రజామంటలు):** పెగడపెల్లి మండలం రాములపల్లె గ్రామానికి చెందిన కొరకొంట్ల కొమురయ్య 14 సంత్సరాల క్రితం ఆజాద్ విసా పై సౌదీ





అరేబియాకు వెళ్ళాడు. ఎక్కువ డబ్బులు సంపాదించాలని మన వాళ్ళు ఆశతో 'ఆజాద్ విసా' పై రెండు నుండి మూడు లక్షల రూపాయలు ఖర్చు చేసి వెళ్తారు. వాస్తవానికి ఆజాద్ విసా అనేది ఉండదు. మనవాళ్ళే మనకు 'డమ్మీ ఎంప్లాయిమెంట్ వీసా' ను మనకే అంటగట్టి ఎనిమిది నుంచి పదివేల రియాల్లు వసూల్ చేసి సౌదీ అరేబియాకు పంపిస్తారు. తీరా అక్కడకి వెళ్ళాక సౌదీ యజమాని అకామా అంటే 'వర్క్ పర్మిట్' బనాయించి ఎక్కడైనా యజమాని వదిలేస్తాడు. ఇక్కడి నుండే మొదలవుతుంది అసలు కథ. చిన్న చిన్న పని చేసుకుంటూ పొట్ట గడుపుతు అప్పులు తీర్చే సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలనే ఆశతో మనిషిని మనసు మరో వైపు లాక్కెళ్తుంది. మూసాస అంటే కపిల్ పేరు మీద అది ఒక చిన్న చిన్న కాంట్రాక్ట్ కంపెనీ స్టార్ట్ చేస్తారు. అప్పులు చేసి మరీ బిల్డింగుల కాంట్రాక్టు తీసుకుంటారు. ఆజాద్ విసా పై వెళ్లినవారు ఇలాంటి బిల్డింగ్ లో తాపీ మేస్త్రి, కార్పెంటర్, స్టీల్ ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, పేంటర్ లాంటి పని చేస్తూ, పని పూర్తయ్యాక బిల్డింగ్ యజమాని మూసాస పేరు మీద చెక్కులు ఇస్తాడు. యజమాని నీజాయితి పరుడు ఐతే తన కమిషన్ తాను తీసుకోని మిగితా డబ్బులు కూలి పని చేసినవారికి ఇవ్వవలసి ఉంటుంది. యజమాని మోసం చేసి డబ్బులు ఇవ్వకపోతే ఆజాద్ విసా పై వెళ్లిన వారి బ్రతుకులు గల్లంతే. ఇదే మోసం కొమురయ్యకు జరిగింది. కొమురయ్య యజమాని తన డబ్బులు కాజేసి, తన తమ్ముడైన ఒక పోలీసు అధికారిని అడ్డం పెట్టుకొని అక్రమ కేసులు నమోదు చేసి, కొమురయ్య కు రెండు సంవత్సరాలు నరకం చూపించాడు. ఇండియన్ ఎంబసీ అధికారులకు ఏం చెయ్యాలో విషయం అర్థం కాక కొమురయ్యకు ఏం సహాయం చేయలేకపోయారు. తన భాధ ఎవరికి చెప్పుకున్న అర్థం కాదని ఇటీవలి కాలంలో జగిత్యాల జిల్లా వాసి దారుకుట్ల మల్లేశ్ తన రూంలో వుంటు జగిత్యాలకి చెందిన సామాజిక కార్యకర్త డా. షేక్ చాంద్ పాషా న్యాయ సలహాతో విడిపించే ప్రయత్నం చేస్తాడని తెలుపగా, డా. షేక్ చాంద్ పాషా సుధీర్ఘంగా ఎంక్వైరీ చేయించి ఇ మేల్ ద్వారా సమాచారం అందించి, ఈ నెల 15వ తేదీన, మళ్ళీ తేది 21, 22 ఇ మేల్ పంపించి అనంతరం పట్టబద్దుల కొమురయ్య కుటుంబ సభ్యులతో ఎం.ఎల్.సి. టి. జీవన్ రెడ్డి ని డా. షేక్ చాంద్ పాషా కలిసి వారితో తెలంగాణ ఎన్ఆర్ఐ సెల్ పూర్తీ స్థాయిలో విఫలమైందని వారి దృష్టికి తీసుకెళ్లగా వారు హామీ ఇచ్చి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు ఇ మేల్ ద్వారా ప్రభుత్వం పై ఒత్తిడి చేస్తామని హామీ ఇచ్చారు. తేదీ 23 న కొమురయ్య తో సౌదీలోని ఇండియన్ ఎంబసీ అధికారులు ఫోన్ ద్వారా విషయం తెలుసుకొన్నారు.

పూర్తి విచారణ జరిపించి 15 రోజుల్లో ఇండియాకు, ఇంటికి పంపిస్తామని కొమురయ్యకి హామీ ఇవ్వడం వల్ల ఆనందంతో ఎంబసీ ముందు నిలబడి నవ్వుతూ.... ఫోటో పంపించి, వాయిస్ మెసేజ్ పంపించాడు. గత రెండు నెలలుగా చేసిన కృషి ఫలించినందులకు ఇండియన్ ఎంబసీ అధికారులకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు, పాత్రికేయ మిత్రులకు డా. షేక్ చాంద్ పాషా 9949321330 కృతజ్ఞతలు తెలియజేశారు.

## లోక్ అదాలత్లో 1200 పెండింగ్ కేసులు పరిష్కారానికి గుర్తింపు

**కరీంనగర్, ఫిబ్రవరి 24( ప్రజామంటలు):** జాతీయ లోక్ అదాలత్ మార్చి 12న జిల్లా కోర్టు ఆవరణతో పాటు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని అన్ని కోర్టుల్లో నిర్వహించనున్నారు. కరీంనగర్ పట్టణంలోని జిల్లా కోర్టు ఆవరణలోని న్యాన సేవా సదన్లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ




చైర్పర్సన్, జిల్లా జడ్జి ఎంజీ ప్రియదర్శిని విలేకరులతో మాట్లాడుతూ క్రిమినల్ కాంపౌండబుల్ కేసులు, సివిల్ కేసులు, కేసులకు సంబంధించి మొత్తం 1200 పెండింగ్లో ఉన్న కేసులను గుర్తించినట్లు తెలిపారు. బ్యాంకు రుణాలు, ప్రమాద కేసులు మొదలైనవి మరియు లోక్ అదాలత్లో సెటిల్మెంట్ కోసం నోటీసులు పంపారు.మహమ్మారి కోవిడ్ వ్యాప్తి చెందడం వల్ల కోర్టులో కేసులు పెండింగ్లో ఉండవలసి వచ్చిందని పేర్కొంటూ, లోక్ అదాలత్ ద్వారా కేసులను సామరస్యంగా పరిష్కరించుకోవడం వల్ల ఎదుటివారితో మంచి సంబంధాన్ని నిలుపుకోవడంతో పాటు సమయం మరియు డబ్బు ఆదా అవుతుందని ఆమె అన్నారు. లోక్ అదాలత్కు పూర్తి మద్దతు ఇవ్వాలని ఆమె న్యాయవాదులకు సూచించారు. మొదటి అదనపు జిల్లా జడ్జి భవానీ చంద్ర మాట్లాడుతూ న్యాయవాదులు తమ కేసులను లోక్ అదాలత్లో చేర్చేందుకు సంబంధిత న్యాయస్థానాన్ని, న్యాయవాదులు, పోలీసు, జిల్లా న్యాయసేవా అధికారులను సంప్రదించి సామరస్యపూర్వక పరిష్కారం ద్వారా పరిష్కరించుకోవచ్చని తెలిపారు. లోక్ అదాలత్ను విజయవంతం చేసేందుకు న్యాయవాదులు అన్ని విధాలా సహకరిస్తారని కరీంనగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు బి.రఘునందన్రావు హామీ ఇచ్చారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సుజయ్ మాట్లాడుతూ లోక్ అదాలత్లో మరిన్ని కేసుల పరిష్కారానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటు న్నామన్నారు.

# దేవాలయాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి

**- మంత్రి గంగుల కమలాకర్**

**కరీంనగర్, ఫిబ్రవరి 24 (ప్రజామంటలు):** రాష్ట్రంలో ఉన్న అన్ని దేవాలయాల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని బీసీ సంక్షేమ పౌర సరఫరాలు, బీసీ సంక్షేమ



పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ పేర్కొన్నారు. కరీంనగర్ పట్టణంలోని 23వ డివిజన్ సుభాష్ నగర్ లో 25 లక్షల నిధులతో పోచమ్మ ఆలయ కాంపౌండ్ వాల్, మరియు బోరు నిర్మాణం కోసం బిసి సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ భూమి పూజ చేశారు. పోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయ అభివృద్ధి కమిటీ మంత్రి గంగులకు డివిజన్ వాసులు పుష్పగుచ్చం అందించి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడుతూ.... పోచమ్మ తల్లి తెలంగాణ ప్రజల ఇలవేల్పు అని, ప్రజలంతా గ్రామ దేవతగా కొలుచుకుంటారని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం హిందు సాంప్రదాయాలను గౌరవిస్తుందని అన్నారు. ఇప్పటికే నగరంలో ఉన్న ఆలయాల అభివృద్ధికి వాటి మౌలిక వసతులతో పాటు, రోడ్డు మరియు డ్రైనేజి నిర్మాణాలతో పాటు మంచినీటి వసతులు కల్పిస్తున్నామని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో మంత్రి గంగుల కమలాకర్ తో పాటు నగర మేయర్ సునీల్ రావు, డిప్యూటీ మేయర్ చల్లా స్వరూపారాణి- హరిశంకర్, స్థానిక డివిజన్ కార్పొరేటర్ అర్ష కిరణ్మయి మల్లేశం, కార్పొరేటర్లు గుగ్గిళ్ల జయశ్రీ, దిండిగాల మహేష్, బండారి వేణు, కోల మాలతి-సంపత్ రెడ్డి, మెచినేని అశోక్ రావు, కాశెట్టి శ్రీనివాస్, పిట్టల రవీందర్, స్థానిక ప్రజా ప్రతినిధులు, డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

కోరుట్ల మునిసిపాలిటీలో మున్సిపల్ ఇంజనీర్పై మున్సిపల్ కమీషనర్ వేధింపులకు జనగామ మున్సిపాలిటీలో గురువారం నిరసన. పాల్గొన్న ఎఇ, డిప్యూటీ ఇఇ ఇంజనీరింగ్ సిబ్బంది.





# సీఎం సహాయనిధి చెక్కు అందజేత

**కథలాపూర్ ఫిబ్రవరి 25 (ప్రజామంటలు):** అనారోగ్యం బారిన పడి మెరుగైన వైద్య సేవలను అందిపుచ్చుకున్న బాధితులకు, పేదలకు సీఎం సహాయనిధి ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పెగ్గెర్ల గ్రామ సర్పంచ్ జావిడి ప్రతాప్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అంజయ్యలు అన్నారు. గురువారం గ్రామంలోని బైండ్ల రమేష్, బైండ్ల గంగాధర్, చిర్రం నడిపి సాయన్నలకు సీఎం సహాయనిధి కింద మంజూరు అయిన మొత్తం 1.26 వేల రూ. విలువగల చెక్కులను గ్రామ టీఆరెఎస్ నాయకులు కలిసి బాధిత కుటుంబాలకు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జావిడి ప్రతాప్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చెల్లపెల్లి అంజయ్య, గ్రామ అధ్యక్షులు కుంట నరేష్, జావిడి జలపతి రెడ్డి, బోజగిరి సురేష్, చేదెలు మహేష్, మ్యాకల ప్రవీణ్ పలువురు నాయకులు పాల్గొన్నారు.

## ఆలయమును సందర్శించిన
## బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్

**కొడిమ్యాల ఫిబ్రవరి 24 (ప్రజామంటలు):** కొడిమ్యాల మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయమునకు వెళ్లే ఘాట్ రోడ్డులో ఇటీవల వేసిన సిసి రోడ్డును ప్రారంభించడానికి గురువారం కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు అయిన బండి సంజయ్ కుమార్ ఆలయమునకు విచ్చేసినారు. ఎంపీ ని





ఆలయ అర్చకులు నాగరాజు రమేష్, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, ప్రజల సమక్షంలో పూర్ణకుంభంతో స్వాగతం పలికి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందించి శాలువాతో సత్కరించి మంగళాశాసనములు అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో చొప్పదండి మాజీ శాసన సభ్యురాలు బొడిగె శోభ, సర్పంచ్ ఏలేటి మమత నరసింహారెడ్డి, బీజేపీ మహిళా అధ్యక్షురాలు, బిజెపి మండల అధ్యక్షులు రేకులపల్లి రవీందర్ రెడ్డి, స్థానిక వార్డు సభ్యులు దీకొండ చంద్రశేఖర్, ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు, భక్తులు, ప్రజలు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### ప్రింటింగ్ యంత్రం రూపకర్త
## జాన్ గుటెన్ బర్గ్గారి జయంతి

**జగిత్యాల ఫిబ్రవరి 24 (ప్రజామంటలు):** ప్రింటర్స్ డే సందర్భంగా కేక్ కటింగ్ ప్రింటింగ్ యంత్రం రూపకర్త శ్రీ జాన్ గుటెన్ బర్గ్ గారి జయంతి సందర్భముగా జగిత్యాల ప్రింటింగ్ ప్రెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ ప్రింటర్స్ దే వేడుకలు స్థానిక వర్తక సంఘ భవనములో నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా



నూతనంగా ఎన్నికైన చాంబర్ ఆఫ్ కామర్స్( వర్తక సంఘం) అధ్యక్షులు కమటం శ్రీనివాస్ ను ఆహ్వానించగా ప్రింటింగ్ ప్రెస్ జిల్లా మరియు పట్టణ అధ్యక్షులు కలసి కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లో జిల్లా అధ్యక్షులు ముసిపట్ల లక్ష్మీనారాయణ, పట్టణ అధ్యక్షులు ఎలిగేటి కిరణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి బొలుసాని మల్లికార్జున్, ఉపాధ్యక్షులు అనుమల శ్రీనివాస్, కోశాధికారి బానుక మహేష్, గౌరవ సభ్యులు పాత వేణు, ఎర్ర మహేష్ ఎర్ర రత్నాకర్ , పెండం జలపతి, పెండం గంగధర్, బండారి సంతోష్ , పోలరాజ్ కుమార్, మస్తాన్, సుధాకర్ ,బాలె అరుణ్, చిలుక సత్యం, కొప్పు శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు గుంతల వల్ల ప్రమాదాలు
### పట్టించుకోని పాలకులు
### బంగారు తెలంగాణాలో బతుకులింతేనా?

**భీమదేవరపల్లి ఫిబ్రవరి 24 (ప్రజామంటలు):** సిద్దిపేట మరియు హనుమకొండ రహదారిలో గట్లనర్సింగాపూర్ స్టేజి దగ్గర గత 3 రోజుల క్రితం గంతల కారణంగా రోడ్డు ప్రమాదం జరిగి ఒక మహిళ మరణించింది. రోడ్డు గుంతల కారణంగా గతంలో పలు ప్రమాదాలు జరిగాయి. చాలా మరణాలు సంభవించాయి. ఈ విషయాన్ని గుర్తించిన కాంగ్రెస్ మండల అధ్యక్షులు ఊసకోయిల ప్రకాష్ ఇతర మండల నాయకులతో కలిసి స్వచ్ఛందంగా మరమ్మతులు చేశారు. ఈ సందర్భంగా ప్రకాష్ మాట్లాడుతూ రోడ్డు గుంతల కారణంగా అనేక ప్రమాదాలు జరుగుతున్న రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అన్నారు. బంగారు తెలంగాణ అంటే ఇదేనా అంటూ ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో వెంకటరెడ్డి, గనబోయిన కొమురయ్య, పొన్నాల మురళి, ఓల్లాల రమేష్, బొల్లంపల్లి రాజయ్య, గట్టు ప్రభాకర్, తాళ్ళపల్లి సదానందం, ఒద్దుల సంపత్, గుండెల్లి ధర్మేందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, గజ్జల సంజీవ్, సయ్యద్ వాలి, రాంచంద్రం, సదానందం, గొల్లపల్లి రవీందర్, రామారపు రవీందర్, జనగాం బిక్షపతి, చిలుక ప్రమోద్, శంకర్, బుచ్చయ్య, ఎల్లయ్య, భాస్కర్, రవితేజ, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.





# బదిలీ ఉపాధ్యాయులకు వీడ్కోలు నూతన ఉపాధ్యాయులకు స్వాగతం

**వేలేరు ఫిబ్రవరి 24 (ప్రజామంటలు):** మండలములోని ఎంపిపిఎస్ ఎర్రబెల్లిలో ఉపాధ్యాయులు పిట్టల వేంకటేశ్వర్ల అధ్వర్యంలో బదిలీపై వెళ్లిన బొక్క కిషన్ కుమార్, రామగిరి సంపత్, నాంపల్లి రాజులకి వీడ్కోలు పలికారు. నూతన ఉపాధ్యాయులు ఆనందం, గణపతి నాయక్, కిషోర్, రవిరాజ్, మధురవాణిలకు స్వాగత సమావేశం



గురువారం ఘనంగా నిర్వహించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసి చైర్మన్ స్వాతి, సిఆర్పి మొగిలిచెర్ల శ్రీనివాస్, అంగన్వాడి టీచర్ కరుణ, సిబ్బంది, గ్రామ ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పాఠశాల అభివృద్ధికి రూ.3 లక్షల నిధుల కేటాయింపు : ఎంపిపి సమ్మిరెడ్డి

**వేలేర్ ఫిబ్రవరి 24 (ప్రజామంటలు):** మండలంలోని చింతలతండా గ్రామ పంచాయతీలో గురువారం ప్రభుత్వ పాఠశాలను ఎంపీపీ కేశిరెడ్డి సమ్మిరెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన ఊరు - మన బడి కార్యక్రమంలో



భాగంగా, పాఠశాలల అభివృద్ధి పనులు పూర్తి స్థాయిలో చేస్తామన్నారు. పాఠశాల కాంపౌండ్ వాల్ నిర్మాణం కోసం ఎమ్మెల్యే డా. రాజయ్య ఆదేశానుసారం మండల ప్రజా పరిషత్ నిధుల నుంచి 3 లక్షల రూపాయలు కేటాయిస్తున్నామని తెలిపారు. వైస్ ఎంపీపీ సంపత్ మాట్లాడుతూ త్వరగా పనులు పూర్తి చేయాలని, అంగన్వాడి సెంటర్ చాలా బాగుందని అన్నారు. పాఠశాలకు మరమ్మతులకు నిధులు కావాలంటే పూర్తి సహకారం అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎర్రబెల్లి సర్పంచ్ కవిత రాజ్ కుమార్, విశ్వనాధ కాలనీ సర్పంచ్, మాజీ ఎంపిటిసి సాంబరాజు, పాఠశాల ఉపాధ్యాయులు బత్తుల నిరంజన్ పాల్గొన్నారు.

# పెళ్లి కావడం లేదని మనస్తాపానికి గురై మహిళ ఆత్మహత్య



**చిగురుమామిడి ఫిబ్రవరి 24 (ప్రజామంటలు):** గురువారం ఉదయం బొమ్మనపల్లి గ్రామానికి చెందిన గుంటి సోనీ (20) అనే మహిళకు గతంలో వివాహం కాగా ఒక సంవత్సరం క్రితం విడాకులు అయినాయి. అప్పటి నుండి మళ్ళీ రెండవ వివాహం జరగకపోవడంతో ఇక వివాహం జరగదని మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో తెల్లవారు జామున ఇంటిలోని దూలానికి త్రాడుతో ఉరివేసుకొని మృతి చెందినది. మృతురాలి తండ్రి అంకుష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్.ఐ. దాస సుధాకర్ తెలిపారు.



శ్రీ దుబ్బరాజేశ్వర స్వామి దేవస్థానం జాతర బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆర్.డి.ఓ. ను ఆహ్వానించి, వారి వెంట వెళ్లి కలెక్టర్, అడిషనల్ కలెక్టర్, ఎస్పి లను ఆహ్వానించిన ఆలయ కార్యనిర్వహణాధికారి, ఆలయ చైర్మన్, రెనవేశన్ కమిటి సభ్యులు




# తాళం వేసిన పలు ఇళ్లలో దొంగతనం

**కోరుట్ల టౌన్ ఫిబ్రవరి 24 (ప్రజామంటలు):** పట్టణంలోని రామ్ నగర్ ఏరియాలో దొంగలు హల్ చల్ చేశారు. బుధవారం ఒక్క రోజే రాత్రి రామ్ నగర్లోని తాళం వేసిన పలు ఇళ్లలో గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనాలకు పాల్పడ్డారు. బాధితులు, ఎస్.ఐ వివరాల ప్రకారం.... రామ్ నగర్ బాలాజీ రోడ్ కు చెందిన ఇల్లుటపు నర్సయ్య, మచ్చ రమేష్, రామ్ నగర్లో సుతారి రాజమ్మ ఇంట్లో దొంగతనం జరిగినట్లు 4 తులాల బంగారం, 50 వేల వరకు నగదు అపహరణకు గురైనట్లు తెలిపారు. మరో ఇంట్లో



కూడా దొంగతనానికి యత్నించినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. తాళం వేసి ఉన్న ఇళ్లలో అర్ధరాత్రి దొగతనం జరిగినట్లు 4 తులాల బంగారం, 50 వేల వరకు నగదు అపహరణకు గురైనట్లు గుర్తించారు. చోరీలకు పాల్పడ్డ ఇళ్లను పోలీసులు, క్లూస్‌టీం, ఫింగర్‌ప్రింట్స్ అధికారులు సందర్శించి వివరాలు సేకరించారు. ఎస్.ఐ. సతీష్ మాట్లాడుతూ.... గ్రామాలకు వెళ్లిన, ఊర్లకు వెళ్లిన ప్రజలు సమాచారాన్ని స్థానిక పోలీసులకు తెలియజేయాలని కోరారు. ఈ సంఘటనలకు సంబంధించి బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేసి దొంగల ముఠా కోసం ప్రతేక బృందంతో దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ ఎస్.ఐ. సతీష్ కుమార్ తెలి పారు.

# గ్రామాలు గంజాయి రహిత ప్రాంతాలుగా మారాలి : ఏసీపీ ఎడ్ల మహేష్

**బెల్లంపల్లి ఫిబ్రవరి 24 (ప్రజామంటలు):** గంజాయి సాగు పూర్తి స్థాయి నివారణ కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని బెల్లంపల్లి ఏసీపీ ఎడ్ల మహేష్ అన్నారు. తాండూర్ సర్కిల్ ఆఫీస్ (మాదారం పోలీస్ స్టేషన్) గ్రౌండ్‌లో తాండూర్ సర్కిల్ పోలీసుల ఆధ్వర్యంలో గంజాయి సాగు, మాదక ద్రవ్యాల నిర్మూలనపై తాండూర్, మాదారం, భీమిని, కన్నెపల్లి మండలం లోని



3000 మంది రైతులందరికీ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బెల్లంపల్లి ఏమ్మెల్యే దుర్గం చిన్నయ్య, ఏసీపీ ఏడ్ల మహేష్ హాజరు అయ్యారు. ఈ సందర్భంగా ఏసీపీ మహేష్ మాట్లాడుతూ.... ప్రస్తుత కాలంలో మాధక ద్రవ్యాలకు అలవాటు పడి యువత తమ బంగారు భవిశ్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని, గంజాయిని అక్రమంగా రవాణా చేస్తూ పట్టుబడినవారు ఎంతటి వారైనా ఉపేక్షించబోమని, వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాలలో, పట్టణాలలో ఇండ్ల దగ్గరగాని, బయట పొలాలలో, ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన అసైన్డ్ భూములలో గంజాయి మొక్కలు దొరికితే ఆ భూములను తిరిగి ప్రభుత్వం స్వాధీనం చేసుకునేందుకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేసేందుకు అవకాశం ఉంటుందని, అలాగే పట్టా భూములలో గంజాయి దొరికితే ఆ భూమి యజమానికి రైతు బంధు రాకుండా కలెక్టర్ ద్వారా రద్ద చేయడం జరుగుతుందని, బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి పిడి యాక్ట్ నమోదు చేస్తామని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే చిన్నయ్య మాట్లాడుతూ ప్రతి ఒక్క సర్పంచ్ గంజాయి నివారణకు సహకారం అందించాలని తెలిపారు. గంజాయి సాగు చేసిన వారిపై పిడి యాక్ట్ కేసులు, పది సంవత్సరాలు జైలు శిక్ష విదిస్తామన్నారు. అలాగే వారికి ప్రభుత్వ పథకాలు రాకుండా తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు. ముఖ్యమంత్రి గంజాయి సాగు నివారణపై ప్రత్యేక చట్టాన్ని రూపొందిస్తున్నారని బంగారు తెలంగాణలో గంజాయి పూర్తిగా నిర్మూలిస్తామన్నారు. ఒకవేళ ఎవరైనా గంజాయి సాగు చేస్తే వారి గ్రామం మొత్తం రైతుబంధు కట్ చేస్తాం అని తెలిపారు. ప్రతి ఒక్క సర్పంచ్ రైతులతో కలిసి అవగాహన సదస్సులు నిర్వహించి గంజాయి నివారణకు భాగస్వాములు అవ్వాలన్నారు.

# సిసిఆర్ ఆధ్వర్యంలో జిపిల రికార్డుల తనిఖీ

**25న స్తంభంపల్లి, 26న జగదేవ్ పేట గ్రామ పంచాయితీలలో రికార్డుల తనిఖీకి అధికారుల అనుమతి**

**జగిత్యాల ఫిబ్రవరి 24 (ప్రజామంటలు):** సమాచార హక్కు చట్టం 2005 సెక్షన్ 2 (జె) 1, 2 (జె) 4, కేంద్ర సమాచార కమీషన్ ఉత్తర్వుల ప్రకారం జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం స్తంభంపల్లి, జగదేవ్ పేట గ్రామపంచాయితీలలో రికార్డుల తనిఖీ చేపట్టనున్నట్లు కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ సంస్థ జిల్లా, రాష్ట్ర నాయకులు తెలిపారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు మంచికట్ల అనిల్ కుమార్ సూచన మేరకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీల ప్రతినిధులు, జగిత్యాల, మంచిర్యాల జిల్లా కమిటీల ప్రతినిధులు ఈ రికార్డుల తనిఖీలలో పాల్గొనన్నారు. ఫిబ్రవరి 25 శుక్రవారం స్తంభంపల్లి లో, ఫిబ్రవరి 26 శనివారం జగదేవ్ పేట గ్రామ పంచాయితీలలో రికార్డుల తనిఖీ జరుగుతుందని వారు పేర్కొన్నారు. ఆయా గ్రామ పంచాయతీల కార్యదర్శులు, వెల్గటూర్ మండల పంచాయతీ అధికారి అందజేసిన అనుమతి ఉత్తర్వులు, సమ్మతి ప్రకారమే ఈ తనిఖీలు నిర్వహిస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు సూచించారు.


మండల ప్రజా పరిషత్ కార్యాలయం - వెల్గటూర్

ఇందుకు గాను ముందస్తు ప్రణాళిక కొరకు జగిత్యాలలో ఉభయ రాష్ట్రాల, ఉత్తర తెలంగాణ జిల్లాల ప్రతినిధులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సంస్థ నూతన సభ్యులకు గుర్తింపు కార్డులు కూడా అందజేశారు. ఇందుకుగాను ఉభయ గ్రామాల్లో తగిన బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులను సిసిఆర్ సంస్థ ప్రతినిధులు కోరారు.

## సాక్షాత్తు సీఎం ఇచ్చిన హామీలకు ఐదేండ్లు...

# అయినా నెరవేరని హామీలు

**కరీంనగర్, ఫిబ్రవరి 24( ప్రజామంటలు):** ముఖ్యమంత్రి కేసీఆర్ 2017 వ సంవత్సరం ఫిబ్రవరి 24 వ తేదీ రోజున ప్రగతిభవన్ లో పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా




నియమకమైన విఆర్ఏలను రెగ్యులరైజేషన్ చేస్తామని, వయసుపైబడిన విఆర్ఏల వారసులకు ఉద్యోగాలు కల్పిస్తామని ముఖ్యమంత్రి విఆర్ఏలకు ఇచ్చిన హామీలకు నేటితో ఐదేండ్లు పూర్తయినప్పటికీ కూడా అట్టి హామీలను అమలుచేయకపోవడంతో కొత్తపల్లి మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట విఆర్ఏ లు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం చేపట్టినారు. ఈ సందర్భంగా విఆర్ఏల సంఘం జిల్లా అధ్యక్షుడు చెట్టి రవి మాట్లా డుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించిన విధంగా విఆర్ఏ లకు పేస్కేల్ అమలుచేసి, 55 సం.లు పై బడిన విఆర్ఏల వారసులకు ఉద్యోగాలు కల్పించాలని వారు ప్రభుత్వాన్ని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ప్రగతిభవన్ సాక్షిగా సాక్షాత్తు ముఖ్యమంత్రి ప్రకటించిన హామీలు అమలుకాకపోవడంపైన విఆర్ఏ లు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు చెట్టి రవి, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ నలువాల సాయికిషోర్, జిల్లా నాయకులు నలువాల మల్లేశం, గాండ్ల నవీన్, అవినాష్, మధు, రమేష్, చందన, స్వరూప, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ఎస్పీ సారు, మాకు న్యాయం చేయండి

**జగిత్యాల ఫిబ్రవరి 24 (ప్రజామంటలు):** కష్ట పడ్డ సొమ్ముతో ముగ్గురం స్నేహితులము కలిసి కొన్న భూమిపైకి దౌర్జన్యకారులు వచ్చి బెదిరింపులకు పాల్పడుతున్నారని రక్షించాల్సిన రూరల్ సి.ఐ. చొరబాటుదారులకు వంత పాడుతున్నాడని రక్షణ కల్పించి న్యాయం చేయాలని గొల్లపల్లి నివాసి తడగొండ విజయ్ గురువారం జగిత్యాల ఎస్పీ సింధు శర్మకు ఇచ్చిన విజ్ఞప్తి పత్రంలో కోరారు. రాయికల్ మండల కేంద్రంలో నా మిత్రులు రామారావు, వెంకటేష్ తోపాటు నేను కలిసి పట్టణంలోని సర్వే నెం. 52 (ఆ) లో పదిన్నర గుంటల భూమిని కొనుగోలు చేసి ఫెన్సింగ్ పెట్టి కాపలా మనుషులను పెట్టమన్నారు. కానీ కొన్ని రోజుల నుంచి బెజ్జరపు లింబాద్రి అతని కుమారులు ప్రసాద్, నరేందర్ లు ఫేక్ డాక్యుమెంట్లు తెచ్చి ఈభూమి మాది అని బెదిరింపులకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. ఇదే అంశంలో కోర్టు ద్వారా ఇంజక్షన్ ఆర్డరును పొంది వున్నా వారి దౌర్జన్యం ఆగడం లేదన్నారు. మా స్థలానికి కరెంటును ఇస్తున్న వారిని కూడా బెదిరించి విద్యుత్ సరఫరా నిలిపివేశారని ఇదే విషయంపై డయల్ హండ్రెడ్ కు ఫిర్యాదు చేశామని చెప్పారు. సంఘటన స్థలానికి మా మిత్రులైన బలుసు రంజిత్, తేజానాయక్ లను పంపిస్తే వీరు వుండగానే రాత్రి ఒంటి గంట సమయంలో లింబాద్రి, అతని కుమారులు మరో పదిమంది రాడ్లు, కత్తులు, బీర్ సీసాలు, సుత్తెలతో దాడి చేసి ఫెన్సింగ్ రాళ్లను దంస్వం చేశారన్నారు. పోలీసులకు ఫోన్ చేయగానే వచ్చిన పోలీసులను చూసి పారిపోయారన్నారు. ఇదే విషయంలో రాయికల్ పోలీసులకు ఫిర్యాదు చేస్తే ఫిర్యాదు తీసుకోలేదని మరుసటి రిజు రమ్మని చెప్పారన్నారు తీరా ముందురోజే రూరల్ సిఐ కృష్ణ కుమార్ మా స్థలంలో కాపలా ఉంటున్న తేజానాయక్ ను కొట్టాడని పేర్కొన్నారు. వాస్తవానికి మాకు రక్షణ కల్పించాల్సిన సి.ఐ. కృష్ణ కుమార్ ఇంజక్షన్ ఆర్డర్ ను ఖాతరు చేయకుండా కబ్జా కోరులకు వంతపాడుతున్నారని సత్వరమే సి.ఐ పై చర్యలు తీసుకొని మాభూమిలో మాకు రక్షణ కల్పించాలని తడగొండ విజయ్ కుమార్ ఎస్పీకి ఇచ్చిన దరకాస్తులో కోరారు.



# ఒగ్గు కళాకారుల బృందం సంఘ భవనం ప్రారంభించిన ఎమ్మెల్యే, చైర్ పర్సన్

**జగిత్యాల ఫిబ్రవరి 24 (ప్రజామంటలు):** జగిత్యాల పట్టణ 1వ వార్డులో డిఎంఎఫ్.టీ నిధులు రూ. 9.20 లక్షలతో నిర్మించిన శ్రీ మల్లికార్జున ఒగ్గు కళాబృందం సంఘ భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే డా. డా.సంజయ్ కుమార్, మున్సిపల్ చైర్పర్సన్ డా. బోగ శ్రావణి. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ ఛైర్మన్ హరిచరణ్ రావ్, స్థానిక కౌన్సిలర్ కుసరి అనిల్, వైస్ ఛైర్మన్ గోలి శ్రీనివాస్, తెరాస పట్టణ అధ్యక్షుడు గట్టు సతీష్, కౌన్సిలర్లు కోరె గంగమల్లు, పంబాల రాము, ఒగ్గు సంఘం జిల్లా అధ్యక్షుడు చెట్టె కొమురయ్య, పట్టణ అధ్యక్షుడు వోళ్లెం మల్లయ్య, ప్రధాన కార్యదర్శి ఆనంద్ రావు, ఉపాధ్యక్షుడు వొల్లెం మల్లేశం, గంగ మల్లయ్య, సంఘం కార్యవర్గ సభ్యులు, కురుమ సంఘం సభ్యులు, తెరాస నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# హైకోర్టు స్టాండింగ్ కమిటీ మెంబరుగా జగిత్యాల వాసి, అన్నంపల్లి గంగాధర్

**జగిత్యాల ఫిబ్రవరి 23 (ప్రజామంటలు):** రాష్ట్రపతి ఆదేశాల మేరకు తెలంగాణ హైకోర్టులో స్టాండింగ్ కమిటీ సభ్యుడిగా జగిత్యాలకు చెందిన అన్నంపల్లి గంగాధర్‌ను బుధవారం నియమితులయ్యారు. జగిత్యాల పట్టణంలోని పోస్ట్ ఆఫీసు పక్కనే వుండే గంగాధర్ హైకోర్టులో న్యాయవాధిగా పని చేస్తున్నారు. జాయింట్ సెక్రటరీ, లీగల్ అడ్వైజర్ ఆర్.కే. శ్రీవాస్తవ జారీ చేసిన నియామక ఉత్తర్వులలో గంగాధర్ నియామకంతోపాటు మూడేండ్లపాటు పదవిలో కొనసాగుతారు. కేంద్ర ప్రభుత్వ న్యాయపరమైన అంశాలపై హైకోర్టులో సెంట్రల్ అడ్మినిస్టేట్ ట్రిబ్యూనల్ లో తమ విధులను గంగాధర్ నిర్వహించేలా జాయింట్ సెక్రటరీ, లీగల్ అడ్వైజర్ ఆర్.కే. శ్రీవాస్తవ ఉత్తర్వులు జారీ చేశారు.



# బాల కవయిత్రుల సునితాల సరళ శతకం

**చెన్నూరు బాల కవితా హారం ఆవిష్కరణ**

**జనగామ ఫిబ్రవరి 24 (ప్రజామంటలు):** జనగామ జిల్లాలోని పాలకుర్తి మండలం చెన్నూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం బాల కవయిత్రిలు రచించిన సున్నితాల సరళ శతకం చెన్నూరు బాల కవితా హారం ఆవిష్కరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు పోతుగంటి నరసయ్య అధ్యక్షతన జరిగిన ఆవిష్కరణలో ఉపాధ్యాయిని శ్రీమతి పోతుల ఉమాదేవి సంపాదకత్వంలో తపస్వి మనోహరం పత్రిక భాగస్వామ్య సౌజన్యంతో ఆ పాఠశాలలోని ఎలిగేటి నక్షత్ర, దేవళ్ళ వెంకట హాసిని, తీగల శ్రావ్య, బైకాని వెన్నెల, పన్నీరు భవ్యశ్రీ, కారు పోతుల అక్షయ అనే బాల కవయిత్రిలు చెన్నూరు బాల కవితా హారంలో సున్నితాల సరళ శతకం రాశారు. కరోనా లాక్ డౌన్ సమయంలో ఉమాదేవి సూచనలతో రాసిన సున్నితాల సరళ శతకాన్ని జనగామ జిల్లా విద్యాశాఖ అధికారి కె. రాము చేతుల మీదుగా ఆవిష్క రించారు. ఈ పుస్తకాన్ని కూటికంటి సోమయ్య సమీక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పార్వతీ రాజేశ్వరరావు సామాజిక సేవకులు గంట రవీందర్, ఎంపీటీసీ కళింగరావు, ఎస్.ఎం. సి చైర్మన్ అబ్బాస్, పాఠశాల ఉపాధ్యాయ బృందం రమేష్, సుమలత, పద్మజ, గోపాల్, శ్యాంసుందర్, రవికుమార్, శ్రీనివాస్ గుప్తా, రమేష్, పద్మ, లావణ్య, కవిత, స్వర్ణలత, శోభ, శ్రీనివాస్, కవిత, మౌనిక పాల్గొన్నారు.




# వికలాంగుల హక్కుల జాతీయ వేదిక

**- జిల్లా అధ్యక్షులుగా శ్రీనివాస్**

**జగిత్యాల ఫిబ్రవరి 24 (ప్రజామంటలు):** వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జగిత్యాల జిల్లా అధ్యక్షులుగా లంక దాసరి శ్రీనివాస్, జగిత్యాల నియోజకవర్గ అధ్యక్షులుగా అస్గర్ ఖాన్ లను నియమిస్తూ ఆ సంఘం జాతీయ అధ్యక్షులు మున్నా, రాష్ట్ర అధ్యక్షులు మల్లికార్జున్, వర్కింగ్ ప్రెసిడెంట్ నర్సింగరావులు గురువారం నియామక పత్రాలను అందజేశారు. స్థానిక ప్రెస్ క్లబ్ వేదికగా నిర్వహించిన కార్యక్రమంలో ఇరువురు నూతన అధ్యక్షులను శాలువాతో సత్కరించి నియామక పత్రాలను అందించారు. అనంతరం లంకదాసరి శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలోని వికలాంగుల




హక్కులు, సంక్షేమ సాధన కోసం కృషిచేస్తామని అన్నారు. తమ నియామకానికి సహకరించిన కేంద్ర, రాష్ట్ర కమిటీలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వికలాంగుల హక్కుల జాతీయ వేదిక అధ్యక్షులు మున్నా మాట్లాడుతూ మార్చి 28 న వికలాంగుల సమస్యలపై తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. వికలాంగులకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని కేంద్ర ప్రభుత్వ వికలాంగ పింఛన్ 3 వందల నుంచి 3 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. వికలాంగుల చలో ఢిల్లీ కార్యక్రమానికి జిల్లాలోని వికలాంగులు భారీగా తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ లోసాని నర్సింగరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు పట్నం శ్రీనివాస్ లు ఉన్నారు.

# చరిత్రలో శాశ్వతంగా సిద్ద లింగప్ప సేవలు

**సికింద్రాబాద్ ఫిబ్రవరి 24 (ప్రజామంటలు):** దివంగత సిద్ద లింగప్ప ( 84 ) నాటక , సాహితి, సామాజిక రంగాల్లో చేసిన సేవలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచి పోతాయని పలువురు వక్తలు పేర్కొన్నారు. గురువారం ప్రముఖ నాటక రంగ కళాకారుడు, సాహితి వేత్త సిద్ద లింగప్ప సంతాప సభ సిటీలోని హైదర్ బస్తీ లోని బాయ్స్ హోమ్ లో నిర్వహించారు. ఈసందర్బంగా పలువురు వక్తలు మాట్లాడుతూ బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన సిద్ద లింగప్ప యక్షగానం, పౌరణిక నాటక రంగంలో రాణిస్తునే మరోవైపు వివిద అంశాలపై 30 పుస్తకాలను రాసి మంచి సాహితి వేత్తగా పేరుతెచ్చుకున్నారని అన్నారు. అలాగే పేద వారికి నీడ కోసం కనీస ఇంటి స్థలాలు ఇవ్వాలని, పేద రైతులకు వ్యవసాయానికి భూమిని ఇవ్వాలని ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చి ఎందరికో సాయం చేశారని వారు గుర్తు చేశారు. సిద్ద లింగప్ప లాంటి నిజాయితీ, సేవ గుణం కలిగిన వారు ఈ కాలంలో చాలా అరుదని అన్నారు. ఈసందర్బంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. నేటి కాలం యువకులు సిద్ద లింగప్పను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. ఆయన ఆత్మ శాంతి కోసం రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు. కార్యక్రమంలో ఆశ్రయ సంస్థ ప్రతినిధి నవీన్ రాజ్, అమన్ వేదిక ప్రతినిధి ఎల్లయ్య, పీ.హెచ్.సీ. సంతోష్, చైల్డ్ లైన్ సంస్థకు చెందిన పద్మ, ఆశ్రిత సంస్థ టీమ్ మెంబర్స్, తదితరులు పాల్గొన్నారు.



# దళిత బంధు పథకంతో ఆర్థికంగా ఎదగాలి

## యూనిట్ల ఎంపికలో పూర్తి స్వేచ్ఛ లబ్ధిదారునిదే : జిల్లా కలెక్టర్ జి.రవి

**మెటపల్లి ఫిబ్రవరి 24 (ప్రజామంటలు):** దళిత బంధు యూనిట్లతో ఆర్థికంగా పురోగతి చెందాలని జిల్లా కలెక్టర్ జి.రవి పేర్కొన్నారు. కొరుట్ల నియోజకవర్గం పరిధిలో దళిత బంధు పతకం లో భాగంగా ఎంపిక చేసిన 100 మంది లబ్ధిదారులకు వారి కుటుంబ సభ్యులతో వి.ఆర్.ఎం. ఫంక్షన్ హాల్లో దళిత బంధు యూనిట్ల ఎంపిక పై గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ తో కలిసి జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సమావేశాల్లో కలెక్టర్ మాట్లాడుతూ.... దళితులు ఉన్న స్థితి నుండి ఉన్నత స్థితికి ఆర్థికంగా ఎదగాలని సీఎం కేసీఆర్ దళిత బంధు పథకం రుపోందించారని తెలిపారు. మొదటి సంవత్సరం ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో పైలెట్ ప్రాజెక్టు కింద 100 మంది లబ్ధిదారులను ఎంపిక చేయడం జరిగిందని పేర్కొన్నారు.లబ్ధిదారులు ధ్రువీకరణ సమయంలో వారికి ఆసక్తి ఉన్న యూనిట్ల వివరాలను సేకరించామని కలెక్టర్ తెలిపారు. వ్యవసాయ ఆధారిత, రవాణా సంబంధిత, ఉత్పత్తి, రిటైల్ వ్యాపారం, హోల్ సేల్ దుకాణాలు, సర్వీసుల వంటి మొదలగు యూనిట్ల ఎంపిక పై లబ్ధిదారులకు అందులోని విజయాలు అపజయాలు తెలుపుతూ వేరువేరుగా లాభసాటి అంశాలపై అవగాహన కల్పించారు. యూనిట్ల ఏర్పాటు నుంచి ఉత్పత్తి రవాణా మార్కెటింగ్ తదితర అంశాలపై లబ్ధిదారులకు అధికారులు పూర్తి అవగాహన కల్పించారు. జిల్లాలో రవాణా యూనిట్ల పై వివిధ పథకాల ద్వారా గతంలో ఎక్కువ మందికి యూనిట్లు మంజూరు చేయడం జరిగిందని ప్రస్తుతం ఈ యూనిట్లు ఎక్కువ లాభదాయకంగా లేనందున ఇతర డిమాండ్ ఉన్న లాభసాటి యూనిట్లను ఎంపిక చేసుకోవాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రతి లబ్ధిదారుల పేరు మీద నూతన బ్యాంకు ఖాతా ప్రారంభించిందని, ప్రతీ ఖాతాలో రూ.10 లక్షలను ప్రభుత్వం జమ చేస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. లబ్ధిదారుడు తన ఆసక్తి మేరకు యూనిట్లను ఏర్పాటు చేసుకోవచ్చని, ఒక లబ్ధిదారుడు 2 లేదా 3 యూనిట్లను సైతం ఏర్పాటు చేసుకునే అవకాశం ఉందని కలెక్టర్ స్పష్టం చేశారు.2 లేదా 3 లబ్ధిదారులు కలిసి పెద్ద యూనిట్ సైతం ఏర్పాటు చేసుకోవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు.

ప్రభుత్వం అందించే అవకాశాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని, మార్కెట్ స్థితిగతులను, మనకు అందుబాటులో ఉన్న నైపుణ్యాన్ని అనుభవాన్ని పురస్కరించుకుని యూనిట్ ఎంపిక చేసుకోవాలని సూచించారు. దళిత బంధు కింద వివిధ రంగాలలో



ఏర్పాటు చేసుకునే అవకాశం ఉన్న యూనిట్ల వివరాలు అధికారులు వివరిస్తారని, వాటిని పరిశీలించి మీకు ఆసక్తి, పూర్వ అనుభవం, నైపుణ్యం ఉన్న యూనిట్లను ఎంపిక చేసుకోవాలని, మీ అభివృద్ధి ఇతరులకు మార్గ దర్శకంగా ఉండాలని కలెక్టర్ కోరారు.

దళిత బంధు యూనిట్ ఎంపిక పూర్తిస్థాయి స్వేచ్ఛ లబ్ధిదారునికి ఉందని, అధికారులు కేవలం అవగాహన కల్పిస్తారని, చివరి నిర్ణయం లబ్ధిదారుడి దేనని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రభుత్వం అందించిన రూ.10 లక్షల నగదు లో రూ.9.9 లక్షల నిధులను యూనిట్ ఏర్పాటు సమయంలో విడుదల చేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. లబ్దిదారుని రూ.10 వేల కు ప్రభుత్వ మరో 10 వేలు కలిపి దళిత రక్షణ నిధిని ఏర్పాటు చేస్తుందని, భవిష్యత్తులో ఈ కుటుంబాలకు ప్రమాదవశాత్తు ఆపద వస్తే ఈ నిధుల నుండి సహాయం అందిస్తామని కలెక్టర్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు మాట్లాడుతూ.... సీఎం కేసీఆర్ దళితుల అభ్యున్నతి కోసం దళిత



బంధు పథకం రూపొందించారని, మొదటి విడత కింద ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో పైలెట్ ప్రాజెక్టు ద్వారా 100 మంది లబ్ధిదారులను ఎంపిక చేశామని తెలిపారు. మార్చి లో ప్రవేశపెట్టె బడ్జెట్ లో రూ.20వేల కోట్లు పైగా నిధులు దళిత బందుకు కేటాయిస్తారని, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 2000 మంది లబ్ధిదారులకు అమలు చేస్తామని తెలిపారు. దళిత బంధు పథకం ఎన్నికల కోసం రూపొందించలేదని, చివరి దళిత లబ్ధిదారుడి వరకు పథకం కొనసాగుతుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.మండల స్థాయిలో లబ్ధిదారుల ఎంపిక బాధ్యత అప్పగించి, 100 మందిని ఎంపిక చేయడం జరిగిందని ఎమ్మెల్యే తెలిపారు. నూతన రాష్ట్రం ఏర్పడిన తరువాత కోరుట్ల నియోజకవర్గంలో ఇప్పటికే 500 సబ్సిడీ ట్రాక్టర్లు పంపిణీ చేశామని తెలిపారు. దేశంలోని ఏ ఇతర రాష్ట్రాల్లో అమలు చేయని విధంగా రైతు సంక్షేమం కోసం రైతు బంధు రైతు బీమా పథకాలను సీఎం కేసీఆర్ అమలు చేస్తున్నారని అన్నారు.

కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకం ద్వారా 10 లక్షల ఆడపిల్లల పెళ్లిళ్లకు ప్రభుత్వం సహాయం చేసిందని, 10 లక్షలకు పైగా కేసిఆర్ కిట్ అందించామని అన్నారు.ప్రధానమంత్రి సొంత రాష్ట్రమైన గుజరాత్ లో సైతం వృద్ధులకు 600 పెన్షన్ ఇస్తారని , సీఎం కేసీఆర్ ఆసరా పెన్షన్ ల కింద ప్రతి నెల 2000 అందిస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు.సంక్షేమ పథకాలతో పాటు నీటిపారుదల ప్రాజెక్టులను సైతం తెలంగాణ ప్రభుత్వం పూర్తి చేసిందని, ఫిబ్రవరి మాసంలో సైతం నిండు కుండలా ప్రాజెక్టులు ఉన్నాయని, కాళేశ్వరం ప్రాజెక్టు ను మూడు సంవత్సరాల్లో పూర్తి చేసామని తెలిపారు. దళితుల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టిన దళిత బందు పథకాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని, మార్కెట్ స్థితిగతులను అంచనా వేసుకొని యూనిట్ ఎంపిక చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు.గ్రామాల్లో సైతం పెద్ద సంఖ్యలో కార్లు, ట్రాక్టర్ అందుబాటులో ఉన్నాయని, ఎంపిక చేసుకునే యూనిట్ మనకు ఆర్థిక ఉపయోగపడాలని ఎమ్మెల్యే తెలిపారు. లబ్ధిదారుడు రెండు లేదా మూడు చిన్న యూనిట్లు సైతం ఏర్పాటు చేసుకోవచ్చని, 2 సంవత్సరాల కాలంలో రెండింతలు సంపాదించే దిశగా ప్రణాళిక రూపొందించుకోవాలని ఎమ్మెల్యే కోరారు. మున్సిపల్ ఛైర్పర్సన్లు, జెడ్పిటిసిలు, ఎం.పి.పి.లు, ఎం.పి.టి.సి.లు, సర్పంచ్లు,రైతు సమన్వయ సమితి సభ్యులు, ఇతర ప్రజా ప్రతినిధులు, ఈ డి ఎస్ సి కార్పొరేషన్ లక్ష్మీనారాయణ, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి , ఎల్.డి.ఎం ,రవాణా అధికారులు, ఎంపీడీవో, తహసిల్దార్లు, లబ్ధిదారుల కుటుంబసభ్యులు, తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.







అనీలా, మెడిసన్ స్టూడెంట్, ఉక్రేయిన్, డిప్యూటీ స్పీకర్‌ను కలిసి ఆవేదన వ్యక్తం చేస్తున్న అనీలా తండ్రి, అనీలా ఉంటున్న కివీ సిటీకి 20 కిమీ దూరంలో పడిన బాంబు

# ఉక్రేయిన్‌లో చిక్కుకుపోయిన సికింద్రాబాద్ మెడికో

## ఆందోళనలో అనీలా తల్లిదండ్రులు - ప్రభుత్వం స్పందించాలని వేడుకోలు

**సికింద్రాబాద్ ఫిబ్రవరి 24 (ప్రజామంటలు):** రష్యా యుద్ధం ప్రారంభించడంతో అటు ఉక్రేయిన్ లో చిక్కుకుపోయిన భారతీయులు, ఇటు వారి కుటుంబసభ్యులు తీవ్ర ఆందోళన లో ఉన్నారు. సికింద్రాబాద్ మైలార్ గడ్డకు చెందిన జి.మనోహర్ బాబు, శాంతిలకు ముగ్గురు కూతుళ్ళు. పెద్ద కూతురు అనీలా 2016 లో మెడిసన్ చదివేందుకు ఉక్రేయిన్ వెళ్ళింది. గత వారం రోజుల నుంచి రష్యా-ఉక్రేయిన్ ల మద్య నెలకొన్న యుద్ధ వాతావరణంతో అటు అనీల, ఇటు ఆమె తల్లిదండ్రులు తీవ్ర ఒత్తిడిలో ఉన్నారు. విమాన టిక్కెట్ ధర ఎంతైనప్పటికీ వెంటనే ఇండియాకు వచ్చేయమని తాము అనీలకు ఫోన్ చేసి చెప్పామని, కాని ఫ్లైట్ టిక్కెట్లు దొరకడం లేదని చెప్పినట్లు తండ్రి మనోహర్ బాబు తెలిపారు. ఇప్పుడు వార్ ప్రారంభం కావడంతో తాము తీవ్ర ఆందోళనగా ఉన్నామని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం మానవతాదృక్పదంతో ఆలోచించి, ఎలాగైన అక్కడ చిక్కుకుపోయిన ఇండియన్స్ ను రప్పించాలని కోరారు.
గురువారం సాయంత్రం ఉక్రేయిన్ లోని అనీలా తో వాట్సాప్ కాల్‌లో మాట్లాడగా...అక్కడి భీతావహ పరిస్థితులను వివరించారు.

**ఆమె మాటల్లో...**

" మేము ఉక్రేయిన్ రాజధాని కీవ్ లోని ఓ అపార్ట్ మెంట్ హాస్టల్ లో ఉంటున్నం, తమ ఏరియా నుంచి 20 కిమీ దూరంలో ఈ రోజు ఉదయం బాంబు దాడి జరిగింది, కొద్ది సేపట్లో సూపర్ మార్కెట్లు క్లోజ్ చేస్తారని తెలియడంతో ఇప్పుడే సరుకులు తెచ్చుకున్నాం. ఇండియాకు రావడానికి గత వారం రోజులుగా ఫ్లైట్ టిక్కెట్ల కోసం చాలా ప్రయత్నాలు చేశాం..కాని రూ 30వేల ధర ఉన్న టిక్కెట్ 60, 90 వేలకు పెంచి విక్రయించారు..చివరికి ఎలాగైన వెళ్దామని నిర్ణయించుకున్న ప్పటికీ టిక్కెట్లు దొరకలేదు.., కీవ్ లో మొత్తం 15వేల మంది ఇండియన్స్ ఉన్నారు, అలాగే 8వేల మంది వైద్య విద్యార్థులున్నారు.. అయితే ఇంత మందికి కేవలం మూడు, నాలుగు విమానాలు ఎలా సరిపోతాయి ? "




మిలిటరీని హెల్ప్ అడుగుతూ కివీ సిటీలో చిన్నారుల ప్రదర్శన

ఇక ఇప్పుడైతే ఉక్రేయిన్‌లో ఏయిర్పోర్టులన్నీ మూసివేయడంతో అక్కడివారు విమాన ప్రయాణం ద్వారా తిరిగి రావడం కష్టమని, కాని ఇతర మార్గాల ద్వారా అక్కడి వారిని ఇండియాకు తరలించడానికి కేంద్రం సమాలోచనలు చేస్తున్నట్లు సమాచారం.

**డిప్యూటి స్పీకర్ను కలిసిన అనీలా తండ్రి:**

తమ కూతురు ఉక్రేయిన్ లో చిక్కుకుపోయినందున భారత ప్రభుత్వంతో మాట్లాడి ఎలాగైన అక్కడివారిని ఇండియాకు తీసుకురావాలని కోరుతూ గురువారం సాయంత్రం అనీలా తండ్రి మనోహర్ బాబు డిప్యూటీ స్పీకర్ పద్మారావును కలసి విజ్ఞప్తి చేశారు. విషయాన్ని మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్ళి, తగిన సహాకారం కోసం కేంద్రాన్ని కోరుతామని ఆయన హామీనిచ్చారు.

# ఆశగా ఎదురు చూస్తున్నా

(కవిత)

వెలుగు కన్నెత్తి అయినా
చూడని చీకటి గదిలో
ఒంటరితనపు పక్కమీద
నిద్ర పట్టక దొర్లుతూ
వేల కాంతుల సందడి తెచ్చే
నా బిడ్డల ఆప్యాయమైన
పిలుపు ఏనాటికైనా
నన్ను చేర పోతుందా అని
ఆశతో ఎదురు చూస్తూ....

నానమ్మ అని ప్రేమగా పిలిచే
నా మనుమలు మనమరాళ్ల
తీయని స్వరం ఏనాటికైనా
నా చెవులారా వినకపోతానా అని
అనుక్షణం ఆలోచిస్తూ......

నాలో నేనే అలమటిస్తున్నా
కలలు కన్నీరైపోయే
ఆశలు ఆవిరై పోయె
గుండె బరువెక్కి పోయె
కాటికి కాలు చాపిన వయసులో
కన్న బిడ్డల కోసం
అలమటిస్తూ.....

చావు కూడా దరి చేరలేని
నిస్సహాయ స్థితిలో
నాలుగు గోడల మధ్య
కాలం వెళ్లబుచ్చుతూ.....

అందరూ ఉన్న ఏకాకినై
నాలో నేనే రోదిస్తూ
ఈ ఒంటరి గూడులో



నేనొక ఒంటరినై
అలమటిస్తున్నా
ఏనాటికైనా
నా బిడ్డలు
ప్రేమ ఆప్యాయతలు
పంచకపోతారా అని
ఆశగా ఎదురు చూస్తూ.

– బుదారపు లావణ్య
జనగామ

# అషూకు అనుకోని ఘటన

డబ్‌స్మాష్‌లతో బాగా పాపులరైంది అషూ రెడ్డి. జూనియర్ సామ్‌గా పేరు తెచ్చుకున్న ఈ బ్యూటీ సోషల్ మీడియాలో విపరీతమైన ఫాలోయింగ్‌ను సంపాదించుకుంది. పలు షోలతో బుల్లితెరపై సందడి చేస్తున్న ఈ భామ బిగ్‌బాస్ ఓటీటీలో పాల్గొనబోతుందంటూ పుకార్లు షికార్లు చేస్తున్నాయి. ఈ తరుణంలో తాజాగా ఇన్‌స్టాగ్రామ్ లైవ్ నిర్వహించిన అషూ ఈ విషయాన్ని తనే లీక్ చేసింది. ఇన్‌స్టా లైవ్‌లో జెస్సీతో ముచ్చటించింది అషూ.ఈ సందర్భంగా జెస్సీ తన సినిమా అప్‌డేట్స్ చెప్పుకురాగా.. బయటకు వచ్చాకే నీ సినిమా చూస్తాను జెస్సీ అంటూ బిగ్‌బాస్‌లోకి వెళ్తున్నట్లు చెప్పకనే చెప్పింది. దీంతో జెస్సీ.. దీన్నే నోటిదూల అంటారని సెటైర్ వేశాడు.

# విలేజ్ బ్యాక్ డ్రాప్‌లో మాచర్ల నియోజకవర్గం

గతేడాది నితిన్ నటించిన 'చెక్, రంగ్ దే, మాస్ట్రో చిత్రాలు వరసగా పరాజయం పాలయ్యాయి. అంతకు ముందు 'భీష్మ' మూవీతో బ్లాక్ బస్టర్ అందుకున్న అతడు కథల్ని జడ్జ్ చేయడంలో మళ్ళీ తడబడ్డాడు. 'అ, ఆ' చిత్రానికి ముందు నితిన్ కెరీర్ ఇలాగే సాగింది. అందుకే తదుపరి చిత్రాలకోసం బలమైన కథాంశాల్ని ఎంపిక చేసుకుంటున్నాడు నితిన్. ఈ క్రమంలో నితిన్ తాజాగా నటిస్తున్న చిత్రం 'మాచర్ల నియోజకవర్గం'. ఎడిటర్ శేఖర్ ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయం అవుతున్నాడు. ఇప్పటికే కొంతమేర షూటింగ్ జరుపుకున్న ఈ సినిమాకు ఇండస్ట్రీ వర్గాల్లో పాజిటివ్ బజ్ వినిపిస్తోంది. దానికి తగ్గట్టుగానే కథకథనాలు చాలా ఆసక్తికరంగా ఉండబోతున్నాయట. టైటిల్ ను బట్టి ఇదో పొలిటికల్ థ్రిల్లర్ అని అర్థమవుతోంది. ఇందులోని స్ట్రాంగ్ పొలిటికల్ పాయింట్సే సినిమాకి హైలైట్స్ అని తెలుస్తోంది. ఒక రకంగా ఇది రామ్ చరణ్ , సుకుమార్ క్లాసిక్ పీరియాడికల్ మూవీ 'రంగస్థలం' చిత్రం లాంటిదే అనే మాట వినిపిస్తోంది. కథలో ఆ లక్షణాలు కనిపిస్తాయని అంటున్నారు. రంగస్థలం' చిత్రం పీరియాడికల్ డ్రామా అయినప్పటికీ ఇదో పొలిటికల్ థ్రిల్లర్. ఒక గ్రామంలో ఎప్పుడూ ఏకగ్రీవంగా ఎన్నికయ్యే ఓ ప్రెసిడెంట్.. అతడ్ని ఎలాగైనా ఓడించాలని బరిలోకి దిగిన ఒక యువకుడు. అసలు కథ ఇక్కడినుంచే మొదలవుతుంది. ఆ తర్వాత 'రంగస్థలం' రివెంజ్ డ్రామాగా టర్న్ తీసుకుంటుంది. సరిగ్గా 'మాచర్ల నియోజకవర్గం' చిత్రంకూడా ఇదే కథాంశంతో రూపొందుతోందట. మాచర్ల నియోజక వర్గంలోని ఒక గ్రామంలో ఎన్నికల్లో ఎప్పుడూ ఏక గ్రీవంగా ఎన్నుకోబడే విలన్ ను ఎదిరించడానికి హీరో రంగంలోకి దిగుతాడట. గతంలో మోహన్ బాబు నటించిన 'అసెంబ్లీ రౌడీ' కూడా ఇదే కథాంశంతో వచ్చిన సంగతి తెలిసిందే. అందులోని బలమైన కథాకథనాలు, ఎమోషన్స్ వల్లనే సినిమా సూపర్ హిట్టయింది. ఇంకా మరికొన్ని చిత్రాలు ఈ తరహా కథలతో తెరకెక్కి సూపర్ హిట్ అయ్యాయి. ఇక ఇందులో నితిన్ మేకోవర్, లాంగ్వేజ్, బాడీ లాంగ్వేజ్ పూర్తి భిన్నంగా ఉంబోతున్నాయట. ఇంతకు ముందు ఎప్పుడూ లవ్ స్టోరీలు, యాక్షన్ చిత్రాల్లో నటించిన నితిన్ మొదటి సారిగా 'మాచర్ల నియోజక వర్గం' చిత్రం లాంటి పొలిటికల్ థ్రిల్లర్ లో నటిస్తుండడం ఆసక్తిని రేపుతోంది. ఇందులో నితిన్ తరహా ఎంటర్ టైన్ మెంట్ కి ఢోకా ఉండదట. కృతి శెట్టి కథానాయికగా నటిస్తున్న ఈ సినిమాకి మణిశర్మ తనయుడు మహతి స్వర సాగర్ సంగీతం అందిస్తున్నాడు. మరి ఈ సినిమాతో నితిన్ తిరిగి ఫామ్ లోకి వస్తాడని ఆశిద్దాం.



# రాధేశ్యామ్ చిత్రాన్ని విశ్లేషిస్తున్న జక్కన్న

పాన్ ఇండియా స్టార్, యంగ్ రెబల్ స్టార్ హీరో ప్రభాస్ అభిమానులు ఎగ్జయిటింగ్‌గా ఎదురుచూస్తున్న చిత్రం రాధేశ్యామ్. విజువల్ వండర్‌గా రాబోతున్న ఈ చిత్రం మార్చి 11న థియేటర్లలో ప్రపంచవ్యాప్తంగా సందడి చేయనుంది. ప్రభాస్, పూజాహెగ్డే యూనివర్సల్ లవ్ ట్రాక్ తో ఎంటర్ టైన్ చేసేందుకు రెడీ అవుతున్నారు. అయితే ఈ ప్రాజెక్టుకు సంబంధించిన వార్త ఒకటి బయటకు వచ్చింది. రాధాకృష్ణ కుమార్ ఆధ్వర్యంలో రెడీ చేసిన రాధేశ్యామ్ ఫైనల్ కట్ పట్ల ప్రభాస్ సంతృప్తికరంగా లేడట. దీంతో సినిమా కథనంపై సరైన అవగాహన పొందేందుకు గుడ్ ఫ్రెండ్ అయిన డైరెక్టర్ ఎస్ ఎస్ రాజమౌళిని సాయం చేయాలని కోరాడట. జక్కన్న ప్రస్తుతం ప్రభాస్ టేబుల్ పక్కనే కూర్చొని సినిమాలో వచ్చే కొన్ని సీన్లను ప్రేక్షకులకు మరింత ఎగ్జయిటింగ్‌గా అనిపించేలా చూస్తున్నాడన్న వార్త టాక్ ఆఫ్ ది టౌన్‌గా మారింది. సాహో సినిమాలాగా డిజాస్టర్ టాక్ రాకుండా..యావరేజ్ కన్నా ఎక్కువగా లేదంటే బ్లాక్ బాస్టర్ టాక్ వచ్చేలా చేసేందుకు జక్కన్న సాయం తీసుకోవాలని ఫిక్స్ అయ్యాడట ప్రభాస్. మరి రాజమౌళి లాంటి లెజండరీ డైరెక్టర్ సలహాలు ఇస్తానంటే రాధేశ్యామ్ టీం కూడా ఎలాంటి అభ్యంతరం చెప్పదు. బాహుబలి సినిమాతో ట్రెండ్ క్రియేట్ చేసిన జక్కన్న సాయం రాధేశ్యామ్‌కు ఏవిధంగా ఉపయోగపడుతుందోనని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు సినీ జనాలు.

# కళకు కులమత ప్రాంతీయ భేదాలు లేవని చాటారు

## బీమ్లా నాయక్ ఫంక్షన్‌కు కెటిఆర్ రావడంపై పవన్‌కల్యాణ్ కృతజ్ఞతలు

'కళను అక్కున చేర్చుకొని అభినందించడానికి కుల, మత, భాష, ప్రాంతీయ బేధాలుండవు. అంతే కాదు భావ వైరుధ్యాలు అడ్డంకి కాబోవు. ఈ వాస్తవాన్ని మరోమారు తెలియజెప్పిన తెలంగాణ రాష్ట్ర ఐటీ, మున్సిపల్ శాఖా మంత్రి కల్వకుంట్ల తారక రామారావు గారికి నిండైన హృదయంతో కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని పవన్‌కల్యాణ్ అన్నారు. ఆ మేరకు ఆయన ప్రకటన విడుదల చేశారు. బుధవారం రాత్రి జరిగిన భీమ్లానాయక్ ప్రీ రిలీజ్ వేడుకకు కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరైన సంగతి తెలిసిందే! ఈ సందర్భంగా పవన్‌కల్యాణ్ కేటీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అంతర్జాతీయ సదస్సులో బిల్ గేట్స్ తో కీలకమైన వర్చువల్ మీట్‌కు సన్నద్ధమవుతూ బిజీగా ఉన్నా సమయం వెసులుబాటు చేసుకొని భీమ్లా నాయక్ ప్రి రిలీజ్ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎంత భావ వైరుధ్యాలున్నా.. రాజకీయ విమర్శలు చేసుకున్నా వాటిని కళకు, సంస్కృతికి అంటనీయకపోవడం తెలంగాణ రాజకీయ నేతల శైలిలో ఉంది.

ప్రస్తుత హరియాణ గవర్నర్ బండారు దత్తాత్రేయ ప్రతి ఏటా నిర్వహించే అలయ్ బలయ్ కార్యక్రమంలో అన్ని పక్షాలవారు ఆత్మీయంగా ఉండటాన్ని చూశాం. అటువంటి ఆత్మీయత కె.టి.ఆర్. లో ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. సృజనాత్మకత, సాంకేతికత, మేళవింపుతో కొనసాగే సినిమా రంగాన్ని ప్రోత్సహిస్తూ.. ఈ రంగం అభివృద్ధికి ఆలోచనలను కె.టి.ఆర్. చిత్తశుద్ధితో పంచుకున్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన తెలంగాణ రాష్ట్ర సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్ కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియచేస్తున్నానని ప్రకటనలో పేర్కొన్నారు.



PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE.
EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL/2021/81092. FILE NO.1349985
PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com